VELTHURU TELUGU DAILAY
# వెలుతురు
తెలుగు దిన పత్రిక
హైదరాబాద్
శనివారం 09.05.2026
సంపుటి: 07 సంచిక: 336
పేజీలు: 12 వెల: రూ. 5/
Velthuru Newspaper
SRI SHANTHI PUBLICATIONS PUBLISHED FROM TELANGANA I ANDHRA PRADESH



## బెంగాల్ ముఖ్యమంత్రిగా సువేందు అధికారి

2

- బీజేపీ శాసనసభాపక్ష నేతగా ఎన్నిక
- అమిత్‌షా సమక్షంలో కోల్‌కతాలో కీలక సమావేశం
- బెంగాల్ కొత్త ముఖ్యమంత్రిని అధికారికంగా ప్రకటించిన షా
- నేడే కొత్త ప్రభుత్వ ప్రమాణస్వీకారానికి ఏర్పాట్లు
- మోదీ, అమిత్‌షా సహా కేంద్ర మంత్రుల హాజరు అవకాశం

# కేటీఆర్ నోరు అదుపులో పెట్టుకోవాలి

- ఇష్టారాజ్యంగా మాట్లాడితే ఊరుకోము
- మోదీ సభతో తెలంగాణలో బీజేపీ జోష్: బండి సంజయ్
- ఈనెల 10న పరేడ్ గ్రౌండ్‌లో మోదీ భారీ సభ
- సభను విజయవంతం చేయాలని ప్రజలకు బండి సంజయ్ పిలుపు
- కేంద్ర నిధులతోనే తెలంగాణ అభివృద్ధి జరుగుతోందన్న వ్యాఖ్యలు
- కాంగ్రెస్ తెలంగాణ సొమ్మును ఢిల్లీకి పంపుతోందని ఆరోపణ
- డబుల్ ఇంజిన్ సర్కార్‌తోనే రాష్ట్రానికి మేలు జరుగుతుందన్న బీజేపీ నేత
- 'జై శ్రీరాం.. జై తెలంగాణ'తో సభ దద్దరిల్లుతుందన్న సంజయ్

వెలుతురు, హైదరాబాద్ మే 08:

కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ హైదరాబాద్‌లోని ఆర్టీసీ క్రాస్‌రోడ్స్ వద్ద మీడియాతో మాట్లాడుతూ బీజేపీ శక్తి ప్రదర్శనకు సిద్ధమవుతోంద న్నారు. ఈనెల 10న పరేడ్ గ్రౌండ్‌లో ప్రధాని మోడీ పాల్గొనే భారీ బహిరంగ సభను విజయవంతం చేయాలని ప్రజలకు పిలుపునిచ్చారు. తెలంగాణ ప్రజల ఆశీర్వాదం కోసం మోదీ రాష్ట్రానికి వస్తున్నార ని తెలిపారు.తెలంగాణ అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం వేల కోట్ల రూపాయల నిధులు కేటాయిస్తోందని బండి సంజయ్ పేర్కొన్నారు. కేంద్ర సహకారం లేకపోతే రాష్ట్రంలో అభివృద్ధి సాధ్యమే కాదన్నారు. ఢిల్లీ నుంచి నిధులు తెచ్చి రాష్ట్రానికి అందిస్తుంటే.. కాంగ్రెస్ నాయకులు తెలంగాణ

..మిగతా 2లో





# మూసీ పునరుజ్జీవనానికి ముహూర్తం ఖరారు

2

- ఆగస్టు నుంచి పనులు షురూ
- వచ్చే ఏడాది డిసెంబర్ నాటికి పూర్తి
- రబ్బర్ డ్యాంలతో పర్యాటక శోభ
- 5 కి.మీ మేర తొలి దశ పనులకు గ్రీన్ సిగ్నల్
- నదిలో పర్యాటకాన్ని పెంచేలా వినూత్న చర్యలు
- ఆసియా అభివృద్ధి బ్యాంక్ తో నిధులు
- నార్సింగి నుంచి గౌరెల్లి వరకు ఎలివేటెడ్ కారిడార్
- నివాసాలపై ప్రభావం పడకుండా అలైన్‌మెంట్లు

హైదరాబాద్ వెలుతురు మే 08:

భాగ్యనగర గుండెకాయ లాంటి మూసీ నదికి పునర్వైభ వం తీసుకువచ్చేందుకు ప్రభుత్వం అడుగులు వేగవంతం చేసింది. మూసీ పునరుజ్జీవ ప్రాజెక్టు పనులను ఈ ఏడాది ఆగస్టు నాటికి ప్రారంభించి, వచ్చే ఏడాది డిసెంబర్ నాటికి మొదటి దశను పూర్తి చేయాలని మంత్రివర్గ ఉపసంఘం అధికారులను ఆదేశించింది. శనివారం ప్రజాభవన్‌లో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క అధ్యక్షతన కేబినెట్ సబ్ కమిటీ సభ్యులు శ్రీధర్ బాబు, పొన్నం ప్రభాకర్ సమావే శమై ప్రాజెక్టు పురోగతిపై సుదీర్ఘంగా చర్చించారు. ప్రజల ఆస్తులకు, నివాసాలకు ఇబ్బంది కలగకుండా, అత్యంత పారదర్శకంగా ఈ ప్రాజెక్టును పట్టాలెక్కించాలని మంత్రులు దిశానిర్దేశం చేశారు.

..మిగతా 2లో



2

## డీఎంకేకాంగ్రెస్ బ్రేకప్..!

- ఇండియా కూటమికి గుడ్ బై చెప్పిన డీఎంకే
- తమిళనాడులో దశాబ్దాల రాజకీయ బంధానికి డీఎంకే అధికారికంగా ముగింపు
- లోక్‌సభలో విడిగా సీట్లు కోరుతూ స్పీకర్‌కు కనిమొళి లేఖ
- టీవీకేకు కాంగ్రెస్ మద్దతుపై తీవ్ర అసంతృప్తితో డీఎంకే నిర్ణయం

చెన్నై, మే 8 (వెలుతురు): తమిళనాడు రాజ కీయాల్లో కీలక మలుపు చోటుచేసుకుంది. దశాబ్దాలుగా కొనసాగుతున్న డీఎంకేకాం గ్రెస్ రాజకీయ పొత్తు అధికారికంగా ముగి సినట్లు స్పష్టమైన సంకేతాలు వెలువడ్డాయి. ఇటీవల జరిగిన తమిళనాడు అసెంబ్లీ ఎన్ని కల ఫలితాల తర్వాత రాష్ట్ర రాజకీయ సమీక రణాలు పూర్తిగా మారిపోవడంతో, ప్రతిపక్ష ఇండియా కూటమిలో అంతర్గత విభేదాలు ఒక్కసారిగా బయటపడ్డాయి. ముఖ్యంగా టీవీకేకు కాంగ్రెస్ పార్టీ మద్దతు తెలపడం డీఎంకే నాయకత్వాన్ని తీవ్ర అసహనానికి గురి చేసినట్లు తెలుస్తోంది. ఈ పరిణామాల మధ్య డీఎంకే కీలక నిర్ణయం తీసుకోవడం దేశ రాజకీయాల్లో చర్చనీయాంశమైంది.

..మిగతా 2లో



# కొడంగల్‌ను దేశానికి ఆదర్శంగా తీర్చిదిద్దుతాం

- 2027 డిసెంబర్ నాటికి కొడంగల్‌లో అన్ని అభివృద్ధి పనులు పూర్తి చేస్తాం
- నారాయణపేటకొడంగల్ ఎత్తిపోతల పథకంతో కృష్ణా జలాలు తీసుకొస్తాం
- కొడంగల్‌ను రాష్ట్ర స్థాయి ఎడ్యుకేషన్, ఇండస్ట్రియల్ హబ్‌గా అభివృద్ధి చేస్తున్నాం
- ప్రజల ఆశీర్వాదం, కార్యకర్తల కష్టంతోనే సీఎం స్థాయికి వచ్చాను
- గుడిగడి కలిసొచ్చి కొడంగల్‌ను బంగారు తునకగా మార్చుకోవాలి: సీఎం రేవంత్ రెడ్డి

హైదరాబాద్, మే 8 (వెలుతురు):

కొడంగల్‌ను దేశానికి ఆదర్శంగా తీర్చిదిద్దుతామని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. శుక్రవారం కొడంగల్‌లో నిర్వహించిన బహిరంగ సభలో ము ఖ్యమంత్రి పలు అభివృద్ధి కార్యక్రమాలు, రాజకీయ ప్రయాణం, కొడంగల్ భవిష్యత్తుపై కీలక వ్యాఖ్యలు చేశారు. కొడంగల్‌లోని వెంకటేశ్వర స్వామి దేవాలయం తెలంగాణతో పాటు కర్ణాటక, మహారాష్ట్ర రాష్ట్రాల్లో కూడా "పేదల తిరుపతి"గా పేరుగాంచిందని పేర్కొన్నారు.2009లో తొలిసారి కొడంగల్ ఎమ్మెల్యేగా గెలవడానికి కార్యకర్తలు తమ చెమటను రక్తంగా మార్చి పనిచేశారని గుర్తుచేసుకున్నారు. 2018లో కొడంగల్‌లో ఓడిపో యిన తర్వాత కూడా కార్యకర్తలు మల్కాజిగిరి ఎంపీగా గెలిపించారని, ప్రజల ఆశీర్వాదంతోనే తెలంగాణ ముఖ్యమంత్రిగా ఎదిగానని తెలిపారు. కొడంగల్ నియోజకవర్గం ఒకవైపు గుడి, మరోవైపు గడితో ప్రత్యేకత కలిగిన ప్రాంతమని సీఎం పేర్కొన్నారు. గుడి, గడి కలిసి కొడంగల్‌ను పాడి పంటలతో కళకళలాడే నందనవనంగా మార్చాలని పిలుపునిచ్చారు.మాజీ ఎమ్మెల్యే నందారం సూర్యనారాయణ శ్రీ వెంకటేశ్వర స్వామి దేవాలయ అభివృద్ధికి టీటీడీ నుంచి నిధులు తీసుకువచ్చారని గుర్తుచేశారు. ఆగమశా స్త్ర సలహాదారు సుందరవరదాచార్యులు సూచించిన ముహూర్తం ప్రకారమే శంకుస్థాపన చేశామని తెలిపారు. ఆయన మరణం

..మిగతా 2లో



## మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసిన రాష్ట్ర డిజిపీ సివి. ఆనంద్

హైదరాబాద్ వెలుతురు మే 08:-

రాష్ట్ర రెవెన్యూ హౌసింగ్, సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి గారిని తెలంగాణ రాష్ట్ర డిజిపీ సి.వి. ఆనంద్ శుక్రవారం సచివాలయంలో మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛాన్ని అందజేశారు. మంత్రి గారు కూడా శాలువా కప్పి సి.వి. ఆనంద్ గారిని అభినందించారు. పోలీసింగ్‌లో రాష్ట్రం ఉన్నత శిఖరాలను చేరుకునేలా కృషి చేయాలని మంత్రి శ్రీనివాసరెడ్డి అభిలషించారు.

## నేడే విజయ్ ప్రమాణం



- ప్రభుత్వ ఏర్పాటుకు టీవీకేను ఆహ్వానించిన గవర్నర్
- మద్దతు లేఖలతో గవర్నర్‌ను కలిసిన విజయ్
- మూడు రోజుల్లో మూడోసారి రాజ్‌భవన్‌కు వెళ్లిన టీవీకే చీఫ్
- కాంగ్రెస్, సీపీఐ, సీపీఎం, వీసీకే మద్దతుతో మెజార్టీ
- తమిళనాడు రాజకీయాల్లో ఉత్కంఠకు తెర
- శనివారం ఉదయం 11 గంటలకు ప్రమాణస్వీకారం
- అతిపెద్ద పార్టీగా అవతరించిన టీవీకే
- బయటి నుంచే మద్దతిస్తామని వామపక్షాల స్పష్టీకరణ
- ప్రభుత్వంలో చేరబోమన్న సీపీఎం నేత యు.వాసుకి

2

# తలైవా 'సీఎం' పదవికి లైన్ క్లియర్

- టీవీకేకు కాంగ్రెస్ తర్వాత మరో బూస్ట్
- తమిళనాడులో మారుతున్న రాజకీయ సమీకరణాలు
- ద్రవిడ పార్టీలకు కొత్త సవాల్
- ప్రభుత్వ ఏర్పాటుకు టీవీకేకు మార్గం సుగమం
- వామపక్షాల మద్దతుతో టీవీకే జోష్



చెన్నై, మే 8 (వెలుతురు):

తమిళనాడు రాజకీయాల్లో సంచలనాత్మక పరిణామం చోటుచేసుకుంది. గత కొన్ని రోజులుగా కొనసాగుతున్న ఉత్కంఠకు తెరదించుతూ, నటుడు విజయ్ నేతృత్వంలోని తమిళ వెట్రి కజగం (TVK)కు వామపక్ష పార్టీలు తమ అధికారిక మద్దతు ప్రకటించాయి. సీపీఐ, సీపీఎం, వీసీకే పార్టీలు సంయుక్త ప్రకటన విడుదల చేస్తూ, రాష్ట్రంలో స్థిరమైన ప్రభుత్వం ఏర్పాటుకు టీవీకేతో కలిసి నడవనున్నట్లు స్పష్టం

..మిగతా 2లో



2

## ఇండియా కూటమికి డీఎంకే గుడ్‌బై

- కాంగ్రెస్‌తో పొత్తు ముగిసినట్టేనని స్పష్టీకరణ
- లోక్‌సభలో కాంగ్రెస్ పక్కన కూర్చోలేమన్న డీఎంకే
- ప్రత్యేక సీట్లు కేటాయించాలని స్పీకర్‌కు కనిమొళి లేఖ
- టీవీకేకు కాంగ్రెస్ మద్దతుపై డీఎంకే తీవ్ర అసంతృప్తి
- విజయ్ పార్టీకి సపోర్ట్ ఇవ్వడం కూటమి ధర్మానికి విరుద్ధమన్న డీఎంకే



## ఇరాన్‌కు ట్రంప్ 'లవ్ ట్యాప్'

- ఒప్పందం చేసుకోకపోతే తుడిచి పెట్టేస్తామని హెచ్చరిక
- కాల్పుల విరమణ రద్దయితే ఇరాన్ అంతం ఖాయం

2

## బీఆర్ఎస్ నేతలు మారలేదు

- తెలంగాణలో రాజకీయ అరాచకం చేస్తున్నారు
- కరీంనగర్ బంద్‌పై బీఆర్ఎస్‌పై పాయల్ శంకర్ విమర్శలు



2



2

## పాలనలో వేగం పెంచాలి

- స్పీడ్ గవర్నెన్స్‌పై సీఎం చంద్రబాబు కీలక సమీక్ష
- ఫైళ్ల క్లియరెన్స్ వేగం పెంచాలని అధికారులకు ఆదేశాలు
- మ్యాన్యువల్ ఫైళ్లను పూర్తిగా తగ్గించాలని సూచన
- ఈ-ఫైలింగ్ వ్యవస్థను బలోపేతం చేయాలని ఆదేశం
- 24 గంటల్లో ఈ-ఫైల్స్ డిస్పోజ్ లక్ష్యంగా చర్యలు

## కొడంగల్‌ను దేశానికి ఆదర్శంగా తీర్చిదిద్దుతాం

(మొదటి పేజీ తరువాయి)

బాధాకరమని, ఆయన పేరును శాశ్వతంగా నిలిచేలా ఒక విడిదికి పెట్టాలని సూచించారు. తిరుపతిలో ఎలా పూజలు నిర్వహిస్తారో, అదే సంప్రదాయంతో కొడంగల్ దేవాలయంలో కూడా పూజలు జరగాలని సీఎం స్పష్టం చేశారు. ఈ ఆలయ అభివృద్ధి కొడంగల్‌కు దేశవ్యాప్తంగా గుర్తింపు తీసుకొస్తుందని అభిప్రాయపడ్డారు. మాజీ ఎమ్మెల్యే గుర్నాథరెడ్డి ఎన్నిసార్లు గెలిచినా మంత్రి కాలేకపోయారని, కొడంగల్ అభివృద్ధి కోసం ఎన్నో విజ్ఞప్తులు చేసినా గత ప్రభుత్వాల్లో స్పందన రాలేదని విమర్శించారు. రాష్ట్ర అభివృద్ధి కోసం రోజుకు 18 గంటలు పనిచేస్తున్నామని సీఎం తెలిపారు. రైతు రుణమాఫీ, సన్న బియ్యం, రైతు భరోసా, ఇందిరమ్మ ఇళ్లు, రేషన్ కార్డులు, ఫీజు రీయింబర్స్‌మెంట్ వంటి సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నామని చెప్పారు. పేదల విద్య, వైద్యం కోసం ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంటోందన్నారు. గతంలో కొడంగల్ ప్రజలు విద్య కోసం వికారాబాద్, పరిగి ప్రాంతాలకు వెళ్లాల్సి వచ్చేదని, ఉపాధి లేక అనేక మంది వలస వెళ్లారని గుర్తుచేశారు. కొడంగల్ రాష్ట్రంలోనే ఎత్తైన ప్రాంతం కావడంతో సాగునీటి సౌకర్యం లేక వర్షం పండించలేని పరిస్థితి ఉండేదని, కందులు తప్ప ఇతర పంటలు సాగు కాలేదన్నారు. కొడంగల్‌లో ఇళ్లు కూడా నిర్మించుకోలేని అమాయకత్వం కొడంగల్ ప్రజలదని వ్యాఖ్యానించారు.

## కేటీఆర్ నోరు అదుపులో పెట్టుకోవాలి

(మొదటి పేజీ తరువాయి)

సొమ్మును ఢిల్లీ కాంగ్రెస్ పెద్దలకు పంపుతున్నారని ఆరోపించారు. కాంగ్రెస్ పార్టీని నడిపించేందుకు తెలంగాణ డబ్బును వినియోగిస్తున్నారని విమర్శించారు. డబుల్ ఇంజన్ సర్కార్‌తోనే తెలంగాణ మరింత అభివృద్ధి చెందుతుందని స్పష్టం చేశారు. 'జై శ్రీరాం.. జై తెలంగాణ' నినాదాలతో పరేడ్ గ్రౌండ్ సభ దద్దరిల్లుతుందని ధీమా వ్యక్తం చేశారు. తెలంగాణను అభివృద్ధి చేయడమే తమ లక్ష్యమని పేర్కొన్నారు. ఈ సందర్భంగా కేటీఆర్ పై బండి సంజయ్ తీవ్ర విమర్శలు గుప్పించారు. ''కేటీఆర్‌లా దోచుకోవడం నాకు తెలియదు.. రైతులకు బేడీలు వేయడం తెలియదు.. డ్రగ్స్ తీసుకోవడం మాకు తెలియదు'' అంటూ విమర్శించారు. కాళేశ్వరం, ఈ-ఫార్ములా, విద్యుత్ కొనుగోళ్లలో జరిగిన అవినీతిపై కూడా ఆరోపణలు చేశారు. ఫోన్‌ట్యాపింగ్, డ్రగ్స్ కేసులు తమకు సంబంధం లేదంటున్న కేటీఆర్ నోరు అదుపులో పెట్టుకోవాలని హెచ్చరించిన ఆయన.. ''నీ అహంకారంవల్లే కేసీఆర్ ఫాంహౌస్‌కే పరిమితమయ్యారు'' అని వ్యాఖ్యానించారు. బీఆర్ఎస్ కార్యకర్తలే కేటీఆర్‌ను చూసి అసహ్యించుకుంటున్నారని అన్నారు. రాష్ట్రంలో ఎప్పుడు ఎన్నికలు జరిగినా అధికారంలోకి వచ్చేది బీజేపీయేనని బండి సంజయ్ ధీమా వ్యక్తం చేశారు. మోదీ సభ తర్వాత తెలంగాణ రాజకీయాల్లో కీలక మార్పులు కనిపిస్తాయని వ్యాఖ్యానించారు.

## బీఆర్ఎస్ నేతలు మారలేదు

హైదరాబాద్ వెలుతురు మే 08:

బీజేఎల్పీ ఉప నేత, పాయల్ శంకర్ బీఆర్ఎస్ నేతలపై తీవ్ర స్థాయిలో విమర్శలు గుప్పించారు. హైదరాబాద్‌లో విడుదల చేసిన ప్రకటనలో ఆయన మాట్లాడుతూ.. తెలంగాణ ప్రజలు బీఆర్ఎస్‌ను ఛీత్కరిస్తున్నా ఆ పార్టీ నేతల్లో ఇప్పటికీ మార్పు రాకపోవడం సిగ్గుచేటని వ్యాఖ్యానించారు. కరీంనగర్ బంద్‌కు పిలుపునిచ్చిన బీఆర్ఎస్ నేతలు ఏ ప్రజా సమస్య పరిష్కారం కోసం ఆందోళన చేపడుతున్నారో ప్రజలకు చెప్పాలని డిమాండ్ చేశారు. పాడి కౌశిక్‌రెడ్డి నోటి దురుసే బీజేపీ కార్యకర్తల ఆగ్రహానికి కారణమని పేర్కొన్నారు. ఇందులో ప్రజా కోణం ఏముందో బీఆర్ఎస్ సమాధానం చెప్పాలని నిలదీశారు. కరీంనగర్ బంద్ పేరుతో అరాచకానికి పాల్పడాలని చూస్తున్నారా అంటూ ప్రశ్నించిన ఆయన.. గతంలో ప్రజా సంగ్రామ యాత్ర సమయంలో బీజేపీ కార్యకర్తల తలలు పగలకొట్టిన ఘటనలను గుర్తు చేశారు. వడ్ల కొనుగోలు కేంద్రాల పరిశీలనకు వెళ్లినప్పుడు బీజేపీ నాయకుల వాహనాలను ధ్వంసం చేసినప్పుడు ప్రజాస్వామ్యం గుర్తుకు రాలేదా అని విమర్శించారు.

## మూసీ పునరుజ్జీవనానికి ముహూర్తం ఖరారు

(మొదటి పేజీ తరువాయి)

మూసీ ప్రక్షాళనలో భాగంగా తొలి దశలో హిమాయత్ సాగర్ మరియు ఉస్మాన్ సాగర్ నుంచి బాపుఘాట్ వరకు ఉన్న 21 కిలోమీటర్ల ప్రాంతాన్ని అభివృద్ధి చేయనున్నారు. ఈ ప్రాజెక్టు కోసం అవసరమైన రూ. 7.55 వేల కోట్ల నిధుల సమీకరణపై ఆసియా అభివృద్ధి బ్యాంక్ అధికారులతో జరిపిన చర్చలు సఫలమయ్యాయని అధికారులు మంత్రులకు వివరించారు. నదిలో చెత్తను తొలగించి శుభ్రపరచడం, వరద నియంత్రణ కోసం రిటైనింగ్ వాల్స్ కట్టడం, నదికి ఇరువైపులా రోడ్ల నిర్మాణం వంటి పనులు ఈ దశలో చేపట్టనున్నారు. నార్సింగి నుంచి గౌరెల్లి వరకు మొత్తం 55 కిలోమీటర్ల మేర ఎలివేటెడ్ కారిడార్ మరియు రివర్ ఫ్రంట్ అభివృద్ధి చేయడమే ఈ ప్రాజెక్టు ప్రధాన లక్ష్యం.

## బెంగాల్ ముఖ్యమంత్రిగా సువేందు అధికారి

పశ్చిమ బెంగాల్ వెలుతురు మే 08:

పశ్చిమ బెంగాల్ రాజకీయాల్లో కీలక మలుపు చోటుచేసుకుంది. బీజేపీ శాసనసభాపక్ష నేతగా సువేందు అధికారి ఎన్నికయ్యారు. కోల్‌కతాలో జరిగిన భాజపా శాసనసభాపక్ష సమావేశంలో కేంద్ర హోంమంత్రి అమిత్ షా సమక్షంలో ఈ నిర్ణయం తీసుకున్నారు. సమావేశం అనంతరం సువేందు అధికారి పేరును బెంగాల్ కొత్త ముఖ్యమంత్రిగా అమిత్‌షా అధికారికంగా ప్రకటించారు. దీంతో బెంగాల్‌లో భాజపా ప్రభుత్వం ఏర్పాటు దిశగా కీలక ప్రక్రియ వేగవంతమైంది. రేపు కొత్త ప్రభుత్వం ప్రమాణస్వీకారం చేయనున్నట్లు సమాచారం. ఈ కార్యక్రమానికి ప్రధాని నరేంద్ర మోదీ, అమిత్‌షా, పలువురు కేంద్ర మంత్రులు, ఎన్డీయే కీలక నేతలు హాజరయ్యే అవకాశాలు ఉన్నాయని పార్టీ వర్గాలు చెబుతున్నాయి. భాజపా తొలిసారి పూర్తి స్థాయిలో బెంగాల్‌లో అధికారాన్ని చేపట్టనున్న నేపథ్యంలో దేశవ్యాప్తంగా ఈ పరిణామం రాజకీయ ప్రాధాన్యతను సంతరించుకుంది.

**కౌన్సిలర్ స్థాయి నుంచి సీఎం పీఠం వరకు**

1970 డిసెంబరు 15న తూర్పు మేదినీపుర్ జిల్లాలోని కర్కులీలో సువేందు అధికారి జన్మించారు. రాజకీయ నేపథ్యమున్న కుటుంబంలో జన్మించిన ఆయన తండ్రి సిసిర్ అధికారి రాష్ట్ర రాజకీయాల్లో ప్రభావశీల నాయకుడిగా గుర్తింపు పొందారు. ఎమ్మెల్యేగా, ఎంపీగా పనిచేసిన ఆయన యూపీఏ ప్రభుత్వ హయాంలో కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ సహాయమంత్రిగానూ బాధ్యతలు నిర్వర్తించారు. ఎంఏ పూర్తి చేసిన సువేందు రాజకీయాల్లోకి యువ వయసులోనే అడుగుపెట్టారు. 1995లో కాంగ్రెస్ పార్టీ తరఫున తొలిసారి కౌన్సిలర్‌గా విజయం సాధించారు. అనంతరం 1998లో తండ్రితో కలిసి తృణమూల్ కాంగ్రెస్ పార్టీలో చేరారు. పార్టీ ప్రారంభ దశ నుంచే చురుకైన పాత్ర పోషిస్తూ మమతా బెనర్జీకి అత్యంత విశ్వసనీయ నాయకుల్లో ఒకరిగా ఎదిగారు.

**2006 తర్వాత వేగంగా ఎదిగిన నాయకుడు**

2006లో కొంటాయి (దక్షిణ) నియోజకవర్గం నుంచి తొలిసారి ఎమ్మెల్యేగా ఎన్నికైన సువేందు అదే ఏడాది కొంటాయి మున్సిపాలిటీ ఛైర్‌పర్సన్‌గా బాధ్యతలు చేపట్టారు. మూడు సంవత్సరాల పాటు ఆ పదవిలో కొనసాగుతూ స్థానిక రాజకీయాల్లో తనదైన ముద్ర వేశారు. 2006 నుంచి 2009 మధ్య కాలంలో ఆయన రాజకీయంగా మరింత బలపడారు. తృణమూల్ పార్టీ గ్రామీణ స్థాయిలో బలోపేతం కావడంలో సువేందు పాత్ర కీలకమని అప్పట్లో రాజకీయ విశ్లేషకులు వ్యాఖ్యానించారు. ముఖ్యంగా తూర్పు మేదినీపుర్, జంగల్ మహల్ ప్రాంతాల్లో పార్టీ విస్తరణలో ఆయన ప్రభావం స్పష్టంగా కనిపించింది. సువేందు రాజకీయ జీవితంలో 2007 నాటి నందిగ్రామ్ ఉద్యమం కీలక మలుపు తీసుకొచ్చింది. అప్పటి వామపక్ష ప్రభుత్వం నందిగ్రామ్‌లో భారీ స్థాయిలో భూములను స్వాధీనం చేసుకుని ప్రత్యేక ఆర్థిక మండలి (సెజ్) ఏర్పాటు చేయాలని నిర్ణయించింది. దీనికి వ్యతిరేకంగా తృణమూల్ కాంగ్రెస్ పెద్దఎత్తున ఉద్యమం ప్రారంభించింది. ఆ ఉద్యమానికి సువేందు అధికారి నాయకత్వం వహించారు. రైతులు, స్థానిక ప్రజలను సమీకరించి వామపక్ష ప్రభుత్వానికి గట్టి సవాల్ విసిరారు. నందిగ్రామ్ ఉద్యమం రాష్ట్ర రాజకీయాల్లో భారీ మార్పులకు దారితీసింది.

# డీఎంకే-కాంగ్రెస్ బ్రేకప్..!

(మొదటి పేజీ తరువాయి)

డీఎంకే ఎంపీ కనిమొళి లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లాకు రాసిన లేఖతో ఈ రాజకీయ విభేదాలు అధికారిక రూపం దాల్చాయి. ఇప్పటి వరకు పార్లమెంటులో కాంగ్రెస్ సభ్యులతో కలిసి కూర్చుంటున్న డీఎంకే ఎంపీలకు ఇకపై విడిగా సీటింగ్ ఏర్పాటు చేయాలని ఆమె స్పీకర్‌ను కోరారు. మారిన రాజకీయ పరిస్థితుల నేపథ్యంలో కాంగ్రెస్‌తో తమ పార్టీకి ఇకపై ఎలాంటి పొత్తు లేదని, అందువల్ల సభలో కూడా విడిగా కూర్చోవడం సముచితమని లేఖలో పేర్కొన్నారు. డీఎంకే పార్లమెంటరీ పార్టీ సభ్యులకు ప్రత్యేక సీట్లు కేటాయిస్తే సభలో తమ బాధ్యతలను మరింత సమర్థవంతంగా నిర్వహించగలమని ఆమె స్పష్టం చేశారు. కనిమొళి లేఖ రాజకీయ వర్గాల్లో పెద్ద చర్చకు దారి తీసింది. ఇండియా కూటమిలో కీలక భాగస్వాములుగా ఉన్న డీఎంకే, కాంగ్రెస్ మధ్య విభేదాలు ఇంత బహిరంగంగా బయటపడటం ఇదే తొలిసారి అని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు. గత లోక్‌సభ ఎన్నికల సమయంలో కలిసి పోటీ చేసిన ఈ రెండు పార్టీలు ఇప్పుడు పరస్పరం దూరమవడం దక్షిణ భారత రాజకీయాలపై ప్రభావం చూపే అవకాశముందని అంచనా వేస్తున్నారు. ముఖ్యంగా తమిళనాడులో కాంగ్రెస్‌కు డీఎంకే మద్దతు లేకుండా భవిష్యత్ ఎన్నికల్లో బలంగా నిలబడటం కష్టమవుతుందనే అభిప్రాయాలు వినిపిస్తున్నాయి.ఇక ఈ రాజకీయ విభేదాలు కేవలం పార్లమెంట్ పరిమితుల్లోనే కాకుండా క్షేత్రస్థాయికి కూడా వ్యాపించాయి. డీఎంకేకాంగ్రెస్ మధ్య సంబంధాలు తెగిపోవడంతో కార్యకర్తల మధ్య ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. మయిలడుతురై ప్రాంతంలో కాంగ్రెస్ మద్దతుదారులపై డీఎంకే అనుచరులు భౌతిక దాడులకు పాల్పడిన ఘటన కలకలం రేపింది. నిన్నటి వరకు ఒకే వేదికపై కలిసి నినాదాలు చేసిన నాయకులు, కార్యకర్తలు ఇప్పుడు పరస్పరం ఘర్షణలకు దిగడం రాష్ట్ర రాజకీయాల్లో ఉద్రిక్తతను పెంచింది. ఈ ఘటన తర్వాత స్థానికంగా పోలీసు బందోబస్తు కూడా పెంచినట్లు సమాచారం. రాజకీయంగా చూస్తే తమిళనాడులో కొత్త శక్తి సమీకరణాలకు ఇది నాంది కావచ్చని విశ్లేషకులు చెబుతున్నారు. అసెంబ్లీ ఎన్నికల తర్వాత టీవీకే ప్రభావం పెరగడం, కాంగ్రెస్ వైఖరిలో వచ్చిన మార్పులు డీఎంకేకు అసౌకర్యంగా మారినట్లు తెలుస్తోంది. అదే సమయంలో డీఎంకే కూడా రాష్ట్రంలో తమ రాజకీయ ఆధిపత్యాన్ని కాపాడుకునేందుకు కాంగ్రెస్‌ను దూరం పెట్టే వ్యూహాన్ని అవలంబిస్తున్నట్లు భావిస్తున్నారు. లోక్‌సభ ఎన్నికల దిశగా ఈ పరిణామాలు దేశ రాజకీయాల్లో కీలక ప్రభావం చూపే అవకాశం ఉందని రాజకీయ పరిశీలకులు అంచనా వేస్తున్నారు.ఇండియా కూటమి ఐక్యతపై ఇప్పటికే అనేక సందేహాలు వ్యక్తమవుతున్న వేళ, డీఎంకేకాంగ్రెస్ పొత్తు ముగింపు ఆ కూటమికి పెద్ద దెబ్బగా మారింది. ఒకవైపు బీజేపీకి వ్యతిరేకంగా జాతీయ స్థాయిలో ఐక్యత అవసరమని ప్రతిపక్షాలు చెబుతుండగా, మరోవైపు భాగస్వామ్య పార్టీల మధ్యే విభేదాలు బయటపడటం కూటమి భవిష్యత్తుపై ప్రశ్నలు లేవనెత్తుతోంది. తమిళనాడు నుంచి ప్రారంభమైన ఈ రాజకీయ విభేదాలు ఇతర రాష్ట్రాలపై కూడా ప్రభావం చూపుతాయా అన్నది ఇప్పుడు ఆసక్తికరంగా మారింది.

# తలైవా 'సీఎం' పదవికి లైన్ క్లియర్

(మొదటి పేజీ తరువాయి)

చేశాయి. దీంతో తమిళనాడు రాజకీయ సమీకరణాలు ఒక్కసారిగా మారిపోయాయి. అసెంబ్లీ ఎన్నికల ఫలితాల తర్వాత ప్రభుత్వ ఏర్పాటుకు అవసరమైన స్పష్టమైన మెజారిటీ కోసం ఎదురుచూస్తున్న విజయ్‌కు ఈ నిర్ణయం భారీ ఊరటనిచ్చింది. ఇప్పటికే కాంగ్రెస్ పార్టీ టీవీకేకు మద్దతు ప్రకటించగా, ఇప్పుడు వామపక్షాలు కూడా అదే దారిలో నడవడం రాజకీయ వర్గాల్లో పెద్ద చర్చకు దారితీసింది. దశాబ్దాలుగా డీఎంకే ఏఐఏడీఎంకే చుట్టూనే తిరిగిన తమిళ రాజకీయాల్లో ఇప్పుడు కొత్త శక్తిగా టీవీకే ఎదుగుతుండటం విశేషంగా మారింది. సినీ రంగంలో అపారమైన ప్రజాదరణ సంపాదించిన విజయ్, రాజకీయాల్లోకి వచ్చిన అతి తక్కువ కాలంలోనే తనదైన ముద్ర వేసుకున్నారు. కేవలం అభిమాన సంఘాల పరిమితిలో కాకుండా, యువత, మధ్యతరగతి, ఉద్యోగ వర్గాలను ఆకర్షిస్తూ ప్రత్యామ్నాయ రాజకీయ శక్తిగా ఎదిగారు. ఇదే సమయంలో ద్రవిడ పార్టీలపై పెరుగుతున్న వ్యతిరేకతను అవకాశంగా మలుచుకుని, కాంగ్రెస్‌తో పాటు వామపక్షాలను ఒకే వేదికపైకి తీసుకురావడంలో విజయ్ వ్యూహాత్మకంగా ముందుకు సాగినట్లు విశ్లేషకులు చెబుతున్నారు."రాష్ట్ర సంక్షేమం, ప్రజల ఆకాంక్షల మేరకు ఒక సుస్థిర ప్రభుత్వాన్ని అందించేందుకు మేము టీవీకేకు మద్దతు ఇస్తున్నాం" అంటూ వామపక్ష నేతలు చేసిన ప్రకటన తమిళ రాజకీయాల్లో కొత్త సందేశాన్ని ఇచ్చింది. బీజేపీ వ్యతిరేక ఓట్లను ఒకే దిశగా సమీకరించడమే కాకుండా, డీఎంకే ఆధిపత్యానికి ప్రత్యామ్నాయం అవసరమనే అభిప్రాయం కూడా ఈ మద్దతు వెనుక ఉందని రాజకీయ పరిశీలకులు భావిస్తున్నారు.ఇక ఈ కీలక మద్దతుతో విజయ్ ముఖ్యమంత్రి పీఠాన్ని అధిరోహించేందుకు మార్గం దాదాపు సుగమమైనట్లే కనిపిస్తోంది.వామపక్షాల మద్దతు లేఖలు అందుకున్న విజయ్ అతి త్వరలోనే గవర్నర్‌ను కలిసి ప్రభుత్వ ఏర్పాటుకు హక్కు కోరనున్నట్లు సమాచారం. మరోవైపు, టీవీకే కార్యాలయాల వద్ద పార్టీ శ్రేణులు సంబరాలు ప్రారంభించాయి. "ఇది తమిళ రాజకీయాల్లో కొత్త ఆరంభం" అంటూ అభిమానులు విజయ్ పోస్టర్లకు పాలాభిషేకాలు చేస్తున్నారు. దశాబ్దాలుగా కొనసాగుతున్న ద్రవిడ రాజకీయాల కోటను బద్దలు కొడుతూ, తమిళనాడులో కొత్త రాజకీయ అధ్యాయానికి విజయ్ శ్రీకారం చుడుతున్నారా? అనే చర్చ ఇప్పుడు దేశవ్యాప్తంగా ఆసక్తికరంగా మారింది.

## ఇండియా కూటమికి డీఎంకే గుడ్‌బై

చెన్నై వెలుతురు మే 08:

దేశ రాజకీయాల్లో కీలక పరిణామంగా భావిస్తున్న నిర్ణయంలో భాగంగా డీఎంకే ఇండియా కూటమికి గుడ్‌బై చెప్పినట్లు ప్రకటించింది. ఇకపై కాంగ్రెస్ పార్టీతో తమ రాజకీయ పొత్తు కొనసాగదని స్పష్టం చేసింది. తమిళనాడు రాజకీయాల్లో ఇటీవల చోటుచేసుకున్న పరిణామాల నేపథ్యంలో ఈ నిర్ణయం తీసుకున్నట్లు పార్టీ వర్గాలు వెల్లడించాయి. లోక్‌సభలో తమ పార్టీ సభ్యులకు ప్రత్యేక సీట్లు కేటాయించాలని డీఎంకే ఎంపీ కనిమొళి స్పీకర్‌కు లేఖ రాశారు. కాంగ్రెస్ సభ్యుల పక్కన కూర్చోలేమని ఆ లేఖలో పేర్కొన్నట్లు సమాచారం. ఈ చర్యతో డీఎంకేకాంగ్రెస్ మధ్య విభేదాలు తీవ్ర స్థాయికి చేరినట్లు రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు.తమిళనాడు అసెంబ్లీ ఎన్నికల ఫలితాల అనంతరం నటుడు విజయ్ నేతృత్వంలోని టీవీకేకు కాంగ్రెస్ మద్దతు ప్రకటించడం డీఎంకే ఆగ్రహానికి ప్రధాన కారణంగా చెబుతున్నారు. ఇప్పటికే రాష్ట్ర రాజకీయాల్లో ప్రత్యామ్నాయ శక్తిగా ఎదగాలని ప్రయత్నిస్తున్న టీవీకేకు కాంగ్రెస్ అండగా నిలవడం కూటమి ధర్మానికి విరుద్ధమని డీఎంకే నేతలు మండిపడ్డారు. డీఎంకే ఎమ్మెల్యేలు, సీనియర్ నేతలు కాంగ్రెస్‌పై తీవ్ర విమర్శలు గుప్పించారు. ఇండియా కూటమి పేరుతో కలిసి పనిచేసి, చివరికి కాంగ్రెస్ వెన్నుపోటు పొడిచిందని ఆరోపించారు. తమిళనాడులో కాంగ్రెస్‌కు రాజకీయ ప్రాధాన్యం రావడానికి డీఎంకే సహకారమే కారణమని పేర్కొన్నారు. రాజ్యసభ సభ్యత్వాలు, అసెంబ్లీ స్థానాలు, లోక్‌సభ విజయాల్లో తమ పార్టీ కీలక పాత్ర పోషించిందని గుర్తుచేశారు. ఇకపై కాంగ్రెస్‌పై ఆధారపడకుండా ప్రజల్లో బలమైన ప్రతిపక్షంగా నిలబడాలని డీఎంకే నిర్ణయించుకున్నట్లు పార్టీ వర్గాలు తెలిపాయి. రాష్ట్ర హక్కులు, ప్రాంతీయ రాజకీయాల పరిరక్షణలో మరింత దూకుడుగా వ్యవహరించాలని పార్టీ అంతర్గత సమావేశాల్లో నిర్ణయించినట్లు సమాచారం. కాంగ్రెస్ వైఖరిపై ఇతర కూటమి పార్టీల నుంచీ అసంతృప్తి వ్యక్తమవుతోంది. అఖిలేశ్ యాదవ్ సైతం కాంగ్రెస్ నిర్ణయాన్ని వ్యతిరేకించినట్లు తెలుస్తోంది. స్వలాభాల కోసం మిత్రపక్షాలను వదిలేయడం సరైన రాజకీయ పద్ధతి కాదని ఆయన అభిప్రాయపడ్డారని రాజకీయ వర్గాల్లో చర్చ జరుగుతోంది. డీఎంకే తీసుకున్న ఈ నిర్ణయం ఇండియా కూటమి భవిష్యత్తుపై ప్రభావం చూపే అవకాశముందని విశ్లేషకులు అంచనా వేస్తున్నారు. ముఖ్యంగా దక్షిణ భారత రాజకీయాల్లో కొత్త సమీకరణాలకు ఇది దారితీయొచ్చని భావిస్తున్నారు.



# నేడే విజయ్ ప్రమాణం

చెన్నై వెలుతురు మే 08:

తమిళనాడు రాజకీయాల్లో నెలకొన్న ఉత్కంఠకు తెరపడింది. విజయ్ నేతృత్వంలోని తమిళ వెట్రి కళగం ప్రభుత్వ ఏర్పాటుకు గవర్నర్ గ్రీన్‌సిగ్నల్ ఇచ్చారు. ఇటీవల జరిగిన తమిళనాడు అసెంబ్లీ ఎన్నికల్లో టీవీకే అతిపెద్ద పార్టీగా అవతరించగా.. కాంగ్రెస్‌తో పాటు వామపక్షాలు, వీసీకే మద్దతు తెలపడంతో ప్రభుత్వం ఏర్పాటు దిశగా మార్గం సుగమమైంది. శుక్రవారం సాయంత్రం రాజేంద్ర విశ్వనాథ్ ఆర్లేకర్‌ను విజయ్ రాజ్‌భవన్‌లో కలిసి మద్దతు లేఖలను సమర్పించారు. మూడు రోజుల వ్యవధిలో మూడోసారి గవర్నర్‌ను కలిసిన ఆయన.. ప్రభుత్వం ఏర్పాటుకు తమను ఆహ్వానించాలని కోరారు. అనంతరం గవర్నర్ టీవీకేకు ప్రభుత్వ ఏర్పాటుకు అంగీకారం తెలపడంతో శనివారం ఉదయం 11 గంటలకు విజయ్ తమిళనాడు ముఖ్యమంత్రిగా ప్రమాణస్వీకారం చేయనున్నట్లు అధికారిక వర్గాలు వెల్లడించాయి.తమిళనాడు అసెంబ్లీ ఎన్నికల్లో టీవీకే 107 స్థానాలు గెలుచుకుని అతిపెద్ద పార్టీగా నిలిచింది. అనంతరం కాంగ్రెస్ ఐదు స్థానాలతో మద్దతు ప్రకటించింది. తాజాగా సీపీఐ, సీపీఎం, వీసీకే (విడుదతలై చిరుతైగల్ కట్చి) కూడా సమ్మతి తెలపడంతో టీవీకే కూటమి మెజార్టీ మార్కును చేరుకుంది. పార్టీల వారీగా సంఖ్యాబలాలు పరిశీలిస్తే టీవీకేకు 107 మంది ఎమ్మెల్యేలు ఉండగా.. కాంగ్రెస్‌కు 5, సీపీఐకి 2, సీపీఎంకు 2, వీసీకేకు 2 స్థానాలు ఉన్నాయి. ఈ మద్దతుతో అసెంబ్లీలో టీవీకే ప్రభుత్వం సునాయాసంగా బలపరీక్షను ఎదుర్కొనే పరిస్థితి ఏర్పడింది. ఇక ప్రభుత్వంలో భాగస్వామ్యం విషయంలో వామపక్షాలు కీలక ప్రకటన చేశాయి. టీవీకే ప్రభుత్వానికి బయట నుంచే మద్దతు ఇస్తామని, మంత్రివర్గంలో మాత్రం చేరబోమని సీపీఎం రాష్ట్ర నేత యూ వాసుకి స్పష్టం చేశారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. సీపీఐ, సీపీఎం రాష్ట్ర కమిటీలు సమావేశమై టీవీకే ప్రభుత్వ ఏర్పాటుకు బయటి నుంచి మద్దతు ఇవ్వాలని నిర్ణయించాయని తెలిపారు. అసెంబ్లీలో బలపరీక్ష సమయంలో టీవీకేకు అనుకూలంగా ఓటు వేస్తామని.. అయితే ప్రభుత్వంలో చేరే ఉద్దేశం లేదని స్పష్టం చేశారు. ప్రజా సమస్యల ఆధారంగానే వామపక్షాలు స్వతంత్రంగా వ్యవహరిస్తాయని పేర్కొన్నారు.లౌకికవాదం, ప్రజల ఐక్యత, రాష్ట్రాల హక్కుల పరిరక్షణ వంటి అంశాల్లో తమతో కలిసి వచ్చే ప్రతి లౌకిక పార్టీతో కలిసి పనిచేస్తామని ఆమె తెలిపారు. వామపక్షాల నిర్ణయానికి తాము కట్టుబడి ఉంటామని వీసీకే కూడా వెల్లడించినట్లు చెప్పారు. తమిళనాడు రాజకీయాల్లో కొత్త శకానికి నాంది పలుకుతూ విజయ్ నాయకత్వంలో ప్రభుత్వం ఏర్పడుతున్న నేపథ్యంలో రాష్ట్ర రాజకీయ సమీకరణాలు ఆసక్తికరంగా మారాయి. సినీ రంగం నుంచి రాజకీయాల్లోకి వచ్చిన విజయ్ తొలి ప్రయత్నంలోనే అధికార పీఠాన్ని అధిరోహించడం ఇప్పుడు దేశవ్యాప్తంగా చర్చనీయాంశమైంది.

# పాలనలో వేగం పెంచాలి

అమరావతి వెలుతురు మే 08:

రాష్ట్రంలో వేగవంతమైన పాలన (స్పీడ్ ఆఫ్ డెలివరింగ్ గవర్నెన్స్) లక్ష్యంగా ఫైళ్ల క్లియరెన్స్ ప్రక్రియను మరింత వేగవంతం చేయాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అధికారులకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. రెండో రోజు జరిగిన కలెక్టర్ల సదస్సులో ఫైళ్ల క్లియరెన్స్, అవేర్ వ్యవస్థ, డేటా లేక్ వినియోగంపై ఆయన సమగ్ర సమీక్ష నిర్వహించారు. సీఎస్, సెక్రటరీలు, హెచ్‌వోడీలు మొదలుకొని మండల స్థాయి అధికారుల వరకు ఫైళ్ల క్లియరెన్స్‌లో వేగం పెరగాలని సీఎం సూచించారు. మ్యానువల్ ఫైళ్లను దాదాపు పూర్తిగా తొలగించి ఈఫైలింగ్ వ్యవస్థను బలోపేతం చేయాలని స్పష్టం చేశారు.

ప్రభుత్వ సేవలు ప్రజలకు త్వరగా అందాలంటే ఫైళ్ల క్లియరెన్స్ కీలకమని ఆయన పేర్కొన్నారు. టెక్నాలజీతో పాటు పాలనలో హ్యూమన్ టచ్ కూడా సమానంగా అవసరమని వ్యాఖ్యానించారు. 24 గంటల్లోపు ఈఫైల్స్ డిస్పోజ్ అయ్యేలా మంత్రులు, అధికారులు ప్రత్యేక శ్రద్ధ చూపాలని ఆదేశించారు. ఫైళ్ల క్లియరెన్స్ పనితీరును ఎప్పటికప్పుడు మానిటరింగ్ చేస్తున్నట్లు సీఎం వెల్లడించారు. జిల్లాల్లో ఇంకా ఈఆఫీస్‌కు రాని ఫైళ్లు ఎన్ని ఉన్నాయో గుర్తించి పూర్తిగా డిజిటలైజ్ చేయాలని సూచించారు. హెచ్‌వోడీలు తప్పనిసరిగా ఈఫైల్స్ ద్వారానే ఫైళ్లు జనరేట్ చేయాలని ఆదేశించారు. ప్రజలకు సేవలందించడంలో మరింత సమర్థవంతమైన పాలన కోసం కలెక్టర్లు వినూత్న ఆలోచనలు చేయాలని సూచించారు. ఇప్పటికే కొన్ని విభాగాల్లో ఫైళ్ల క్లియరెన్స్ రోజుల వ్యవధి నుంచి గంటల వ్యవధికి తగ్గడం పట్ల సీఎం సంతృప్తి వ్యక్తం చేశారు. పెద్ద సంఖ్యలో ఫైళ్లు వచ్చినా కేవలం 10 గంటల్లోనే వాటిని పరిష్కరించిన సీఎస్ సాయి ప్రసాద్ పనితీరును ప్రత్యేకంగా అభినందించారు. వేగవంతమైన పాలనకు ఇదే ఉదాహరణగా నిలుస్తుందని పేర్కొన్నారు.

# ఇరాన్‌కు ట్రంప్ 'లవ్ ట్యాప్'

పశ్చిమాసియా వెలుతురు మే 08:

పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు పతాక స్థాయికి చేరాయి. ఇరాన్ సైనిక లక్ష్యాలపై అమెరికా జరిపిన తాజా దాడులను అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ అత్యంత తేలికగా కొట్టిపారేశారు. ఇవి కేవలం 'ప్రేమతో ఇచ్చిన చిన్న స్పర్శ' (లవ్ ట్యాప్) మాత్రమేనని ఆయన వ్యాఖ్యానించారు. గురువారం హర్మూజ్ జలసంధి వద్ద జరిగిన సైనిక ఘర్షణను ప్రస్తావిస్తూ, ఇరాన్ దళాలు తమను కవ్వించడం వల్లే ఈ చర్య తీసుకోవాల్సి వచ్చిందని స్పష్టం చేశారు. వాషింగ్టన్ డీసీలోని లింకన్ మెమోరియల్ వద్ద విలేకరులతో మాట్లాడిన ట్రంప్, ఇరాన్ నాయకత్వంపై నిప్పులు చెరిగారు.

**ఉన్మాదుల పాలనలో ఇరాన్ - ట్రంప్ ఫైర్**

ఇరాన్ ప్రస్తుతం సాధారణ దేశంలా ప్రవర్తించడం లేదని, ఆ దేశాన్ని కొందరు ఉన్మాదులు పాలిస్తున్నారని ట్రంప్ తన సోషల్ మీడియా ప్లాట్‌ఫారమ్ 'ట్రూత్ సోషల్'లో ఘాటుగా విమర్శించారు. సాధారణ దేశమైతే అమెరికా యుద్ధ నౌకలను (డెస్ట్రాయర్లను) హర్మూజ్ జలసంధి గుండా వెళ్లనిచ్చేదని, కానీ ఇరాన్ అడ్డంకులు సృష్టిస్తోందని మండిపడ్డారు. అమెరికాతో త్వరగా ఒప్పందం కుదుర్చుకోకపోతే భవిష్యత్తులో ఇరాన్ మరింత తీవ్రమైన, హింసాత్మక దాడులను ఎదుర్కోవాల్సి ఉంటుందని ఆయన హెచ్చరించారు. అప్పుడు తమ నావికా దిగ్బంధనం ఒక ఉక్కు గోడలా మారుతుందని స్పష్టం చేశారు.

**తెరవెనుక 30 రోజుల కాల్పుల విరమణ చర్చలు**

ఒకవైపు యుద్ధ మేఘాలు కమ్ముకుంటున్నా, మరోవైపు అమెరికా ఇరాన్ మధ్య రహస్య చర్చలు జరుగుతున్నట్లు సమాచారం. హర్మూజ్ జలసంధిని తిరిగి తెరవడం, 30 రోజుల పాటు కాల్పుల విరమణ పాటించడంపై ఇరు దేశాలు మధ్యవర్తుల ద్వారా ప్రతిపాదనలు మార్చుకుంటున్నట్లు అంతర్జాతీయ మీడియా కథనాలు వెల్లడిస్తున్నాయి. ఈ 30 రోజుల వ్యవధిలో తుది ఒప్పందాన్ని ఖరారు చేయాలని అమెరికా భావిస్తోంది. అయితే, ఇరాన్ వద్ద ఉన్న సంవర్ధిత యురేనియం నిల్వలను అమెరికాకు అప్పగించాలన్న నిబంధన ఇప్పుడు ప్రధాన ప్రతిబంధకంగా మారింది.

**అణు కార్యకలాపాలపై ప్రతిపాదనల యుద్ధం**

అమెరికా నిబంధనల ప్రకారం.. ఇరాన్ తన మూడు అణు కర్మాగారాలను మూసివేయాలి మరియు 20 ఏళ్ల పాటు యురేనియం సంవర్ధనాన్ని నిలిపివేయాలి. దీనికి ప్రతిగా ఇరాన్ మరో ప్రతిపాదనను తెరపైకి తెచ్చింది. తమ వద్దనున్న యురేనియం నిల్వల్లో కొంత భాగాన్ని పలుచన చేస్తామని, మిగిలిన భాగాన్ని రష్యా వంటి మూడో దేశానికి తరలిస్తామని ఇరాన్ ప్రతినిధులు పేర్కొంటున్నారు. సంవర్ధన ప్రక్రియను కూడా 10 నుండి 15 ఏళ్లకు మించి నిలిపివేయలేమని వారు స్పష్టం చేస్తున్నారు. ఈ కీలక అంశాలపై ఇంకా ఏకాభిప్రాయం కుదరకపోవడంతో చర్చలు అనిశ్చితిలో పడ్డాయి.

**3 తక్షణ చర్యలపైనే ఫోకస్**

ప్రస్తుత చర్చల్లో మూడు ప్రధాన అంశాలకు ప్రాధాన్యత ఇస్తున్నారు. మొదటిది, ఇరాన్ ఓడరేవులపై అమెరికా విధిస్తున్న దిగ్బంధనాన్ని ఎత్తివేయడం. రెండోది, ప్రపంచ వాణిజ్యానికి కీలకమైన హర్మూజ్ జలసంధిని తిరిగి తెరవడం. మూడోది, ఇరు దేశాల మధ్య శాశ్వత కాల్పుల విరమణ ఒప్పందం కుదుర్చుకోవడం. ఈ మూడు చర్యలు పూర్తయితేనే పశ్చిమాసియాలో శాంతి నెలకొంటుందని విశ్లేషకులు భావిస్తున్నారు. అయితే, ట్రంప్ మాటలను బట్టి చూస్తే, ఇరాన్ మెడలు వంచి తన దారికి తెచ్చుకోవాలనే ధోరణిలో అమెరికా ఉన్నట్లు స్పష్టమవుతోంది. ఒకవేళ చర్చలు విఫలమైతే, యుద్ధం మరింత తీవ్ర రూపం దాల్చే అవకాశం ఉంది.

## నీతి ఆయోగ్ నివేదిక కాంగ్రెస్, బీజేపీలకు చెంపపెట్టు



- **కేసీఆర్ పాలనలో విద్యా రంగానికి నీతి ఆయోగ్ ప్రశంసలు**
- **2014-15 నుంచి ప్రభుత్వ పాఠశాలల్లో జీరో డ్రాపౌట్స్ నమోదు**
- **బాలికల విద్యలో జాతీయ సగటును మించిన తెలంగాణ: హరీశ్ రావు**

హైదరాబాద్, మే 8 (వెలుతురు):

కేసీఆర్ పాలనలో తెలంగాణ విద్యారంగం దేశానికే ఆదర్శంగా నిలిచిందని నీతి ఆయోగ్ నివేదిక స్పష్టం చేసిందని మాజీ మంత్రి, బీఆర్ఎస్ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ హరీశ్ రావు పేర్కొన్నారు. కేసీఆర్ ప్రభుత్వంలో విద్యా వ్యవస్థ నిర్లక్ష్యానికి గురైందంటూ కాంగ్రెస్, బీజేపీ నేతలు చేస్తున్న ఆరోపణలు పూర్తిగా అసత్యాలని ఈ నివేదిక తేల్చిచెప్పిందన్నారు.
201415 నుంచి 202425 వరకు విద్యా రంగ ప్రగతిపై నీతి ఆయోగ్ విడుదల చేసిన "స్కూల్ ఎడ్యుకేషన్ సిస్టమ్ ఇన్ ఇండియా" నివేదిక బీఆర్ఎస్ ప్రభుత్వ చిత్తశుద్ధికి నిదర్శనమని హరీశ్ రావు తెలిపారు. తెలంగాణ ప్రభుత్వ పాఠశాలల్లో ప్రాథమిక స్థాయిలో జీరో డ్రాపౌట్స్ నమోదవ్వడాన్ని నీతి ఆయోగ్ ప్రత్యేకంగా ప్రశంసించిందన్నారు. విద్యార్థుల నమోదు (GER) విషయంలో, ముఖ్యంగా బాలికల విద్యలో తెలంగాణ జాతీయ సగటును మించి రికార్డు స్థాయిలో నిలిచిందని చెప్పారు. గత పదేళ్లలో ప్రభుత్వ పాఠశాలల్లో విద్యుత్, మరుగుదొడ్లు, తాగునీటి సదుపాయాలు విస్తృతంగా కల్పించడంతో పాటు 86 శాతం స్కూళ్లకు కంప్యూటర్లు అందించి తెలంగాణ దేశంలోనే అగ్రస్థానంలో నిలిచిందని వెల్లడించారు. గురుకులాల విస్తరణ, ప్రభుత్వ పాఠశాలల ఆధునీకరణ ద్వారా కేసీఆర్ విద్యా రంగానికి అత్యంత ప్రాధాన్యత ఇచ్చారని పేర్కొన్నారు. రాజకీయ ప్రయోజనాల కోసం కేసీఆర్, బీఆర్ఎస్ ప్రభుత్వంపై అసత్య ప్రచారాలు చేస్తున్న కాంగ్రెస్, బీజేపీ నేతలకు నీతి ఆయోగ్ నివేదిక చెంపపెట్టులాంటిదని హరీశ్ రావు వ్యాఖ్యానించారు.

## హుస్నాబాద్ లో ఘనంగా మంత్రి పొన్నం ప్రభాకర్ గారి జన్మదిన వేడుకలు



హుస్నాబాద్ వెలుతురు మే 08:

హుస్నాబాద్‌లో రవాణా మరియు బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. జన్మదినం సందర్భంగా మంత్రి ముందుగా శ్రీ రేణుకా ఎల్లమ్మ ఆలయాన్ని సందర్శించి అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో మున్సిపల్ చైర్మన్ దండి లక్ష్మి, వైస్ చైర్మన్ చిత్తారి పద్మ, కౌన్సిలర్లు, పాలకవర్గ సభ్యులు, పార్టీ కార్యకర్తలు, యూత్ కాంగ్రెస్, NSUI నాయకులు ఏర్పాటు చేసిన వేడుకల్లో ఉత్సాహంగా పాల్గొన్నారు. కార్యకర్తలు తీసుకొచ్చిన 59 కేజీల భారీ కేక్‌ను కట్ చేసి అభిమానులతో కలిసి ఆనందంగా జన్మదిన వేడుకలు జరుపుకున్నారు.



ఈ సందర్భంగా అక్కడికి వచ్చిన ప్రతి ఒక్కరిని మంత్రి ఆప్యాయంగా పలకరిస్తూ కృతజ్ఞతలు తెలిపారు. ప్రజల్లో రోడ్డు భద్రతపై అవగాహన పెంపొందించాలనే ఉద్దేశంతో వాహనదారులకు హెల్మెట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, అభిమానులు, యువత పెద్ద సంఖ్యలో పాల్గొని మంత్రికి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు.

## మోడీ ద్వారానే చట్టసభల్లో రిజర్వేషన్ సాధ్యం



- **బీసి నేత, బీజేపి ఎంపీ ఆర్ కృష్ణయ్య**

హైదరాబాద్, మే 8 (వెలుతురు):

ప్రధానమంత్రి నరేంద్ర మోడీ ప్రభుత్వం చరిత్రలో నిలిచిపోయే నిర్ణయాలు తీసుకుంటుందని, కులగణన తరువాతే మోడీ ద్వారానే చట్టసభలలో రిజర్వేషన్ సాధ్యం అని జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షులు, రాజ్యసభ సభ్యులు ఆర్. కృష్ణయ్య స్పష్టం చేశారు. శుక్రవారం కాచిగూడలో 13 బీసీ సంఘాల సమావేశానికి నీల వెంకటేష్, రాజేందర్ అధ్యక్షత వహించగా ముఖ్య అతిథిగా హాజరైన ఎంపీ కృష్ణయ్య మాట్లాడుతూ.. ప్రస్తుతం జనగణనలో కులగణన చేస్తామని కేంద్రం ప్రకటించిందని, దీనిపై ఎటువంటి అనుమానాలు అవసరం లేదన్నారు. బీసీలకు జనాభా ప్రకారం విద్యా, ఉద్యోగ, ఆర్థిక, రాజకీయ, సామాజిక రంగాల్లో జనాభా ప్రకారం వాటా లభిస్తుందన్నారు. కులగణన కేంద్ర ప్రభుత్వం అంగీకరించడం చారిత్రాత్మకమైన నిర్ణయం అన్నారు. గతంలో పాలించిన ప్రభుత్వాలు కులగణన చేయడానికి సాహసం చేయలేదని, 76 ఏళ్ల స్వతంత్రం తర్వాత కులగణన చేసే సాహసం ప్రధానమంత్రి నరేంద్ర మోడీ నాయకత్వంలో నే సాధ్యమైందన్నారు. పార్లమెంట్ లో బీసీ బిల్లు పెట్టి అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికల్లో 50 శాతం రిజర్వేషన్లు కల్పించాలన్నారు. కేంద్రం లో బీసీలకు ప్రత్యేక మంత్రిత్వ శాఖను ఏర్పాటు చేసి 2 లక్షల కోట్లతో అభివృద్ధి పథకాన్ని ప్రకటించాలని కోరారు. బీసీల విద్య, ఉద్యోగ రిజర్వేషన్ల ను 50 శాతానికి పెంచాలన్నారు. విద్య, ఉద్యోగ రిజర్వేషన్స్ పై క్రిమి లేయర్ ను ఎత్తివేయాలని డిమాండ్ చేశారు. పారిశ్రామిక పాలసీ లో బీసీలకు 50 శాతం కోటా కేటాయించాలన్నారు. కేంద్రం లో ఖాళీగా ఉన్న 16 లక్షల ఉద్యోగాలను వెంటనే భర్తీ చేయాలని కోరారు. ఈ సమావేశంలో బీసీ సంఘం నేతలు పర్ల గొర్ల మోడీ రాందేవ్, నిఖిల్ పటేల్, అశోక్, బలరాం, మల్లేష్ యాదవ్ , రాము తదితరులు పాల్గొన్నారు.



# విజన్ 2050_ _ _

## మున్సిపాలిటీ 1950_ _ _! హైటెక్ హామీలు_ _ _ లోటెక్ జీవితం_ _ _?

గతంలో "గ్లోబల్ సిటీ" అనే నినాదంతో ప్రజలకు అభివృద్ధి భవిష్యత్తు చూపించిన పాలకులు, ఇప్పుడు "ఫ్యూచర్ సిటీ" అనే కొత్త నినాదంతో మరోసారి ఆకర్షణీయమైన దృశ్యాన్ని ప్రజల ముందుంచుతున్నారు. నినాదాలు మారుతున్నాయి, ప్రదర్శనలు మారుతున్నాయి, కానీ నేలమీద పరిస్థితులు ఎంతవరకు మారుతున్నాయో అనేది కీలకమైన ప్రశ్నగా మారింది. ఒకవైపు కోట్ల రూపాయల ప్రాజెక్టులు, అంతర్జాతీయ స్థాయి నగరాల కలలు,మరోవైపు మున్సిపాలిటీల్లో కనీస సేవలు కూడా అందించలేని దుస్థితి. ఈ రెండు వాస్తవాల మధ్య పెరుగుతున్న అంతరం ప్రజల ఆలోచనలను కుదిపేస్తోంది.




మున్సిపాలిటీల పరిస్థితి పరిశీలిస్తే, అభివృద్ధి కథనాలు కేవలం కాగితాలపైనే మిగిలిపోయాయా అనే అనుమానం కలుగుతుంది. చెత్త తొలగింపుకే నిధులు లేకపోవడం, వీధులు శుభ్రంగా లేకపోవడం, కాలువలు మూసుకుపోవడం వంటి సమస్యలు సాధారణంగా మారిపోయాయి. ప్రజలు రోజూ ఎదుర్కొంటున్న ఈ ఇబ్బందులు ప్రభుత్వ ప్రాధాన్యతలపై గంభీరమైన ప్రశ్నలు లేవనెత్తుతున్నాయి. ఒకవైపు "ఫ్యూచర్ సిటీ" పేరుతో భారీ ప్రణాళికలు ప్రకటిస్తుంటే, మరోవైపు స్థానిక సంస్థలు బడ్జెట్ కొరతతో కుంగిపోవడం స్పష్టమైన విరుద్ధతగా కనిపిస్తోంది.

అభివృద్ధి పేరుతో భారీ ప్రాజెక్టులకు నిధులు కేటాయించడం తప్పు కాదు. కానీ అదే సమయంలో ప్రాథమిక అవసరాలను విస్మరించడం పాలనలో అసమతుల్యతకు సంకేతం. ప్రజలు అడుగుతున్న ప్రశ్న సాదాసీదాగా కనిపించినా లోతైనదే,"ముందుగా మా జీవన ప్రమాణాలు మెరుగుపరచండి, తర్వాత భవిష్యత్తు నగరాల గురించి మాట్లాడండి."

భూసేకరణ అంశం కూడా తీవ్ర చర్చకు దారి తీస్తోంది. రైతుల నుండి తక్కువ ధరలకు భూములు సేకరించి, వాటిని పెద్ద కంపెనీలకు రాయితీలతో ఇవ్వడం అనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. అభివృద్ధి కోసం భూములు అవసరమే అయినప్పటికీ, ఆ ప్రక్రియలో పారదర్శకత, న్యాయం, రైతుల ప్రయోజనాల రక్షణ అత్యంత అవసరం. లేకపోతే అది అభివృద్ధి కాదని, అన్యాయం అని భావన బలపడుతుంది. రైతు తన భూమిని కోల్పోయి భవిష్యత్తుపై అనిశ్చితిలో పడితే, ఆ అభివృద్ధి ఎవరికి ఉపయోగపడుతుంది?

మున్సిపాలిటీల్లో అవినీతి ఆరోపణలు ప్రజల్లో తీవ్ర ఆందోళన కలిగిస్తున్నాయి. జనన, మరణ ధృవపత్రాల వంటి సాధారణ సేవలకే లంచాలు ఇవ్వాల్సి వస్తున్నాయనే వాదనలు వినిపించడం ఆందోళనకరం. ఇది కేవలం పరిపాలనా వైఫల్యం మాత్రమే కాదు, ప్రజాస్వామ్య వ్యవస్థపై నమ్మకాన్ని దెబ్బతీసే అంశం కూడా. ప్రభుత్వ సేవలు అందరికీ సమానంగా, సులభంగా అందాలి. కానీ అవి లంచాలపై ఆధారపడితే, అది పాలనలోని లోపాలను స్పష్టంగా బయట పెడుతుంది.

అక్రమ నిర్మాణాల సమస్య కూడా ఆందోళనకరంగా మారింది. నియమాలను పట్టించుకోకుండా నిర్మాణాలు కొనసాగుతుండగా, అధికారులు చూసీ చూడనట్టుగా వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. ఇది నగర నిర్మాణంలో గందరగోళానికి మాత్రమే కాకుండా, భవిష్యత్తులో ప్రమాదాలకు దారి తీసే పరిస్థితులను సృష్టిస్తుంది. ప్రణాళికాబద్ధమైన అభివృద్ధి లేకపోతే నగరాలు నివాసయోగ్యంగా ఉండవు.పార్కుల భూముల ఆక్రమణ మరో తీవ్రమైన సమస్య. గ్రామపంచాయతీ లేఅవుట్లలో ప్రజల కోసం కేటాయించిన పార్కుల స్థలాలు, మున్సిపాలిటీల్లో విలీనం అయిన తర్వాత అక్రమ నిర్మాణాలకు గురవుతున్నాయనే విమర్శలు ఉన్నాయి. కొన్ని సందర్భాల్లో ప్రజాసంఘాలు న్యాయస్థానాలను ఆశ్రయించి ఆ భూములను కాపాడుకున్నప్పటికీ, అమలులో నిర్లక్ష్యం కొనసాగుతోందనే అభిప్రాయం ఉంది. ప్రజల కోసం కేటాయించిన సామూహిక వనరులను కాపాడడం ప్రభుత్వ ప్రాథమిక బాధ్యత.

ఇక అధికార యంత్రాంగంపై కూడా విమర్శలు పెరుగుతున్నాయి. కింది స్థాయి నుండి పై స్థాయి వరకు అవినీతి వ్యాప్తి చెందిందనే ఆరోపణలు ప్రజల్లో అసంతృప్తిని పెంచుతున్నాయి. రాజకీయ ఒత్తిడులు, వ్యక్తిగత ప్రయోజనాలు కలిసి పరిపాలనను బలహీనపరుస్తున్నాయనే భావన ఉంది. అధికారులు నిజాయితీగా పనిచేయలేకపోతే, మంచి విధానాలు కూడా అమలు స్థాయిలో విఫలమవుతాయి.

కొన్ని ప్రాంతాల్లో కఠిన చర్యలు తీసుకుంటున్నట్లు కనిపించినప్పటికీ, ఇతర ప్రాంతాల్లో అదే సమస్యలు కొనసాగుతుండటం ద్వంద్వ వైఖరిని సూచిస్తోంది. చట్టం అందరికీ సమానంగా అమలు కావాలి. లేకపోతే ప్రజల్లో అసంతృప్తి మరింత పెరుగుతుంది.

ఇక పన్నుల విషయంలో ప్రభుత్వ యంత్రాంగం చూపుతున్న చురుకుదనం కూడా విమర్శలకు గురవుతోంది. ప్రాపర్టీ టాక్స్ పెంపులు, ఏరియల్ సర్వే ఆధారంగా అధిక అంచనాలు విధించడం వంటి చర్యలు ప్రజల్లో అసహనాన్ని కలిగిస్తున్నాయి. ఒకవైపు పన్నుల వసూళ్లలో కట్టుదిట్టత చూపుతూ, మరోవైపు త్రాగునీరు, రహదారులు, పారిశుద్ధ్యం వంటి కనీస సదుపాయాలు అందించడంలో అదే స్థాయి కృషి కనిపించకపోవడం తీవ్ర విమర్శలకు దారి తీస్తోంది.చాలా ప్రాంతాల్లో పనులు కేవలం ప్రదర్శనకే పరిమితమవుతున్నాయనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. సమస్యలు తలెత్తినప్పుడు తాత్కాలికంగా పనులు చేసి ప్రచారం చేసుకోవడం ఒక విధానంగా మారిందనే అభిప్రాయం ఉంది. పనుల నాణ్యత, దీర్ఘకాల ప్రయోజనం కంటే ప్రచారం ముఖ్యమైందనే భావన పెరుగుతోంది.

ఈ పరిస్థితుల్లో ప్రభుత్వానికి ఉన్న ప్రధాన బాధ్యత స్పష్టంగా ఉంది. పాలనను సమతుల్యంగా, పారదర్శకంగా నడపడం. భారీ ప్రాజెక్టులు అవసరమే, కానీ ప్రాథమిక సేవలను బలోపేతం చేయడం మరింత అవసరం. మున్సిపాలిటీలకు తగిన నిధులు, సిబ్బంది, పర్యవేక్షణ వ్యవస్థ కల్పించాలి. అవినీతి ఆరోపణలపై కఠిన చర్యలు తీసుకోవాలి. అక్రమ నిర్మాణాలను అరికట్టాలి. ప్రజల కోసం కేటాయించిన భూములను రక్షించాలి.

నగర అభివృద్ధి అంటే కేవలం ఆదాయం పెరగడం కాదు; అది ప్రజల జీవితాల్లో కనిపించే మార్పు. శుభ్రమైన వీధులు, సమయానికి త్రాగునీరు, మెరుగైన రహదారులు,ఇవే నిజమైన అభివృద్ధి సూచికలు. ఈ ప్రాథమిక అంశాలను నిర్లక్ష్యం చేస్తూ పెద్ద ప్రణాళికలు ప్రకటించడం ప్రజలను నమ్మించలేకపోతుంది."ఫ్యూచర్ సిటీ" అనే కల నిజం కావాలంటే ముందుగా ప్రస్తుత నగరాలను సరిచేయాలి. బలమైన పునాది లేకుండా ఎత్తైన భవనం నిలబడదు. అదే విధంగా, ప్రాథమిక సేవలు బలంగా లేకుండా భవిష్యత్తు నగరాల కలలు సాకారం కావు.చివరగా, ఈ అభివృద్ధి అంటే కేవలం పెద్ద ప్రాజెక్టులు కాదు; అది ప్రజల జీవితాల్లో కనిపించే మార్పు. చెత్తలేని వీధి, లంచం లేకుండా పొందే సేవ, పిల్లలు ఆడుకునే పార్కు, ఇవే నిజమైన అభివృద్ధి సూచికలు. ఈ విలువలను కాపాడినప్పుడే "ఫ్యూచర్ సిటీ" అనే కల ప్రజల మనసుల్లో స్థిరపడుతుంది. లేకపోతే అది మరో నినాదంగా మిగిలిపోతుంది.



మన్నారం నాగరాజు.
సామాజిక రాజకీయ విశ్లేషకులు.

# మహాదేవుడు భిక్షాందేహి అని ఎందుకు అడుగుతాడు?

సమస్త విశ్వానికి అధిపతి, తన ఇచ్ఛతో సృష్టి, స్థితి-లయాలను నడిపించు పరమేశ్వరుడు సాక్షాత్ మహాదేవుడు భిక్షాపాత్రను చేత ధరించి, జటాజూటమును విదిలించుకుంటూ, ఊరూరూ తిరుగుతూ, "భవతి భిక్షాందేహి" అని అడుగుతాడు. ఇది చూసినవారికి ఒక విచిత్రంగా అనిపించవచ్చు. సర్వేశ్వరుడే యాచించటమా? త్రిలోకాలకు నాథుడైనవాడు చేయి చాచటమా? ఇది కేవలం అజ్ఞానానికి కలిగే సందేహం. కానీ శివతత్వాన్ని లోతుగా అర్థం చేసుకున్నవారికి, ఈ భిక్షావృత్తి వెనుక ఉన్న మహోన్నతమైన సత్యం, ఒక జీవన దర్శనం కనిపిస్తుంది.

శివుడు "ఆది భిక్షువు" అనబడటానికి పౌరాణిక కథ ఒకటి ప్రాచుర్యంలో ఉంది. బ్రహ్మదేవుడు అహంకారంతో, తానే సర్వశ్రేష్ఠుడనని, తానే సృష్టికర్తనే గర్వంతో మెలగుతున్న సమయంలో, శివుడు ఆ అహంకారాన్ని శిక్షించాడు. ఆ సందర్భంలో బ్రహ్మ యొక్క ఐదవ శిరస్సు శివుని హస్తానికి అంటుకుపోవటంతో, మహాదేవుడు ఆ "బ్రహ్మహత్యా పాపం" తొలగించుకోవడానికి ఒక సాధారణ భిక్షువు వేషం ధరించి తీర్థయాత్రలకు బయలుదేరాడు. ఇది కేవలం ఒక కథ మాత్రమే కాదు దీని వెనుక ఉన్న గొప్ప సందేశం ఏమిటంటే, ఏ పాపమూ, ఏ ప్రాయశ్చిత్తమూ, సర్వోన్నత శక్తికైనా అతీతం కాదు. నిజమైన న్యాయం ముందు అహంకారం తలవంచాలి, తప్పుకు తగిన శిక్షను అనుభవించాలి అనేది ఇక్కడ గమనించదగ్గ విషయం.భిక్షాపాత్ర శివునకు దైన్యచిహ్నం కాదు అది అహంకారరాహిత్యానికి, పరిపూర్ణ వైరాగ్యానికి గొప్ప సంకేతం.శివుడు అడిగేది అన్నమా? వస్త్రమా? లేక ధనమా? వీటన్నిటినీ సృష్టించినవాడు, సకల లోకాల ఐశ్వర్యానికి మూలమైనవాడు ఆయన. మరి ఆయనకు ఇవి అవసరమేమిటి? ఆది భిక్షువు వాడినేది అడిగేది అన్న ప్రశ్నకు శివ పురాణంలో అద్భుతమైన సమాధానం ఉంది. శివుడు మన నుండి ఆశించేది కేవలం శుద్ధమైన భక్తి మాత్రమే. ఆ భక్తిని, మనసును ఆయనకు అర్పించగలిగేవాడే నిజమైన ధన్యుడు. లోకంలో ఎంతటి ఐశ్వర్యం ఉన్నా, పాండిత్యం ఉన్నా, శారీరక బలమున్నా అవి శివుని ప్రసన్నం చేసుకోలేవు. కేవలం హృదయపూర్వకమైన, అహంకారరహితమైన నిశ్చల భక్తి మాత్రమే ఆయనను కదిలిస్తుంది.చరిత్రను గమనిస్తే నందనార్, కన్నప్ప, బసవేశ్వరుడు వంటి భక్తులు అత్యంత సామాన్యులు. వారి దగ్గర సమర్పించడానికి కోట్లు లేవు, కానీ వారి వద్ద నిర్మలమైన మనస్సు ఉంది. శివుడు వారి భక్తికి దాసుడై అనుగ్రహించాడు. దీని ద్వారా ఆయన మనకు చెప్పేది ఒక్కటే: నీవు నాకు ఏమి ఇస్తున్నావు అన్నది ముఖ్యం కాదు, ఏ భావంతో ఇస్తున్నావు అన్నదే ముఖ్యం.శివుని భిక్షావృత్తి వేదాంత పరంగా ఒక అసాధారణ సందేశాన్ని ఇస్తుంది. జగత్ప్రభువైనవాడు స్వయంగా ఏమీ లేనట్టుగా, తన దగ్గర ఏ ఆస్తులను నిలుపుకోలేదన్నట్టుగా జీవించటం ఇది "అపరిగ్రహం" (అవసరానికి మించి దేనినీ సేకరించకపోవడం) అన్న మహత్తర వేదాంత సూత్రానికి మూర్తీభవించిన రూపం.ఆయన నివాసం స్మశానం, ఆయన అలంకారం చితాభస్మం, ఆయన వస్త్రం వ్యాఘ్రచర్మం. ఇవన్నీ లోకం దృష్టిలో అసహ్యకరమైనవి లేదా భయానకమైనవి కావచ్చు. కానీ శివుడికి అందం ,అసహ్యం, ఐశ్వర్యం ,దారిద్ర్యం అనే భేదాలు లేవు. ఆయన సర్వసంగ పరిత్యాగి. అన్నీ నావే అయినపుడు, ఏదీ నాది కాదు అనే పరమ సత్యాన్ని ఆయన తన జీవనశైలి ద్వారా బోధిస్తున్నాడు. మనం కొద్దిపాటి ఆస్తికే గర్వపడుతుంటాం, కానీ సర్వానికీ మూలమైనవాడు శూన్యంలో ఆనందాన్ని వెతుక్కుంటున్నాడు.కాశీ క్షేత్రాధిపతి అయిన కాలభైరవుడు, ఆది భిక్షువు స్వరూపంలో అత్యంత శక్తివంతమైన శివుని అంశ. ఆయన చేతిలో ఉన్న కపాలపాత్ర (బ్రహ్మ కపాలం) కేవలం భిక్షా పాత్ర మాత్రమే కాదు. అది మన అహంకారానికి చివరి గమ్యాన్ని సూచిస్తుంది. ఈ శరీరం, ఈ అహంకారం, ఈ నేను అన్న భ్రమ ఇవన్నీ చివరికి మట్టిలో కలవాల్సిందేనని, శివుని పాదాల వద్ద శూన్యమవుతాయని ఆ పాత్ర గుర్తుచేస్తుంది.బ్రహ్మ వంటి సృష్టికర్త శిరస్సే కపాలపాత్రగా మారినప్పుడు, ఇక సామాన్య మానవుల అహంకారం ఎంతటిది? ఈ అర్థంలో ఆది భిక్షువు మన దగ్గరకు వచ్చి, నీ అహంకారాన్ని నాకు సమర్పించు అని యాచిస్తున్నాడు. మనలోని చెడు గుణాలను ఆయనకు దానం చేస్తే, ఆయన మనకు ప్రశాంతతను ప్రసాదిస్తాడు. నీ అహంకారాన్ని, నీ ఆసక్తులను, నీ భ్రమలను అన్నింటినీ ఆ భిక్షాపాత్రలో వేయి. ఆదిభిక్షువు నీ నుండి ఆశించే అసలైన దానం అదే.



నేటి ఆధునిక ప్రపంచంలో, మనం ప్రతి నిమిషం పదవుల కోసం, పరపతి కోసం, డబ్బు కోసం అంతులేని పరుగులు తీస్తున్నాం. ఈ పరుగులో ప్రశాంతతను కోల్పోతున్నాం. కానీ శివుడు ఇందుకు పూర్తి విరుద్ధంగా దర్శనమిస్తాడు. సర్వశక్తిమంతుడైనా సరే, తన దగ్గర ఏమీ లేనట్టుగా నిర్లిప్తంగా ఉండటంలో ఒక అగాధమైన జ్ఞానం ఉంది. అన్నీ నావే అనుకున్నప్పుడు బరువు పెరుగుతుంది, బాధ్యత పెరుగుతుంది, భయం పెరుగుతుంది. కానీ ఏదీ నాది కాదు, అంతా ఆ పరమేశ్వరుడిదే అని తెలిసినపుడు మనసు తేలికపడుతుంది. ఈ వైరాగ్యమే జీవితంలో నిజమైన ఆనందానికి బాటలు వేస్తుంది. లోకంలోని ఏ వస్తువు కూడా శాశ్వతం కాదని గ్రహించడమే శివజ్ఞానం. మరొక కోణంలో చూస్తే, ఆది భిక్షువు తన భక్తుల ఇళ్ళకు వెళ్ళి భిక్ష అడగటం వెనుక ఒక గొప్ప అంతరార్థం ఉంది. అసలు అన్నదాత శివుడే. కానీ ఆయన భక్తుల దగ్గరకు యాచకుడిగా వెళ్తాడు. ఎందుకంటే, ఆ భక్తులకు దానం చేసే గొప్ప అవకాశాన్ని కల్పించడానికి.భగవంతుడు మనల్ని అడుగుతున్నాడంటే, మనకివ్వడానికి ఆయన సిద్ధంగా ఉన్నాడని అర్థం. ఇచ్చే గుణాన్ని అలవరచడానికి, తన భక్తులలో ఉన్న లోభత్వాన్ని (పిసినారితనాన్ని) పోగొట్టడానికి ఆయన భిక్షువుగా వస్తాడు. ఆయనకు మనం పెట్టే ఒక ముద్ద అన్నం ఆయనకు తృప్తినివ్వదు, కానీ మనలో కలిగే త్యాగభావం ఆయనను సంతోషపెడుతుంది. అందుకే ఆయనను మహా కారుణ్యమూర్తి అంటారు.కాశీలో శివుడు అన్నపూర్ణాదేవి వద్దకు వెళ్ళి భిక్ష అడగటం అనేది మానవజాతికి ఒక ఉదాత్తమైన పాఠం. సాక్షాత్ పరాశక్తి అమ్మవారు అన్నం పెడుతుంటే, శివుడు దోసిలి ఒగ్గి తీసుకుంటాడు. ఇక్కడ శివుడు అన్నం బ్రహ్మం అని చాటుతున్నాడు. అలాగే, స్త్రీ శక్తికి, మాతృత్వానికి పురాణాలు ఇచ్చిన అత్యున్నత గౌరవానికి ఇది నిదర్శనం. మాతృశక్తి ముందు జగత్పిత అయిన శివుడే శిరమువంచటం మన సంస్కృతిలోని ఔన్నత్యాన్ని తెలియజేస్తుంది. ఆకలి తీర్చే తల్లి కంటే గొప్పవారు ఎవరూ లేరని ఈ లీల ద్వారా అర్థమవుతుంది.ఆది భిక్షువు తత్త్వాన్ని కేవలం పురాణంగా చదివి వదిలేయకూడదు. దానిని మన జీవితాల్లో అన్వయించుకోవాలి. మన దైనందిన జీవితంలో మనం ప్రదర్శించే గర్వాన్ని, అసూయను, దురాశను శివుని భిక్షాపాత్రలో వేయాలి. ఇది ఒక మతపరమైన ఆచారం మాత్రమే కాదు, ఇది ఒక మానసిక పరివర్తన (Mental Transformation).ఒక్కసారి నేను అన్న భావనను పక్కన పెట్టి చూడండి, ప్రపంచం ఎంత అందంగా కనిపిస్తుందో! శివుడు భిక్షాపాత్ర పట్టుకోవడంలో ఉన్న నిగూఢార్థం ఇదే.ఓ మానవుడా! నీవు మోస్తున్న ఈ భారాలన్నింటినీ నాకు ఇచ్చేయ్, నువ్వు స్వేచ్ఛగా మారు.ఆది భిక్షువు శివుడు ఈ లోకంలో ఏదైనా సంపాదించుకోవడానికి వచ్చినవాడు కాదు. ఈ లోకానికి సర్వస్వాన్ని పంచడానికి వచ్చినవాడు. తన భిక్షావృత్తి ద్వారా అహంకార నాశనాన్ని, వైరాగ్య మహత్వాన్ని, భక్తి పరిశుద్ధతను మనకు బోధిస్తున్నాడు.చివరిగా ఆయన అడిగేది ఒక్కటే,నీ గర్వాన్ని వదులు. నీ మనస్సును శుద్ధం చేసుకో. నీ హృదయంలో నన్ను ప్రతిష్ఠించుకో. ఇదే ఆయన కోరేది, ఇదే ఆయన మాగ్నేది, ఇదే ఆయన పరమార్థం. శివుడు అడిగే ఆ చిన్న భిక్షను మనం ఇవ్వగలిగితే, ఆయన మనకు తన అనంతమైన కరుణను, మోక్షాన్ని ప్రసాదిస్తాడు. శివోహం! శివోహం!



డా .సూర్యదేవర రామకృష్ణ .
9490754169

# తెలంగాణలో విద్యావిప్లవానికి ఆరుట్ల నుంచే శ్రీకారం

- అంతర్జాతీయ ప్రమాణాలతో తెలంగాణ పబ్లిక్ స్కూల్
- వచ్చే నెల 15న సీఎం చేతుల మీదుగా ప్రారంభించేందుకు చర్యలు
- రాష్ట్రవ్యాప్తంగా ఇదే తరహాలో విస్తరణకు రాష్ట్ర ప్రభుత్వం కృషి_
- ఆరుట్ల తెలంగాణ పబ్లిక్ స్కూల్ ను సందర్శించిన రాష్ట్ర ప్రభుత్వ విప్ లు
- అధునాతన హంగుల ప్రభుత్వ బడిని చూసి హర్షం
- విప్ లను సన్మానించిన ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి


ఆరుట్ల తెలంగాణ పబ్లిక్ పాఠశాలలో ప్రసంగిస్తున్న ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి


ఆరుట్ల తెలంగాణ పబ్లిక్ పాఠశాలలో ప్రసంగిస్తున్న ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి


ఆరుట్ల తెలంగాణ పబ్లిక్ పాఠశాలలో ప్రసంగిస్తున్న ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి

ఇబ్రహీంపట్నం వెలుతురు మే 08:

రాష్ట్ర ప్రభుత్వం ఫైలెట్ ప్రాజెక్టు కింద ఆరుట్లలో నిర్మించిన తెలంగాణ పబ్లిక్ స్కూల్ కేవలం ఒక బడి మాత్రమే కాదు...., తెలంగాణ విద్యా వ్యవస్థలో రాబోయే విప్లవాత్మక మార్పులకు ఒక ప్రయోగశాలగా ప్రభుత్వ విప్ లు అభివర్ణించారు. ఇక్కడి ప్రతీ సౌకర్యం ఇంటర్నేషనల్ స్కూల్ కు దీటుగా ఉండటం విద్యావ్యవస్థ పట్ల రేవంత్ రెడ్డి ప్రభుత్వానికున్న చిత్తశుద్ధికి నిదర్శనంగా పేర్కొన్నారు. రంగారెడ్డి జిల్లా మంచాల మండలం ఆరుట్ల గ్రామంలో ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్మించిన తెలంగాణ పబ్లిక్ స్కూల్ ను ప్రభుత్వ విప్ లు ఆది శ్రీనివాస్, చింతకుంట విజయరమణ రావు, యెన్నం శ్రీనివాస్ రెడ్డి, వేముల వీరేశం, బీర్ల అయిలయ్య, రామచందర్ నాయక్ , అద్దంకి దయాకర్, బల్మూరి వెంకట్ సందర్శించారు. శుక్రవారం ఉదయం ఆరుట్ల గ్రామానికి చేరుకున్న వీరికి స్వాగతం పలికిన ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి శాలువా కప్పి సన్మానించారు. ఈ సందర్భంగా పాఠశాల నిర్మాణం, సౌకర్యాలు, పనితీరు గురించి రాష్ట్ర విద్యా కమిషన్ ఛైర్మన్ ఆకునూరి మురళి వారికి వివరించారు. ఇంటిగ్రేటెడ్ విద్యా వ్యవస్థ, అధునాతన తరగతి గదులు, ఉచిత బస్సు సౌకర్యం, ప్రయోగశాలలు, గ్రంథాలయం, క్రీడామైదానం, జిమ్, భోజన సౌకర్యాలు, ఇతర మౌలిక వసతులను ఆకునూరి మురళి, ఎమ్మెల్యే మల్ రెడ్డి వివరించారు. కార్పొరేట్ విద్యాసంస్థల్ని తలదన్నేలా ప్రభుత్వం నిర్మిస్తున్న పాఠశాలను చూసి ప్రభుత్వ విప్ లు హర్షం వ్యక్తం చేశారు. ఇదే తీరుగా రాష్ట్రంలో 100 చోట్ల తెలంగాణ పబ్లిక్ స్కూళ్ల నిర్మాణానికి ప్రభుత్వం కార్యాచరణ సిద్ధం చేసినట్లు చెప్పారు. ఇందుకోసం ఆరుట్ల పాఠశాలను నమూనాగా తీసుకోనున్నట్లు తెలిపారు. భావిభారతం అభివృద్ధిపథంలో సాగాలంటే విద్య అతిముఖ్యమని... అందుకోసమే విద్యావ్యవస్థను బాగుచేసి, దేశభవిష్యత్తుకు ప్రభుత్వం బంగారుబాటలు వేస్తుందని చెప్పారు.

**ఇబ్రహీంపట్నం ప్రజల అదృష్టంగా భావిస్తున్నా: ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి**

రాష్ట్ర విద్యావిప్లవానికి తమ నియోజకవర్గం నుంచి ప్రభుత్వం శ్రీకారం చుట్టడం ఇబ్రహీంపట్నం ప్రజల అదృష్టంగా ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రత్యేక చొరవ, విద్యాకమిషన్ ఛైర్మన్ ఆకునూరి మురళి మార్గదర్శకంగా అత్యున్నత ప్రమాణాలతో ఈ పబ్లిక్ స్కూల్ పూర్తైందని చెప్పారు. విద్యావైద్యానికి ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని.... ఈ సారి బడ్జెట్ లో రూ.26వేల కోట్లకు పైగా విద్యకు కేటాయింపులు చేయటమే ఇందుకు నిదర్శనమన్నారు. పేదలందరికీ ఉచితంగా ఉన్నత ప్రమాణాలతో విద్యనందించిన నైపుణ్యం గల యువతను దేశానికి అందించటమే లక్ష్యంగా పనిచేస్తోందని... ఈ అవకాశాన్ని ప్రజలు ఉపయోగించుకోవాలని చెప్పారు.


## ప్రభుత్వ డిగ్రీ కళాశాల నిర్మాణ పనులను చేపట్టాలని ఎమ్మెల్యే కి వినతి పత్రం

కుత్బుల్లాపూర్ వెలుతురు ప్రతినిధి మే 08:



శుక్రవారం కుత్బుల్లాపూర్ లోని ఎమ్మెల్యే నివాస కార్యాలయం వద్ద బిఆర్ఎస్ ఎల్పి విప్, ఎమ్మెల్యే కేపీ.వివేకానంద్ ని మర్యాద పూర్వకంగా కలిసిన కుత్బుల్లాపూర్ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ ప్రొఫెసర్ బండి రాజు, వైస్ ప్రిన్సిపల్ కె. శ్రీధర్ లు గత బిఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో కుత్బుల్లాపూర్ డిగ్రీ కళాశాల కోసం హెచ్ఎండిఏ ఆధ్వర్యంలో కేటాయించిన స్థలంలో డిగ్రీ కళాశాలను ఏర్పాటుచేసి కళాశాల నిర్మాణ పనులను చేపట్టడంతో పాటు ప్రస్తుతం సూరారంలోని తాత్కాలిక డిగ్రీ కళాశాల ప్రాంగణంలో త్రాగునీటి సదుపాయం లేక డిగ్రీ కళాశాలతో పాటు ఇంటర్మీడియట్, ఒకేషనల్ జూనియర్ కళాశాల విద్యార్థుల్లీ తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, వెంటనే త్రాగునీటి ఆర్.వో.ప్లాంట్ ను నిర్మింపచేయాలని కోరుతూ వినతి పత్రం అందజేశారు.ఈ సందర్భంగా బిఆర్ఎస్ ఎల్పి విప్, ఎమ్మెల్యే కేపీ. వివేకానంద్ మాట్లాడుతూ పేద, మధ్యతరగతి విద్యార్థినీ విద్యార్థులు అధికంగా నివసించే కుత్బుల్లాపూర్ నియోజక వర్గం తో పాటు సమీప ప్రాంతాల వారికి విద్యను అందించాలనే లక్ష్యంతో సూరారంలోని జూనియర్, ఒకేషనల్ జూనియర్ కళాశాలలను ఏర్పాటు చేయడంతో పాటు తాత్కాలిక ప్రాతిపదికన డిగ్రీ కళాశాలను కూడా ఏర్పాటు చేయడం జరిగిందని, డిగ్రీ కళాశాల ఏర్పాటుపై గత బిఆర్ఎస్ ప్రభుత్వ హయాంలోనే హెచ్ఎండిఏ ఆధ్వర్యంలో హెచ్ఎంటి కంపెనీ స్థలంలో నాలుగు ఎకరాలు కేటాయించడం జరిగిందని, ప్రభుత్వ మార్పుతో కళాశాల స్థల కేటాయింపు పనులు కాస్త ఆలస్యమయాయ్యని, త్వరలోనే సంబంధిత ఉన్నతాధికారులతో కళాశాల ఏర్పాటు విషయంపై చర్చించి డిగ్రీ కళాశాల స్థల కేటాయింపు పనులు, నిర్మాణ పనులను ప్రారంభిస్తామని తెలియజేశారు. అంతేకాక ప్రస్తుతం సూరారం లోని ప్రభుత్వ కళాశాలల సముదాయ ప్రాంగణంలో ఆర్ఓ ప్లాంట్ నిర్మాణం చేపట్టెందుకు కృషి చేస్తామన్నారు.


## క్లాస్ మెంట్ లచ్చిగారీ కృష్ణరెడ్డి కుమారుడి వివాహ వేడుకల్లో పాల్గొన్న పూర్వ విద్యార్థులు



ఇబ్రహీంపట్నం వెలుతురు మే 08:

ఇబ్రహీంపట్నం మండలం ఉప్పరగూడ ఎసిఆర్ కన్వెన్షన్ హాల్లో జరిగిన లచ్చగారి కృష్ణ రెడ్డి కుమారుడి వివాహ వేడుకల్లో పాల్గొని నూతన దంపతులు శశిధర్ రెడ్డి తేజస్విని లను ఆశీ ర్వ దిం చిన వరుడు తండ్రి కృష్ణారెడ్డి చిన్ననాటి క్లాస్ మెంట్ విద్యార్థులు వైయస్సార్ మాధగోని భీమగోని బుగ్గ రాములు జంగయ్యగౌడ్ ఆర్ల కృష్ణ మహమ్మద్ అనీస్ పాషా.హనుమంతుల అశోక్ వర్ధన్ గౌ డ్ డబ్బికార్ దుర్గాజి కొల్లోజు చంద్రశేఖర్ చారి బూర అచ్చయ్య కొల్లోజు సత్యం చారి అందోజు చంద్రశేఖర్ చారి గుడ్డిమల్ల రాజు ముదిరాజ్ కావాలి జంగయ్య ముదిరాజ్ మహమ్మద్ ఇబ్రహీం సుంక రి కేశయ్యగౌడ్ పెద్దలు పాండాల యాదయ్యగౌడ్ తదితరులుపాల్గొన్నారు

# తెలంగాణ పబ్లిక్ పాఠశాలను సందర్శించి నిర్మాణాలను పరిశీలించిన తెలంగాణ రాష్ట్ర ఎమ్మెల్యేల బృందం


ఆరుట్ల తెలంగాణ పబ్లిక్ పాఠశాల ను పరిశీలిస్తున్న ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి ఎమ్మెల్యేల బృందం


ఆరుట్ల గ్రామంలో తెలంగాణ పబ్లిక్ పాఠశాల ను సందర్శించిన ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డితో కలిసి సందర్శించిన ఎమ్మెల్యేల బృందం



ఆరుట్ల తెలంగాణ పబ్లిక్ పాఠశాల ముఖద్వారం దగ్గర తెలంగాణ రాష్ట్ర ఎమ్మెల్యేల బృందం విద్యా కమిషన్ ఛైర్మన్ ఆకునూరి మురళి ఆరుట్ల గ్రామ సర్పంచ్ మానిపాటి శోభా కుమార్

- ఆరుట్ల తెలంగాణ పాఠశాల ప్రవేట్ పాఠశాలలకు దీటుగా అన్ని రకాల వసతులతో అన్ని అంగులతో నిర్మాణాలు అద్భుతంగా ఉన్నాయి
- ఎమ్మెల్యేల బృందం

మంచాల వెలుతురు మే 08:

మంచాల మండలం ఆరుట్ల గ్రామంలో తెలంగాణ రాష్ట్రంలోనే మొట్టమొదటిసారిగా ప్రవేట్ పాఠశాలలకు దీటుగా నిర్మాణం అవుతున్న తెలంగాణ పబ్లిక్ పాఠశాలను ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి తెలంగాణ రాష్ట్ర విద్యా కమిషన్ చైర్మన్ ఆకునూరీ ఆధ్వర్యంలో తెలంగాణ రాష్ట్ర ఎమ్మెల్యేల బృందం తెలంగాణ పబ్లిక్ పాఠశాల ను సందర్శించి పాఠశాలలో డైనింగ్ హాల్ క్రికెట్ గ్రౌం డ్ బాస్కెట్ బాల్ గ్రౌండ్ కిచెన్ టాయిలెట్ గదులు కంప్యూటర్ గదులు లైబ్రరీ రాకెట్ లాంచ్ పాఠ శాల ముఖ ద్వారం నుండి అన్ని పనులను అన్ని గదులను పరిశీలించిన ఎమ్మెల్యేల బృందం అ నంతరం తెలంగాణ పబ్లిక్ పాఠశాల నిర్మాణం నమూనా మ్యాప్ ను ఎమ్మెల్యేలకు చూపిస్తూ పాఠ శాల పూర్తి అయిన తర్వాత ఎలాగ ఉంటుందో అన్ని వివరంగా వివరించిన విద్యాకమిషన్ చైర్మన్ ఆకునూరి మురళి సందర్భంగా ఎమ్మెల్యేలు మాట్లాడుతూ ఆరుట్ల తెలంగాణ పబ్లిక్ పాఠశాల ని ర్మాణాలు చాలా అద్భుతంగా ఉన్నాయి అని కితాబ్ ఇచ్చారు ఈప్రాంతంలోని పేద విద్యార్థులకు మంచి భవిష్యత్తును ఇచ్చే పాఠశాల ఆరుట్ల తెలంగాణ పబ్లిక్ పాఠశాల అవుతుంది అని అన్నారు ఈ సందర్భంగా ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి మాట్లాడుతూ ఆరుట్ల గ్రామంలోని తె లంగాణ పబ్లిక్ పాఠశాలను సందర్శించడానికి వచ్చిన ఎమ్మెల్యేలకు ప్రత్యేక ధన్యవాదాలు తెలుపు తూ మంచాలమండలంలో ఆరుట్ల గ్రామానికి మంచాల గ్రామానికి తెలంగాణ పబ్లిక్ పాఠశాలలు మంజూరు చేసినందుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారికి ప్రత్యేకత ధన్యవాదాలు తెలిపారు అతి త్వరలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారు ఆరుట్ల గ్రామానికి విచ్చేసి తెలంగాణ పబ్లిక్ పాఠశాలను సందర్శిస్తారని అని అన్నారు ఈ కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విప్ లు ఆది శ్రీనివాస్ బీర్ల ఐలయ్య ఎమ్మెల్యేలు విజయ రమణారావు యన్నెం శ్రీనివాస్ రెడ్డి వేముల వీరేశం రామచంద్ర నాయక్ ఎమ్మెల్సీ అద్దంకి దయాకర్ బల్మూరి వెంకట్ ఆరుట్ల గ్రామసర్పంచ్ మానిపాటి శోభా కుమా ర్ విద్యా కమిషన్ సభ్యులు విశ్వేశ్వరరావు చారకొండ వెంకటేష్ సలహాదారు శ్రీమతి పద్మజషా తెలంగాణ పబ్లిక్ పాఠశాల ప్రధాన ఉపాధ్యాయుడు సిద్ధగోని గిరిధర్ గౌడ్ ఇబ్రహీంపట్నం మార్కెట్ కమిటీ చైర్మన్ కంబాలపల్లి గురునాథ్ రెడ్డి మంచాల సహకార సంఘం చైర్మన్ వెదిరె హన్మంత్ రెడ్డి మంచాల మండలం తాహసిల్దార్ వెంకట ప్రసాద్ రావు తెలంగాణ పబ్లిక్ పాఠశాల పేరెంట్స్ కమిటీ సభ్యులు లాలాగారి జంగయ్య చిందం శ్రీశైలం నుకం మల్లేష్ దేవరాజ్ పార్వతి పుష్ప జ్యోతి ప్రజా ప్రతినిధులు ప్రజాప్రతినిధులు స్థానిక నాయకులు తదితరులుపాల్గొన్నారు

# అంతర్జాతీయ రెడ్ క్రాస్ దినోత్సవం ఘనంగా నిర్వహణ





- **అడిషనల్ కలెక్టర్ వెంకా రెడ్డి ముఖ్య అతిథిగా హాజరు**

భువనగిరి, మే 8 (వెలుతురు న్యూస్ ):

భువనగిరి పట్టణంలో శుక్రవారం అంతర్జాతీయ రెడ్ క్రాస్ దినోత్సవం కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించడం జరిగింది. ఇట్టి కార్యక్రమానికి జిల్లా అడిషనల్ కలెక్టర్ గారు ముఖ్య అతిథిగా హాజరై రెడ్ క్రాస్ వ్యవస్థాపకుడు హెన్రీ డ్యునాంట్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు అనంతరం జాతీయ పతాకంతో పాటు రెడ్ క్రాస్ జెండాను ఎగరవేసారు.

ఈ సందర్భంగా అడిషనల్ కలెక్టర్ గారు మాట్లాడుతూ, "రెడ్ క్రాస్ సంస్థ మానవత్వానికి ప్రతీక అని 1863లో హెన్రీ డ్యునాంట్ చే స్థాపించబడిన ఈ సంస్థ యుద్ధాలు, ప్రకృతి వైపరీత్యాలు, అంటువ్యాధుల సమయంలో కుల,మత, ప్రాంతాలకు అతీతంగా బాధితులకు సేవలందిస్తోందని తెలిపారు.'మానవత్వం, నిష్పాక్షికత,తటస్థత, స్వాతంత్ర్యం, స్వచ్ఛంద సేవ, ఐక్యత, సార్వత్రికత' అనే 7 ప్రాథమిక సూత్రాలతో రెడ్ క్రాస్ వాలంటీర్లు చేస్తున్న సేవలు అభినందనీయం" అని కొనియాడారు.

"కోవిడ్ సమయంలో,అలాగే వరదలు వచ్చినప్పుడు రెడ్ క్రాస్ వాలంటీర్లు ముందుండి సేవలు అందించారన్నారు. రక్తదాన శిబిరాలు, ఉచిత వైద్య శిబిరాలు, ప్రథమ చికిత్స శిక్షణ, విద్యార్థులకు యువతకు ప్రతి ఒక్కరికి సిపిఆర్ పై అవగాహన కార్యక్రమాలు చేపట్టడం ద్వారా సమాజానికి ఎంతో మేలు చేస్తున్నారని తెలిపారు. యువత రెడ్ క్రాస్ స్ఫూర్తిని అలవర్చుకొని స్వచ్ఛంద సేవలో పాల్గొనాలని అలాగే. ప్రతి ఒక్కరూ 'సేవే మార్గం' అని భావించి ఆపదలో ఉన్నవారికి అండగా నిలవాలి" అని పిలుపునిచ్చారు.రెడ్ క్రాస్ జిల్లా కమిటీ చైర్మన్ గుర్రం లక్ష్మీ నర్సింహారెడ్డి, డివిజన్ కమిటీ చైర్మన్ సద్ది వెంకట్ రెడ్డి మాట్లాడుతూ జిల్లాలో ప్రస్తుతం మెంబర్షిప్ డ్రైవ్ కార్యక్రమాన్ని చేపడుతున్నామని కావున సేవా దృక్పథం కలవారు రెడ్ క్రాస్ లో మెంబర్ షిప్ తీసుకోవాలని కోరారు.జిల్లాకు బ్లడ్ బ్యాంక్ మరియు జిల్లా కార్యాలయానికి స్థానిక ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి గారి సహకారంతో త్వరలోనే స్థలం మంజూరు చేసుకుని భవన నిర్మాణం చేపట్టుకుందామని తెలిపారు.2026 సంవత్సరపు థీమ్ "కీపింగ్ హుమానిటి అలైవ్" ను స్ఫూర్తిగా తీసుకొని అందరూ మానవత్వ విలువలను కాపాడాలని కోరారు.

ఇట్టి కార్యక్రమంలో జిల్లా కమిటీ వైస్ చైర్మన్ దిడ్డి బాలాజీ,జిల్లా కమిటీ డైరెక్టర్లు శేక్.హమీద్ పాశ, ప్రభాకర్ రెడ్డి, శ్రీనివాస్ రెడ్డి,జంపాల అంజయ్య, రాంబాయి,కార్యదర్శి క్రిస్టోఫర్,డివిజన్ కమిటీ డైరెక్టర్ ఐలేని రామ్ రెడ్డి,లావణ్య,రెడ్ క్రాస్ సభ్యులు కరిపె నర్సింగ్ రావు, బండారు శ్రీనివాస్,బిజ్జాల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు

## మంత్రి పొన్నం ప్రభాకర్ కి జన్మదిన శుభాకాంక్షలు తెలిపిన మాజీ కార్పొరేటర్ మహాలక్ష్మి రామన్ గౌడ్





హైదరాబాద్ వెలుతురు మే 08:

శుక్రవారం రోజున తెలంగాణ రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మరియు రవాణా శాఖ మంత్రివర్యులు పొన్నం ప్రభాకర్ గారి జన్మదిన సందర్భంగా హిమాయత్ నగర్ డివిజన్ మాజీ కార్పొరేటర్ మహాలక్ష్మి రామన్ గౌడ్ వారికి వారి కార్యాలయంలో కలిసి కప్పి శుభాకాంక్షలు తెలపడం జరిగింది. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు జి రామన్ గౌడ్, జాకీ , జైస్వాల్, రంజీర్ గౌడ్, అభిషేక్, జగదీష్ తదితరులు పాల్గొన్నారు.

## మంత్రి పొన్నం ప్రభాకర్ కు జన్మదిన శుభాకాంక్షలు తెలిపిన సురేష్ లాల్



హైదరాబాద్ వెలుతురు మే 08:

తెలంగాణ రాష్ట్ర బీసీ సంక్షేమ & రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ గౌడ్ జన్మదిన పురస్కరించుకుని హైదరాబాద్ లోని మంత్రులు నివాస సముదాయంలో ఆయనను మర్యాద పూర్వకంగా కలసి పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపిన సీనియర్ కాంగ్రెస్ నాయకుడు, హైదరాబాద్ ఆర్టీఏ సభ్యుడు సురేష్ లాల్ నేతికార్.

ఈ సందర్భంగా సురేష్ నేతికార్ మాట్లాడుతూ ప్రభ సుదీర్ఘ రాజకీయ అనుభవజ్ఞులు, ప్రతి ఒక్క కార్యకర్తకు అండగా నిలిచే నాయకులు అని, ఆయన సుదీర్ఘ రాజకీయ జీవితంలో ఉండాలని, ప్రజా సేవ చేయాలని ఆకాంక్షించారు.

## జనగణనలో కుల గణన చేయాలని ప్రభుత్వ సలహాదారు వి.హనుమంతరావు చేస్తున్న ఆమరణ నిరాహారదీక్షకు బీసీ జేఏసీ సంపూర్ణ మద్దతు




- **సమగ్ర కులగణను చేపడతామని హామీ ఇచ్చి మాట మారుస్తున్న కేంద్ర ప్రభుత్వం**
- **బీసీ జేఏసీ రాష్ట్ర కన్వీనర్ జాజుల లింగంగౌడ్**

హైదరాబాద్ వెలుతురు మే 08:

దేశవ్యాప్తంగా జరుగుతున్న జన గణనలో బీసీలను కూడా లెక్కించాలని కోరుతూ ఈ నెల 9వ తేదీన ఆమరణ నిరాహార దీక్ష చేస్తున్న ప్రభుత్వ సలహాదారు మాజీ పీసీసీ అధ్యక్షులు వి. హనుమంతరావు గారికి పూర్తి మద్దతు ప్రకటిస్తున్నట్లు బీసీ జేఏసీ రాష్ట్ర కన్వీనర్ జాజుల లింగంగౌడ్ పేర్కొన్నారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం దేశవ్యాప్తంగా జరిగే జనగణనలో సమగ్ర కులగణన చేపడుతామని 2025 ఏప్రిల్ 1న ఢిల్లీలోని కేంద్ర క్యాబినెట్ నిర్ణయం తీసుకుందని కాని 2026 ఏప్రిల్ 1నుంచి దేశవ్యాప్తంగా ప్రారంభమైన మొదటి దశ కుటుంబాల లెక్కింపులో ఓబిసి కుటుంబాలను ఎందుకు లెక్కించడం లేదని లింగంగౌడ్ కేంద్ర ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. ఎవరి జనాభా ఎంతో లెక్క తెలితేనే వారికంత వాటా దక్కుతుందని అందుకే ఓబీసీల లెక్క ఉండాల్సిందేనని అన్నారు.ఈ కార్యక్రమంలో బంటు వెంకటేశ్వర్లు,యర్రబెల్లి దుర్గయ్య ఉరీబండి శ్రీనివాస్ యాదవ్ దోనేటి శేఖర్ బంటు సైదులు రాంబాబు యాదవ్ అంజి రమేష్ తదితరులు పాల్గొన్నారు

# నిరుద్యోగుల పాలిట ఆశాదీపం కుంభం ఫౌండేషన్

- **జాబ్ మేలకు భారీ స్పందన కుంభం కీర్తి రెడ్డి కృషి అభినందనీయం**

భువనగిరి మే, 8 (వెలుతురు న్యూస్ ):




శుక్రవారం రోజున కుంభం ఫౌండేషన్ ఆధ్వర్యంలో వన్ మిలియన్ వన్ బిలియన్ సంస్థ సహకారంతో నిర్వహించిన జాబ్ మేళా కార్యక్రమంలో కుంభం పౌండేషన్ చైర్మన్ శ్రీమతి కీర్తి రెడ్డి గారిని పోత్నక్ ప్రమోద్ కుమార్ ఘనంగా సన్మానించడం జరిగింది ఈ సందర్భంగా కుంభం ఫౌండేషన్ చైర్మన్ కుంభం కీర్తి రెడ్డి మాట్లాడుతూ ఉమ్మడి నల్లగొండ జిల్లా భువనగిరి నియోజవర్గంలో ఉన్న విద్యార్థులు యువకులు నిరుద్యోగులు కోసం ఈ జాబ్ మేళా నిర్వహించడం ఎంతో సంతోషకరంగా ఉందని ఈరోజు ఈ జాబ్ మేళాలో సుమారు 2000 మంది యువతీ యువకులు పాల్గొని వాళ్లకు సంబంధించిన విద్యార్హత సర్టిఫికెట్లు వెరిఫికేషన్ చేయించుకొని సుమారు 20 కంపెనీలతో ఈ నెల 10వ తేదీన నిర్వహించే ఇంటర్వ్యూలలో విద్యార్థుల యువకులు నిరుద్యోగుల కమ్యూనికేషన్ స్కిల్స్ ద్వారా మరియు వాళ్ళ విద్యా అర్హతల ద్వారా ఉద్యోగ అవకాశాలు కల్పిస్తామని తెలిపారు ఈ ప్రాంతంలో ఎంతో మంది నిరుపేద కుటుంబాలకు సంబంధించిన విద్యార్థుల కోసం యువకుల కోసం నిరుద్యోగుల కోసం ఈ జాబ్ మేళా ఎంతో సువర్ణ అవకాశంగా ఉపయోగపడుతుందని అన్నారు న్యూ డైమెన్షన్స్ హై స్కూల్లో భారీ ఎత్తున నిరుద్యోగ యువకులకు ఉద్యోగాలు కల్పించడం కోసం వాళ్ళ స్కిల్స్ ను పలు కంపెనీల ముందట విద్యార్హత సర్టిఫికెట్ల వెరిఫికేషన్ కోసం భారీ ఎత్తున ఏర్పాట్లను చేయడం జాబ్ మేళా కోసం వచ్చిన నిరుద్యోగులు యువకులు విద్యార్థుల తల్లిదండ్రులకు భోజనాలు మంచినీటి వసతి అనేక మౌలిక వసతులు కల్పించడం జరిగింది ఇంత పెద్ద ఎండాకాలం ఉన్నప్పటికీ కూడా నిరుద్యోగ యువకులు విద్యార్థులు ఎంత పెద్ద ఎత్తున భారీగా రిజిస్ట్రేషన్ చేసుకోవడం నిరుద్యోగ సమస్య తీవ్రత తెలుస్తుందని ప్రభుత్వాలు అన్ని రకాల ఉద్యోగాలు కల్పించలేదు కల్పించడం సాధ్యం కాదు కాబట్టి నిరుద్యోగ పాలిట కుంభం పౌండేషన్ చేస్తున్న కృషి అభినందనీయమని అన్నారు ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ చైర్మన్ కౌన్సిలర్ లయిక్ అహ్మద్ మదర్ పాషా బబ్లు పడిగేల ప్రదీప్ ఎలిమినేటి కృష్ణారెడ్డి మాటూరు బాలేశ్వర్ పిట్టల బాలరాజ్ వస్తువుల స్థాయి పుట్ట శివ సందీప్ వెంకటేష్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

# వరి ధాన్యం కొనుగోలు ప్రక్రియను వేగవంతం చేయాలి

- **అకాల వర్షా లతో తడిసిన ధాన్యాన్ని ఏలాంటి ఆంక్షలు లేకుండా తక్షణమే కొనుగోలు చేయాలి**
- **శేర్ నర్సారెడ్డి తెలంగాణ రైతు ఐక్యవేదిక రాష్ట్ర అధ్యక్షుడు**

హైదరాబాద్ వెలుతురు మే 08:

వరి ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో జరుగుతున్న జాప్యాన్ని నివారించి వెంటనే కోనుగోళ్ళ ప్రక్రియను వేగవంతం చేయాలనీ, అకాల వర్షాల కారణంగా తడిసిన ధాన్యాన్ని ఏలాంటి ఆంక్షలు లేకుండా తక్షణమే కొనుగోలు చేయాలని తెలంగాణ రైతు ఐక్యవేదిక రాష్ట్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేసింది. వరి ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో సకాలంలో గన్నీ సంచులను, లారీలను, హమాలీలను సమకూర్చడంలో జరుగుతున్న జాప్యం కారణంగా రైతులు వరి ధాన్యం రాశుల కుప్పల వద్ద పడిగాపులు కాస్తున్నందున జాప్యాన్ని నివారించి ధాన్యం కొనుగోలు ప్రక్రియను వేగవంతం చేసేందుకు అధికారులు తక్షణమే తగు చర్యలు తీసుకోవాలని తెలంగాణ రైతు ఐక్య వేదిక రాష్ట్ర అధ్యక్షుడు శేర్ నర్సారెడ్డి ఒక ప్రకటనలో రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. వరి ధాన్యం తూకం వేసిన వెంటనే రైతులకు తక్ పట్టి కొనుగోలు రసీదును తప్పనిసరిగా ఇచ్చేవిధంగా అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు. తప్ప, తాలు పేరిట తరుగును తీస్తూ రైతులను నిట్టనిలువునా దోపిడీకి గురి చేస్తున్న రైస్ మిల్లర్లపై తగు కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. ఆరుగాలం కష్టపడి పండించిన



వరి ధాన్యం పంట అకాల వర్షాల కారణంగా కొనుగోలు కేంద్రాల్లో నీటిపాలు కావడంతో రైతులు కన్నీరు పెట్టుకుంటున్నారనీ, కొనుగోలు కేంద్రాల్లో తడిసిన, రంగు మారిన వరి ధాన్యాన్ని తరుగు లేకుండా ఎలాంటి ఆంక్షలు విధించకుండా పూర్తిగా కొనుగోలు చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే అధికార యంత్రాంగానికి ఆదేశాలు జారీ చేసి రైతులను ఆదుకోవాలని తెలంగాణ రైతు ఐక్యవేదిక రాష్ట్ర అధ్యక్షుడు శేర్ నర్సారెడ్డి రాష్ట్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.

# పెద్దకందుకూరులో వైభవంగా దుర్గమ్మ పోచమ్మ దేవత విగ్రహ ప్రతిష్ట ఉత్సవాలు

**యాదగిరిగుట్ట వెలుతురు న్యూస్ మే 08:**

యాదగిరిగుట్ట మండలం పెద్ద కందుకూరు గ్రామంలో నూతనంగా నిర్మించిన దుర్గమ్మ , పోచమ్మ , బిడారి మైసమ్మ ఆలయాల్లో దుర్గమ్మ , పోచమ్మ , బిడారి మైసమ్మ దేవత విగ్రహాల ప్రతిష్టాపన కార్యక్రమం శుక్రవారం అత్యంత వైభవంగా నిర్వహించారు. గ్రామ సర్పంచ్ గుండ్లపల్లి మంగమ్మ వెంకటేష్ గౌడ్, ఉపసర్పంచ్ సీస రమేష్ గౌడ్, గ్రామ పెద్దలు , వార్డు సభ్యులు తదితరుల ఆధ్వర్యంలో ఇటీవల నూతనంగా అత్యంత అద్భుతంగా దుర్గమ్మ, పోచమ్మ , బిడారి మైసమ్మ ఆలయాలను నిర్మించారు . గత కొన్ని రోజులుగా గ్రామంలో ఆయా సామాజిక



వర్గాల వారిగా బోనాలు, ఇతర పూజ కార్యక్రమాలను నిర్వహించారు. అనంతరం నూతనంగా నిర్మించిన ఆలయాలలో దేవతల విగ్రహ ప్రతిష్టాపన కోసం ప్రత్యేక పూజలు జరిపారు. ఈ సందర్భంగా శుక్రవారం ఉదయం నుండే హోమం యాగాది పూజలను వైభవోపేతంగా నిర్వహించారు. ఉదయం నుండి ఆయా పూజా కార్యక్రమాలు శాస్త్రోక్తంగా నిర్వహించి దేవతల విగ్రహ ప్రతిష్ట కార్యక్రమాన్ని కన్నుల పండుగ గా జరిపారు. ఈ సందర్భంగా గ్రామ ప్రజలు భక్తులు పెద్ద ఎత్తున దేవతల విగ్రహ ప్రతిష్ట కార్యక్రమంలో పాల్గొన్నారు. అనంతరం గ్రామస్తులకు, భక్తులకు పెద్ద ఎత్తున అన్నప్రసాద వితరణ కార్యక్రమాన్ని నిర్వహించారు . పెద్ద కందుకూరు గ్రామంలో నూతనంగా నిర్మించిన ఆలయాల్లో దేవత విగ్రహాల ప్రతిష్టాపన కార్యక్రమం సందర్భంగా జిల్లా, రాష్ట్రస్థాయి నాయకులు ప్రజాప్రతినిధులు పలువురు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. వారికి గ్రామ సర్పంచ్ గుండ్లపల్లి మంగమ్మ వెంకటేష్ గౌడ్, ఉపసర్పంచ్ సీస రమేష్ గౌడ్, పలువురు వార్డు సభ్యులు గ్రామ పెద్దలు పూలమాలలు శాలువాలతో సత్కరించి జ్ఞాపకలు అందజేశారు. ఈ కార్యక్రమంలో పెద్ద కందుకూరు గ్రామ సర్పంచ్ గుండ్లపల్లి మంగమ్మ వెంకటేష్ గౌడ్ , ఉపసర్పంచ్ సీస రమేష్ గౌడ్, గుజ్జ బలరాం, సీస నగేష్, గుండ్లపల్లి స్వామి గౌడ్ , సీస నరసింహులు గౌడ్ గ్రామ పెద్దలు గ్రామ ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు .

# కొండపైన దుకాణాలు స్థానిక నిరుద్యోగులకు లభించేలా టెండర్ నిర్వహించాలి

- **రాష్ట్ర దేవాదాయ శాఖ ఉన్నతాధికారులకు యాదాద్రి పరిరక్షణ కమిటీ ఆధ్వర్యంలో వినతి పత్రం అందజేత**

**యాదగిరిగుట్ట వెలుతురు న్యూస్ మే 08:**



యాదగిరిగుట్ట కొండపైన వర్తక సంఘాన్ని దుకాణాలను రద్దు చేస్తూ ఆ దుకాణాలను స్థానిక నిరుద్యోగులకు చెందేలా టెండర్ వేయాలని యాదాద్రి పరిరక్షణ కమిటీ ఆధ్వర్యంలో శుక్రవారం ఫ్లకార్డులతో హైదరాబాద్ లోని దేవాదాయ ధర్మాదాయ శాఖ కార్యాలయం ముందు ధర్నా నిర్వహించి అడిషనల్ కమిషనర్ శ్రీనివాస్ రావు , రెవెన్యూ అండ్ ఎండోమెంట్ ప్రిన్సిపల్ సెక్రటరీ శైలజ రామయ్యర్ ను కలిసి వినతి పత్రం అందజేశారు.

ఈ సందర్భంగా పరిరక్షణ కమిటీ నేతలు కాటబత్తిని ఆంజనేయులు , కర్రె ప్రవీణ్ దండబోయిన వీరేష్ యాదవ్, పల్లపు బాలయ్య తదితరులు మాట్లాడుతూ ఎన్నో ఏళ్లుగా అతి తక్కువ కిరాయితో కొండపైన దుకాణాలు నిర్వహిస్తూ వాటిని రెన్యువల్ చేసుకుంటూ కొత్తవారికి అవకాశం ఇవ్వకుండా అధిక రేట్లకు అమ్ముతూ భక్తులను ఇబ్బంది పెడుతున్న వర్తకసంఘాన్ని తక్షణమే రద్దు చేస్తూ టెండర్లు వేయాలని వారు డిమాండ్ చేశారు . గతంలో కేవలం 30,40 షాపులే ఉండేవి. ఇప్పుడు వాటిని 114 షాపులుగా పెంచారు. రాజకీయ, అధికార బలంతో ఈ విధంగా ఈ షాపులను వారు నిర్వహించుకుంటున్నారని విమర్శించారు. స్వామివారి అభివృద్ధిలో భాగంగా వీళ్లు ఎటువంటి ఆస్తులు కోల్పోలేదు, స్వామి వారి కోసం ఎంతోమంది వారి ఇండ్లను భూములను కోల్పోయారు. వారికి ఎటువంటి న్యాయం జరగలేదు అని అన్నారు. గత ప్రభుత్వం వీరికి కొండక్రింద నూతనముగా కొన్ని కోట్లు ఖర్చు చేసి షాప్ లను నిర్మించడం జరిగింది. ఇట్టి వర్తక సంఘం వల్ల దేవస్థానానికి మరియు భక్తులకు నష్టమే తప్ప లాభం లేదు అని అన్నారు. తక్షణమే వర్తక సంఘాన్ని రద్దు చేసి స్థానికులకు అందుబాటులో ఉండే విధంగా టెండర్లు వేయాలని వారు అధికారులను కోరారు ఈ మేరకు పరిశీలన చేసి తగిన చర్యలు తీసుకుంటామని అధికారులు వారికి హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో యాదాద్రి పరిరక్షణ కమిటీ నేతలు కాటబత్తిని ఆంజనేయులు, బండ రామస్వామి, దేవపూజ అశోక్, పల్లపు బాలయ్య , దండబోయిన వీరేష్ యాదవ్ ,పబ్బల ఉప్పలయ, మిరియాల కృష్ణ, ఆకుల అనిల్, బండి అనిల్, వంగపల్లి అరుణ్,మందోజు నరేష్, కొన్నె సంజీవ,కర్రె ప్రవీణ్, దార నవీన్, గోపగాని ప్రసాద్ , జోరిగళ్ల ప్రశాంత్, కర్రే శ్యామ్, గుండు కుమార్,ఆరె కుమార్, దార క్రిష్ణ, పల్లపు రాజు ,శ్రీనాథ్, వంశీ, రాజు, విజయ్ తదితరులు పాల్గొన్నారు.

# నెలరోజులుగా ధాన్యం కొనలేదు... రైతుల గోడు ప్రభుత్వానికి పట్టదా

- **రైతులతో కన్నీళ్లు పెట్టిస్తున్న కాంగ్రెస్ సర్కార్**
- **- మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య**

నార్కట్ పల్లి, మే 8 (వెలుతురు):



నార్కెట్ పల్లి పట్టణ కేంద్రంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య సందర్శించారు. ఈ సందర్భంగా రోజుల తరబడి కల్లాల్లో పేరుకుపోయిన ధాన్యపు రాశులను పరిశీలించిన ఆయన, అక్కడ ఉన్న రైతులతో మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు.

రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత రైతుల పరిస్థితి మరింత దయనీయంగా మారిందని ఆయన విమర్శించారు. ప్రభుత్వం వద్ద కొనుగోళ్లు సక్రమంగా నిర్వహించకపోవడంతో రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. సరిపడా లారీలు లేక రైతులు ధాన్యాన్ని తరలించేందుకు ఇబ్బందులు పడుతున్నారని, బస్తాకు అదనపు డబ్బులు వసూలు చేస్తున్నారని ఆరోపించారు. కొనుగోలు కేంద్రాలకు ధాన్యం తీసుకొచ్చి నెలరోజులు గడిచినా ఇంకా కాంటాల్లో పెట్టని పరిస్థితి ఉందని తెలిపారు. లారీలు బ్యాక్ చేయడానికి ఐదు నుంచి ఆరు రూపాయల వరకు అదనంగా డబ్బులు డిమాండ్ చేస్తున్నారని రైతులు తమ వద్ద వాపోయినట్లు చెప్పారు. పేరుకే కొనుగోలు కేంద్రాలు ప్రారంభించారని, కానీ ఇప్పటివరకు ప్రభుత్వం ఒక్క గింజ కూడా కొనుగోలు చేయలేదని విమర్శించారు. పంట వేసిన నాటి నుంచి పండించిన పంటను అమ్ముకునే వరకు రైతులు అష్టకష్టాలు పడుతున్నారని పేర్కొన్నారు. రాష్ట్రవ్యాప్తంగా ఇదే పరిస్థితి ఉన్నప్పటికీ, నకిరేకల్ నియోజకవర్గంలో పరిస్థితి మరింత దారుణంగా ఉందన్నారు. పంట పండించడం కంటే పండిన పంటను మార్కెట్ లో విక్రయించడం రైతులకు పెద్ద సవాల్ గా మారిందని, రైతు రాజ్యంలో రైతు కన్నీరు పెట్టుకుంటే ఈ ప్రభుత్వానికి పతనం తప్పదని హెచ్చరించారు. తమ టీఆర్ఎస్ ప్రభుత్వం అధికారంలో ఉన్న సమయంలో కొనుగోలు కేంద్రాలను తరచూ సందర్శించి రైతుల సమస్యలను వెంటనే పరిష్కరించే వారమని గుర్తుచేశారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రైతుల సమస్యలపై దృష్టి పెట్టకుండా విమర్శలకే పరిమితమయ్యారని ఆరోపించారు. ప్రభుత్వం వెంటనే వడ్ల కొనుగోళ్లు ప్రారంభించాలని, లేకపోతే తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సి వస్తుందని హెచ్చరించారు.

# ప్రజాపాలన అంటూ రాక్షస పాలన సాగిస్తున్న కాంగ్రెస్ సర్కార్

**మోత్కూర్ వెలుతురు న్యూస్ మే 08:**



రాష్ట్రంలో ప్రజాపాలన అంటూ రాక్షస పాలన సాగిస్తున్నారని ఈ రాక్షసపాలనకు బి. జె. పి. వంతపాడుతుంది అనడానికి నిదర్శనమే నిన్న వరంగల్ రైతుసభలో మాట్లాడిన కే.టీ.ఆర్. పైన కేసులు పెట్టడం హుజురాబాద్ ఎమ్మెల్యే క్యాంప్ ఆఫీస్ పై బీజేపీ నాయకులు దాడి చేయడమేనని బి. ఆర్. ఎస్. రాష్ట్రనాయకులు నేవూరి ధర్మేందర్ రెడ్డి అన్నారు. బి. ఆర్. ఎస్. ప్రభుత్వం ఉన్నప్పుడు మీరు కెసిఆర్ పై వాడిన బాషకు మేము మీలాగా కేసులు పెట్టాలంటే మీరొక్కరు కుడా బయట తిరిగేవారు కాదన్నారు.కేంద్ర మంత్రి హోదాలో ఉండి డ్రగ్స్ పై మాట్లాడటం సిగ్గుచేటన్నారు.బండి సంజయ్ కేంద్రమంత్రి హోదాలో ఉండి చిల్లరమాటలు మాట్లాడటం మానుకోవాలన్నారు.మీరే తప్పు మాట్లాడి దాన్ని ఖండించిన దానికి మాపై దాడులుచేస్తామంటే ఊరుకోమని దానికి ప్రతి దాడులు చేస్తే పరిణామాలు చాలా తీవ్రంగా ఉంటాయన్నారు. కాని అది మా సంస్కృతి కాదన్నారు.ఇచ్చిన హామీలు అమలు చేయమని అడిగితే అడ్డగోలుగా మాట్లాడుతూ కేసులు పెడతాం అంటే భయపడే ప్రసక్తేలేదన్నారు.మీరు కేసులు పెట్టడం కాదు వచ్చేఎన్నికల్లో ప్రజలే మీకు వాతలు పెట్టడం ఖాయమన్నారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ మాజీ చైర్మెన్ కొణతం యాకుబ్ రెడ్డి. మోత్కూర్ మండల, మున్సిపాలిటీ అధ్యక్షులు పొన్నెబోయిన రమేష్. జంగశ్రీను, అడ్డగూడూర్ మండలఅధ్యక్షులు కొమ్మిడి ప్రభాకర్ రెడ్డి. రైతుబందు మాజీ అధ్యక్షులు కొండా సోమల్లు. పట్టణ ప్రధాన కార్యదర్శి గజ్జి మల్లేష్. జిల్లా SC ST మానేటిరింగ్ సభ్యులు దాసరి తిరుమలేష్, బి.ఆర్. ఎస్. BC విభాగం మండలఅధ్యక్షులు పానుగుల్ల విష్ణుమూర్తి, నాయకులు మర్రి అనిల్, కూరెళ్ల పరమేష్. పొన్నెబోయిన మచ్చగిరి, సదువాసి రాజు తదితరులు పాల్గొన్నారు.

# రైతులు ఇబ్బందులు పడుతుంటే, వారోత్సవాల పేరుతో పండుగలా

- **దాన్యం కొనుగోళ్లు వేగవంతం చేసి, రైతుల సమస్యలు పరిష్కరించాలి**
- **సిపిఎం**

**మోత్కూర్ వెలుతురు న్యూస్ మే 08:**



అరుకాలం కష్టపడి పండించిన పంటను అమ్ముకోవాడానికి రైతులు నా నా ఇబ్బందులు పడుతుంటే, సమస్యను పరిష్కరించవలసిన ప్రభుత్వం "ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక " పేరుతో ఉత్సవాలు నిర్వహిస్తే, రైతులు ప్రజల సమస్యలు తీరుతాయా అని సిపిఎం పార్టీ మండల కార్యదర్శి గుండు వెంకటనర్సు ప్రశ్నించ్చారు. శుక్రవారం రోజున మోత్కూర్ మండలం పాటిమట్ల గ్రామంలో పార్టీ నాయకులతో కలసి దాన్యం కొనుగోలు కేంద్రాన్ని పరిశీలించారు . అనంతరం ఆయన మాట్లాడుతూ..... ఒకవైపు రైతులు కోతలు పూర్తిచేసి దాన్యాన్ని కళ్ళాల్లో కుప్పలుగా నిల్వచేసి కొనుగోలు కోసం రైతులు ఆందోళన చెందుతుండగా, మరోవైపు వాతావరణ మార్పులు, అకాల వర్షాలతో రైతులను కంటిమీద కునుకు లేకుండా చేస్తున్నాయని, ఇలాంటి సమయంలో రైతుల సమస్యలను పరిష్కరించవలసిన ప్రభుత్వం, వారోత్సవాలు నిర్వహిస్తే రైతులు సంతోషంగా ఎలా పాల్గొంటారని అన్నారు. ప్రభుత్వ నిర్లక్ష్యం కారణంగా రైతులు నెలరోజుల నుండి కళ్ళాల్లో పడిగాపులు కాస్తున్నారని తాము రోడ్లపై అరిగోస పడుతుంటే ప్రభుత్వం పండుగలు చేసుకోవడం బాధకరమని రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారని తెలిపారు. ఇప్పటికైన ప్రభుత్వం స్పందించి దాన్యం కొనుగోళ్లను వేగవంతచేసి, తేమ తరుగు పేరుతో రైతులు దోపిడీకి గురికాకుండా మద్దతు ధరకు కొనుగోలు చేసి, రైతులను ఆదుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం పార్టీ మండల కమిటీ సభ్యులు దడిపల్లి ప్రభాకర్, కురిమేటి యాదయ్య, రాచకొండ కనకయ్య, శాఖ సభ్యులు బండి రవి, దొండ నాగరాజు, అన్నవరం నారాయణ, యాదయ్య, తదితరులు పాల్గొన్నారు.

# సమగ్ర పశుసంవర్ధక చికిత్స మరియు అవగాహన కార్యక్రమం

- **సర్పంచ్ గర్దాస్ విక్రమ్ గౌడ్**

**రామన్నపేట వెలుతురు మే 08:**



గ్రామం ఇంద్రపాలనగరం 99 రోజుల కార్యాచరణ ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక లో భాగంగా ఇంద్రపాలనగరం ప్రాధమిక పశువైద్యశాల వద్ద నిర్వహించిన సమగ్రపశుసంవర్ధక చికిత్స మరియు అవగాహనా శిబిరం ప్రారంభించిన సర్పంచ్ గర్ధాస్ విక్రమ్ ఉపసర్పంచ్ నల్ల జయసుధ స్వామి, మందడి విధ్యాసాగర్ రెడ్డి మాజీ ఏఎంసి డైరెక్టర్, జిట్టబోయిన వెంకటేష్, మాధం నగేష్,కంబాలపల్లి స్వామి, వైద్య సిబ్బంది. ఎ డి డాక్టర్ ఇందు,డాక్టర్ జోత్స్న , డాక్టర్ అన్వర్ అలీ, డాక్టర్ రామాంజనేయులు, రాజేందర్, శ్రీశైలం, మల్లేష్, సురేష్, రైతులు కోలుకులపల్లి లింగయ్య, మిర్యాల భద్రయ్య, సింగణబోయిన శ్రీనివాస్, ఈర్లపల్లి కిష్టయ్య, శ్యామల బాలరాజు తదితరులు పాల్గొన్నారు.

# నారాయణరెడ్డి చిత్రపటానికి నివాళులర్పించిన ఎమ్మెల్యే వీరేశం.

రామన్నపేట వెలుతురు మే 08:



మండలంలోని వెల్లంకి గ్రామానికి చెందిన జిల్లా డీసీసీ ప్రధాన కార్యదర్శి తిమ్మాపురం మహేందర్ రెడ్డి తండ్రి తిమ్మాపురం నారాయణరెడ్డి ప్రథమ వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి నకిరేకల్ శాసనసభ్యులు వేముల వీరేశం. మరియు ఆయన సతీమణి వేముల పుష్ప పూలమాలవేసి నివాళులర్పించారు. వీరి వెంట కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకులు గంగుల వెంకట్ రాజిరెడ్డి,నంద్యాల బిక్షం రెడ్డి, గుత్తా నర్సిరెడ్డి, గంజి భాస్కర్, ఐటిపాముల పెద్దులు, ఎడ్ల సురేందర్ రెడ్డి, కర్రె రమేష్ తదితరులు పాల్గొన్నారు.

# వివాహకార్యక్రమాలలో పాల్గొన్న శాసనమండలి మాజీ చైర్మన్ నేతి విద్యాసాగర్



రామన్నపేట , మే 8 వెలుతురు న్యూస్

మాజీ మండలి చైర్మన్ నేతి విద్యాసాగర్ తో కలిసి పలు వివాహ వేడుకలకు హాజరై నూతన వధూవరులకు శుభాకాంక్షలు తెలియచేసిన ఇంద్రపాలనగరం సర్పంచ్ గర్దాస్ విక్రమ్. బాటసింగారం పద్మశ్రీ ఫంక్షన్ హాల్ లో జరిగిన ఇంద్ర పాలనగరం గ్రామానికి చెందిన తెడ్డు వెంకటేశం కుమారుడుతెడ్డు వినయ్ నిఖితల వివాహం లో పాల్గొని నూతన వధూవరులను ఆశీరధించి, నూతన వధూవరులకు శుభాకాంక్షలు తెలియచేశారు. ఆర్.బి.ఆర్ ఫంక్షన్ హాల్ లో జరిగిన ఇంద్ర పాలనరం గ్రామానికి చెందిన భువనగిరి దాసు కుమారుడు రజినీకాంత్ సమిత ల వివాహ వేడుకకు హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించి, నూతన వధూవరులకు శుభాకాంక్షలు తెలియజేసిన శాసన మండలి మాజీ చైర్మన్ నేతి విద్యాసాగర్ ఇంద్ర పాలనగరం సర్పంచ్ గర్దాస్ విక్రమ్.

# ఇందిరమ్మ ఇండ్ల గృహప్రవేశం కార్యక్రమంలో పాల్గొన్న సర్పంచ్ మారేపల్లి మల్లారెడ్డి



రామన్నపేట , మే 8 వెలుతురు న్యూస్

కొమ్మాయిగూడెం గ్రామంలో ఇందిరమ్మ ఇండ్ల గృహప్రవేశం కార్యక్రమం లో పాల్గొన్న సర్పంచ్ మారేపల్లి మల్లారెడ్డి ఇటీవల కాలం లో కాంగ్రెస్ పార్టీ ప్రవేశ పెట్టిన పేదలకు సొంతింటి కల ఇందిరమ్మ ఇండ్లు పథకంలో భాగంగా, కొమ్మాయిగూడెం గ్రామంలో బుర్కలా పార్వతమ్మ కొత్తగా నిర్మించుకున్న ఇందిరమ్మ ఇంటి గృహప్రవేశం కార్యక్రమానికి ముఖ్య అతిధిగా కొమ్మాయిగూడెం సర్పంచ్ మారేపల్లి మల్లారెడ్డి పాల్గొని కొబ్బరికాయ కొట్టి ఇల్లు ఓపెనింగ్ చేయడం జరిగింది. అలాగే ఇంటి అవసరాల నిమిత్తం ఆర్థిక సహాయం కూడా చేయడం జరిగింది. ఈ కార్యక్రమం లో ఉపసర్పంచ్ తీర్పాల ఐలయ్య. గ్రామశాఖ అధ్యక్షులు మోటే మారయ్య, గుడి చైర్మన్ బాలగోని గణేష్ గౌడ్, మాజీ ఉపసర్పంచ్ కూనూరు క్రిష్ణ గౌడ్ , వార్డు సభ్యులు లింగస్వామి, అశోక్, కల్లూరి శివ, వీరమళ్ళ పరశురామ్, ఎర్ర నర్సింహా, భాషయ్య తదితరులు పాల్గొన్నారు.

# తిమ్మాపూరం నారాయణ రెడ్డి చిత్ర పటానికి నివాళులు అర్పించిన

**టీపీసీసీ అధికార ప్రతినిధి మేడి. రవిచంద్ర**

రామన్నపేట , మే 8 వెలుతురు న్యూస్



మండలం వెల్లంకి గ్రామానికి చెందిన మాజీ ఎంపీటీసీ తిమ్మాపురం మహేందర్ రెడ్డి తండ్రి నారాయణ రెడ్డి ప్రధమ వర్ధంతి సందర్భంగా వెల్లంకి గ్రామం లో వారి నివాసానికి వెళ్లి వారి చిత్ర పటానికి నివాళులు అర్పించి వారి కుటుంబానికీ ఆ భగవంతుని ఆశీస్సులు ఉండాలి. కోరుకోవడం జరిగింది.

# మేడిపల్లి సత్యం నిర్లక్షంతోనే ధాన్యం రైతులకు తిప్పలు

- బీజేపీ కిసాన్ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షులు సింగిరెడ్డి కృష్ణారెడ్డి.

చొప్పదండి వెలుతురు మే 08:



చొప్పదండి మండలం ఆర్నకొండలో తూకం వేసి తయారుగా ఉన్న వేల బస్తాల ధాన్యం తరలించడం లేదని మండలంలోని ఆర్న కొండ లో రైతులు రాష్ట్ర రహదారిపై రాస్తారో కో నిర్వహించారు. చొప్పదండి మండలంలో అనేక ధాన్యం కొనుగోలు కేంద్రాలలో గత వారం రోజులుగా తూకం వేసి బస్తాల్లో నింపిన ధాన్యం మిల్లర్లు దిగుమతి చేసుకోక రవాణా లారీలు లేక కొనుగోలు కేంద్రాల లోనే ఉండిపోయింది. నిన్న ఆకస్మాత్తుగా గాలి దుమారం తో పాటు వర్షం రావడంతో రైతులు పాలిథిన్ కవర్లు లేక నానా అగచా ట్లు పడ్డారు. చొప్పదండి మండలం నుంచి సేకరించవలసిన దాన్యంలో ఇప్పటివరకు కేవలం 10 శాతం మాత్రమే ప్రభుత్వం సేక రించగలిగింది. మిగిలిన దాన్యం కొనుగోలు కేంద్రాల్లోనే బస్తాలలో నింపి గాని లేదా రైతు ధాన్యం రాశులుగా గాని అలాగే ఉంది. ఎండలు విపరీతంగా కాస్తుండడంతో ధాన్యం పూర్తిగా ఎండి తేమ శాతం 11% 12% కు పడిపోయింది. ప్రభుత్వ నిర్లక్ష్య వైఖరితో తీవ్ర ఆగ్రహం గా ఉన్న రైతులు నిన్నటి గాలి దుమారంతో మరింత ఆందోళన చెంది బి ఆర్ ఎస్ మాజీ శాసన సభ్యులు సుంకె రవిశంకర్ మరియు బీజేపీ నాయకులు సింగిరెడ్డి కృష్ణారెడ్డి మొగిలి మహేష్ ల తో కలసి నేడు ఉదయం కొనుగోలు సెంటర్ సమీపంలోనే ఉన్న ఆర్నకొండ డబల్ రోడ్డుపై బైఠాయించారు. ఈ సందర్భంగా బిజెపి కిసాన్ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షులు సింగిరెడ్డి కృష్ణారెడ్డి మాట్లాడుతూ ధాన్యం కొనుగోలు కేంద్రాలపై స్థానిక శాసన సభ్యులు మేడిప ల్లి సత్యం నిర్లక్ష్య వైఖరి వహిస్తూ ఉన్నారని కొనుగోలు కేంద్రాల్లో దాన్యం ఎక్కడిధక్కడే ఉన్నా యంత్రాంగం పట్టించుకోవడం లేదని ఇప్పటికీ 90 శాతం ధాన్యం కొనుగోలు కేం ద్రాలలో ఉండడం ప్రభుత్వ నిర్లక్ష్యానికి నిదర్శ నం అని తక్షణం కొనుగోలు కేంద్రాల్లో ఉన్న ధాన్యం పూర్తిగా ఖరీదు చేసి తరలించాలని చొప్పదండి మండలంలో ఉన్న కొనుగోలు కేంద్రాల్లో లక్షలాది బస్తాల ధాన్యం అలాగే ఉంటే మేడిపల్లి సత్యం ప్రతిపక్షాలను విమ ర్శించడం విడ్డూరం అన్నారు. ఆర్నకొండ సింగిల్ విండోలో 14000 బస్తాలు రాగం పేటలో 6000 బస్తాలు, దేశాయిపేట లో 800 బస్తాలు చొప్పదండి సింగిల్ విండో పరిధిలో 80,000 బస్తాల ధాన్యం కల్లాలలో నే ఉండిపోతే చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం మాత్రం ప్రతిపక్షాలను విమర్శిస్తూ పొ ద్దుపుచ్చుతున్నారని ఆరోపించారు. చొప్ప దండి సి ఐ ప్రదీప్ కుమార్, రామడుగు ఏస్ ఐ ఆధ్వర్యంలో పోలీసులు బందో బస్తు నిర్వ హించారు కార్యక్రమంలో చొప్పదండి బిజెపి రూరల్ మండల శాఖ అధ్యక్షులు మొగిలి మహేష్. దేశాయిపేట సర్పంచ్ గుంట రవి అర్నకొండ మాజీ ఎంపిటిసి గొల్ల సునంద గట్టయ్య,బిజెపి ప్రధాన కార్యదర్శి కొమ్ము రమేష్, గుమ్లాపూర్ మాజీ ఉపసర్పంచ్ విలాసాగరం అంజయ్య, రాపెల్లి శ్రీనివాస్, కాయిత సాయి, గుండె వెంకటేష్,, రైతులు మ్యాకల రాములు, దామెర మధుసూదన్ రెడ్డి. దయ్యాల శేఖర్, జక్కుల అంజయ్య,మొ గిలి మహేష్, శంకర్,హేమారెడ్డి, మావురం మల్లికార్జున్ రెడ్డి, గంగారెడ్డి, రామచంద్ర రెడ్డి కడారి భూమయ్య,ఏముండ్ల భూమయ్య, వి ద్యాసాగర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# మోదీ సభను విజయవంతం చేయాలి



- బీజేపీ యువ మోర్చా మాజీ అసెంబ్లీ కన్వీనర్ నరేష్ పాటిల్ జగదీశ్వరాచారి.

జహీరాబాద్ వెలుతురు మే 08:

ఈ నెల 10వ తేదీన హైదరాబాద్ పరేడ్ గ్రౌం డ్స్‌లో జరగనున్న ప్రధానమంత్రి నరేంద్ర మోదీ భారీ బహిరంగ సభకు సంగారెడ్డి జిల్లా జహీరాబాద్ నియోజకవర్గానికి చెందిన బీజేపీ కార్యకర్తలు, యువత, మోదీ అభిమానులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి సభను విజయవంతం చేయాలని బీజేపీ యువ మోర్చా మాజీ అసెంబ్లీ కన్వీనర్ నరేష్ పాటిల్ పిలుపునిచ్చారు. ప్రధాని మోదీ నాయకత్వంలో దేశం అభివృద్ధి దిశగా వేగంగా ముందుకు సాగుతోందని ఆయన పే ర్కొన్నారు. తెలంగాణలో నిర్వహించనున్న ఈ భారీ సభ బీజేపీకి మరింత బలం చేకూర్చుతుంద ని అన్నారు. సభను విజయవంతం చేయడానికి ప్రతి కార్యకర్త కృషి చేయాలని సూచించారు. జహీరాబాద్ నియోజకవర్గం నుంచి భారీ కాన్వా య్‌లతో సభకు వెళ్లేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు.

# "చలో పరేడ్ గ్రౌండ్స్"తో బీజేపీ శక్తి ప్రదర్శన

- 10 లక్షల మందితో మోదీ సభ లక్ష్యం
- తెలంగాణలో మోదీ తొలి భారీ సభను ప్రతిష్టాత్మకంగా తీసుకున్న బీజేపీ...
- నిమ్స్ అభివృద్ధి, పారిశ్రామిక వృద్ధికి కేంద్రం ప్రత్యేక ప్రాధాన్యం...
- పరిశ్రమల అభివృద్ధితో జహీరాబాద్ రూపురేఖలు మారతాయి...
- మాజీ ఎంపీ బి బి పాటిల్, మాజీ డీసీసీబీ చైర్మన్ జైపాల్ రెడ్డి...

జహీరాబాద్ వెలుతురు, మే 08:





హైదరాబాద్ పరేడ్ గ్రౌండ్స్‌లో ఈ నెల 10వ తేదీన నిర్వహించనున్న ప్రధానమం త్రి నరేంద్ర మోదీ భారీ బహిరంగ సభను అత్యంత ప్రతిష్టాత్మకంగా తీసుకున్నట్లు బీజేపీ నాయకులు వెల్లడించారు. "చలో పరేడ్ గ్రౌండ్స్" నినాదంతో తెలంగాణ వ్యా ప్తంగా సుమారు 10 లక్షల మంది ప్రజలను సమీకరించడమే లక్ష్యంగా పెట్టుకున్నామని తెలిపారు. ఈ సభ తెలంగాణ రాజకీయాల్లో ఒక కీలక మలుపుగా నిలుస్తుందని ధీమా వ్యక్తం చేశారు. సంగారెడ్డి జిల్లా జహీరా బాద్ పట్టణంలో నిర్వహించిన మీడియా సమావేశంలో మాజీ పార్లమెంట్ సభ్యులు, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ ప్రత్యేక ఆహ్వానితులు బి.బి. పాటిల్ మాట్లాడుతూ... ప్రధానిగా మూడోసారి బాధ్యతలు చేపట్టిన అనంతరం తెలంగాణలో ప్రధాని నరేంద్ర మోదీ పాల్గొం టున్న తొలి భారీ బహిరంగ సభ ఇదేనని పేర్కొన్నారు. జహీరాబాద్ నియోజకవర్గం లోని ప్రతి గ్రామం నుంచి బీజేపీ కార్యకర్తలు, యువత, మోదీ అభిమానులు భారీ సంఖ్యలో తరలివచ్చి సభను విజయవంతం చేయాలని కోరారు. ఈ సందర్భంగా కేంద్ర ప్రభుత్వం తెలంగాణ రాష్ట్రానికి అందిస్తున్న సహకారం, అభివృద్ధి కార్యక్రమాలపై బీజేపీ నాయకులు వివరించారు. ముఖ్యంగా నిమ్స్ ఆసుపత్రి అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం భారీ నిధులు కే టాయించిందని తెలిపారు. అత్యాధునిక వైద్య బ్లాక్‌ల నిర్మాణం, సరికొత్త వైద్య పరికరాల ఏర్పాటు ద్వారా సామాన్య ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందేలా చర్యలు తీసుకుంటోం దని పేర్కొన్నారు. ఆరోగ్య రంగంలో కేంద్రం తీసుకుంటున్న నిర్ణయాలు ప్రజలకు ఎంతో మేలు చేస్తున్నాయని అన్నారు. తెలంగాణలో పారిశ్రామిక వృద్ధికి కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక ప్రోత్సాహకాలు అందిస్తోందని, ముఖ్యంగా ఐటి, మౌలిక సదుపాయాల రంగాల్లో భారీ ప్రాజెక్టులు అమలు చేస్తున్నట్లు తెలిపారు. జహీరాబాద్ ఇండస్ట్రియల్ పార్క్‌తో పాటు రాష్ట్రంలోని పలు అభివృద్ధి కార్యక్రమాలను ప్రధాని మోదీ వర్చువల్‌గా జాతికి అంకితం చేయనున్నారని వెల్లడించారు. ఈ ప్రాజెక్టుల అమలుతో జహీరాబాద్ ప్రాంత రూపురేఖ లు పూర్తిగా మారిపోవడంతో పాటు స్థానిక యువతకు పెద్దఎత్తున ఉపాధి, ఉద్యోగ అవ కాశాలు లభిస్తాయని ఆశాభావం వ్యక్తం చేశారు. పరిశ్రమల అభివృద్ధితో ప్రాంత ఆర్థిక వ్యవస్థ మరింత బలోపేతం అవుతుంద ని పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వం తెలంగాణ రాష్ట్ర అభివృద్ధి కోసం కేటాయించిన సుమారు రూ.10 లక్షల కోట్ల నిధుల వినియోగంపై రాష్ట్ర ప్రభుత్వం ప్రజలకు స్పష్టత ఇవ్వాలని డిమాండ్ చేశారు. కేంద్రం ఇచ్చిన నిధులను రాష్ట్ర ప్రభుత్వం తమ ప్రచారం కోసం వాడు కుంటోందని విమర్శించారు. ప్రజలు వాస్తవా లను గుర్తించి అభివృద్ధికి తోడ్పడే నాయకత్వా నికి మద్దతు ఇవ్వాలని కోరారు.

బీజేపీ అంటే అభివృద్ధి, అభివృద్ధి అంటే బీజేపీ అనే నమ్మకం ప్రజల్లో బలపడిందని పేర్కొన్నారు. ఇటీవల జరిగిన ఎన్నికల్లో ప్రజలు ప్రధాని మోదీ నాయకత్వంలోని బీజేపీ ప్రభుత్వానికి ఘన విజయాన్ని అం దించారని తెలిపారు. దేశ ప్రజలు అభివృద్ధి, పారదర్శక పాలన, స్థిరమైన నాయకత్వాని కి మద్దతు తెలుపుతున్నారని అన్నారు. ఈ సమావేశంలో మాజీ పార్లమెంట్ సభ్యులు బి.బి. పాటిల్, విజయ మోహన్ రెడ్డి, మాజీ డీసీసీబీ చైర్మన్ జైపాల్ రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి నౌబాద్ జగన్నాథ్, ఉపాధ్యక్షులు గొల్ల భాస్కర్, మండల అధ్యక్షులు రమేష్ రెడ్డి, వైద్యనాథ్, విశ్వనాథ్, దుర్గయ్య, కౌ న్సిలర్ శ్రావణ్, పాదురంగ రెడ్డి, విజేందర్ రెడ్డి, కృష్ణ రెడ్డి, శంకర్ రెడ్డి, సోమ అనిల్, అరుణ్, జగన్నాథ్ హిందూస్, మారయ్య, సునీల్, సురేష్ పూరి, యశ్వంత్ రావు పాటిల్, రవి, హృషబ్, రాజ్ కుమార్, కార్తీక్ రెడ్డి, అఫ్సర్, విట్టల్ రెడ్డి తదితర ముఖ్య నాయకులు పాల్గొన్నారు. రాబోయే పరేడ్ గ్రౌండ్స్ భారీ సభను విజయవంతం చేయడానికి ప్రతి కార్యకర్త సమిష్టిగా కృషి చేయాలని నాయకులు పిలుపునిచ్చారు.

# సొంత నిధులతో బోర్‌వెల్స్ ఏర్పాటు చేసిన కాంగ్రెస్ నాయకుడు ప్రసాద్ రెడ్డి



- వెంకటాపూర్ బీసీ, ఎస్సీ కాలనీల్లో తాగునీటి సమస్య పరిష్కారానికి ముందుకొచ్చిన పారిశ్రామిక వేత్త...
- ప్రజా సేవే అసలైన గుర్తింపు అని వ్యాఖ్య...

జహీరాబాద్ వెలుతురు మే 08:

చేసిన సేవలే మనిషికి నిజమైన గుర్తింపునిస్తా యని, తమ సంపాదనలో కొంత భాగాన్ని నిరు పేదలు, అర్హుల సంక్షేమం కోసం వెచ్చించి వారికి అండగా నిలబడితేనే జన్మ సార్థకమవుతుందని కాంగ్రెస్ నియోజకవర్గ నాయకులు, ప్రముఖ పారిశ్రామిక వేత్త కుడిముస్కుల ప్రసాద్ రెడ్డి అన్నారు. సంగారెడ్డి జిల్లా జహీరాబాద్ నియో జకవర్గ పరిధిలోని కోహిర్ మండలం వెంకటా పూర్ గ్రామంలోని బీసీ, ఎస్సీ కాలనీల్లో ప్రజలు ఎదుర్కొంటున్న తాగునీటి సమస్యను పరిష్క రించేందుకు ఆయన సొంత నిధులతో రెండు బోర్‌వెల్స్ ఏర్పాటు చేయించారు. గురువారం రాత్రి బోర్‌వెల్స్ తవ్వక పనులకు శ్రీకారం చుట్టగా, గ్రామ సర్పంచ్ అశోక్ టెంకాయ కొట్టి భూమిపూజ నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రసాద్ రెడ్డి మాట్లాడుతూ... గ్రామాల్లో ప్రజలు కనీస అవసరాల కోసం ఇబ్బందులు పడకుండా చూడటం ప్రతి సామాజిక బాధ్యత కలిగిన వ్యక్తి కర్తవ్యమని అన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో తాగునీటి సమస్య తీవ్రంగా ఉందని తెలుసుకున్న వెంటనే స్పందించి బీసీ, ఎస్సీ కాలనీల్లో రెండు బోర్‌వెల్స్ ఏర్పాటు చేయించామని తెలిపారు. భవిష్యత్తులో కూడా ప్రజలకు అవసరమైన సేవా కార్యక్రమాలు కొనసాగిస్తామని పేర్కొన్నారు. గ్రామ సర్పంచ్ అశోక్ మాట్లాడుతూ... ప్రముఖ పరిశ్రమిక వేత్త, కాంగ్రెస్ నాయకుడు ప్రసాద్ రెడ్డి సేవలు అభినందనీయమని అన్నారు. గ్రామ ప్రజలకు తాగునీటి సమస్య ఉందని ఆయన దృష్టికి తీసుకెళ్లిన కొద్ది గంటల్లోనే స్పందించి రెండు బోర్‌వెల్స్ మంజూరు చేయడం గొప్ప వి షయమని పేర్కొన్నారు. గ్రామ ప్రజల తరఫున ప్రసాద్ రెడ్డికి కృతజ్ఞతలు తెలియజేస్తున్నామని తెలిపారు. రాబోయే రోజుల్లో గ్రామ అభివృద్ధికి ఆయన సేవలను మరింతగా వినియోగించుకుం టామని అన్నారు. ఈ కార్యక్రమంలో వెంకటా పూర్ గ్రామ కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

# సకాలంలో రైతులకు ఎరువులు, విత్తనాలు అందించేందుకు ప్రణాళికలు

- సొసైటీ పరిధిలోని రైతులకు విస్తృత సేవలు అందించడమే తమ ధ్యేయం...
- చైర్మన్ గా బాధ్యతలు స్వీకరించిన స్రవంతి రెడ్డి కి బిఅర్ఎస్ శ్రేణుల ఘన సన్మానం....

జహీరాబాద్ వెలుతురు మే 08:





గత రెండు రోజుల క్రితం తెలంగాణా రాష్ట్ర హైకోర్టు యధావిధిగా ప్రస్తుతం ఉన్న చైర్మ న్లు, సభ్యులను కొనసాగించాలని ఆదేశాలు జారీ చెయ్యడంతో రాష్ట్ర ప్రభుత్వం వారినే మరోసారి బాధ్యతలు అప్పగించాలని ఆదే శించడంతో మొన్నటి వరకు పిచరేగాడి సహకార బ్యాంక్ చైర్మన్ గా ఉన్న స్రవంతి అరవింద్ రెడ్డి శుక్రవారం నాడు సొసైటీ బ్యాంక్ లో బాధ్యతలు స్వీకరించారు. అనంతరం చైర్మన్ మాట్లాడుతూ సొసైటీ పరిధిలోని రైతులకు విస్తృతమైన సేవలు అందించడమే తమ ధ్యేయం అని, రా ష్ట్రంలోనే పిచారేగాడి సహకార సొసైటీని ఆదర్శంగా తీర్చిదిద్దుతామని, వానాకాలం నాటికి రైతులకు విత్తనాలు, ఎరువులు అం దించేందుకు ప్రభుత్వానికి రైతుల తరపున నివేదించి సకాలంలో అందేవిధంగా చూ స్తామని అన్నారు. బాధ్యతలు స్వీకరించిన అనంతరం పార్టీ శ్రేణులు గజమాలతో సత్కరించి శాలువాలు కప్పి ఘనంగా సన్మా నించారు. కార్యక్రమంలో పిచరేగాడి గ్రామ సర్పంచ్ విరరెడ్డి, కోహిర్ మండల మాజీ బిఅర్ఎస్ అధ్యక్షులు నర్సింలు యాదవ్, మాజీ మార్కెట్ చైర్మన్ రామకృష్ణ రెడ్డి, మాజీ సర్పంచుల ఫోరమ్ అధ్యక్షులు జంగిలి రవికిరణ్, కొత్తూరు (పట్టి దిగ్వాల్) సర్పంచ్ ప్రభు పటేల్, యువ నాయకులు సాయిప్రణీ త్ రెడ్డి, ఖానాపూర్ రాములు, సొసైటీ కర్య దర్శి ప్రశాంత్, నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# బెంగాల్ గెలుపుతో దేశంలో తిరుగులేని శక్తిగా బిజెపి..

- తెలంగాణ అభివృద్ధి బిజెపితోనే సాధ్యం...
- 10 న హైదరాబాద్ పరేడ్ గ్రౌండ్లోబిజరిగే ప్రధాని మోదీ సభను జయప్రదం చేయండి..
- బిజెపి జిల్లా అధికార ప్రతినిధి బొంతల కళ్యాణ్ చంద్ర....

కరీంనగర్ వెలుతురు మే 08:



పశ్చిమబెంగాల్ ఎన్నికల్లో బిజెపి విజయం చారిత్రకమని , బెంగాల్ ఎన్నికల ఫలితాల కోసం దేశంతో పాటు ప్రపంచమే ఉత్కంఠత తో ఎదురు చూసిందని, బెంగాల్లో బిజెపి భారీ విజయంతో దేశంలోనే తిరుగులేని శక్తిగా భారతీయ జనతా పార్టీ అవతరించిందని బిజెపి జిల్లా అధికార ప్రతినిధి బొంతల కళ్యాణ్ చంద్ర అన్నారు. శుక్రవారం కరీంనగర్లో ఆయన మాట్లాడుతూ ఇటీవల జరిగిన నాలుగు రాష్ట్రా లు, యూటి ఎన్నికల్లో బిజెపి, ప్రధాని మోదీ పట్ల ఉన్న నమ్మకం, విశ్వాసం తోనే స్పష్టమైన ఫలితాలు వచ్చాయన్నారు. ముఖ్యంగా అస్సాం, పుదుచ్చేరిలో హ్యాట్రిక్ విజయం సాధించడం, పశ్చిమబెంగాల్లో చారిత్రక విజయాన్ని అందు కోవడం, కేరళలో మూడు సీట్లు గెలుచుకోవడం , ఆయా రాష్ట్రాల్లోబిజెపికి ఓటింగ్ శాతం గణనీ యంగా పెరగడం హర్షనీయమన్నారు. ప్రధాని మోదీపాలనే దేశానికి రక్ష అనే భావన ప్రజలంద రిలో ఉందని , అందుకే దేశవ్యాప్తంగా ఏ ఎన్నిక జరిగిన బిజెపికి ప్రజలు బ్రహ్మరథం పడుతున్నా రని తెలిపారు. ముఖ్యంగా ఎన్నో దశాబ్దాలుగా పశ్చిమబెంగాల్ దుర్మార్గపు పార్టీల చేతుల్లో , అధికారంలో బంధి అయ్యిందని , నేడు ఆ పార్టీల కబంధహస్తాల నుండి పశ్చిమబెంగా ల్ కు విముక్తి లభించి , బిజెపి అధికారంలోకి రావడంతో ప్రజలంతా సంబరాలు చేసుకుం టున్నారన్నారు. పశ్చిమబెంగాల్లో అధర్మం అంతమై ధర్మం గెలిచిందన్నారు. తెలంగాణలో 10 పదేళ్లు బిఆర్ఎస్ అరాచక, దుర్మార్గ పాలన కొనసాగిందని, నేటి కాంగ్రెస్ ప్రభుత్వం కూడా అదే బాటలో కొనసాగుతుందని ఘాటుగా వి మర్శించారు. తెలంగాణ రాష్ట్ర అభివృద్ధి కంటే స్వప్రయోజనాలే ముఖ్యంగా గత బి ఆర్ ఎస్, నేటి కాంగ్రెస్ ప్రభుత్వాలు పనిచేశాయన్నారు. తెలంగాణ అభివృద్ధికి బిజెపి కట్టుబడి పనిచే స్తుందన్నారు. బి ఆర్ ఎస్ ప్రభుత్వ హయాంలో, నేడు కాంగ్రెస్ ప్రభుత్వం లో తెలంగాణ అభివృద్ధి కోసం లక్షల కోట్ల రూపాయలను ఖర్చు చేస్తుంద న్నారు. 10న ప్రధాని మోదీ తెలంగాణపర్యటన సందర్భంగా రాష్ట్రంలో రూ. 7823 కోట్లతో చేపట్టనున్న వివిధ అభివృద్ధి పనులకు శం కుస్థాపన చేయనున్నారని ఆయన తెలిపారు. తెలంగాణ అభివృద్ధి, దిశా, దశ మార్పు బిజెపి, ప్రధాని మోదీ తోనే సాధ్యమన్నారు. పరేడ్ గ్రౌండ్లో జరిగే ప్రధాని మోదీ సభ తెలంగాణ రాజకీయ ముఖచిత్రం మారబోతుందన్నారు. మూడోసారి ప్రధానమంత్రిగా మోదీ బాధ్యతలు చేపట్టిన అనంతరం అభివృద్ధి కార్యక్రమాల ప్రా రంభోత్సవాల కోసం మొట్టమొదటిసారిగా హై దరాబాద్ పర్యటనకు విచ్చేస్తున్న నేపథ్యంలో, అనంతరం పరేడ్ గ్రౌండ్ నిర్వహించనున్న జనా గ్రహ సభను జయ ప్రదం చేయడానికి బిజెపి శ్రేణులు, ప్రజలు భారీ ఎత్తున తరలిరావాలని ఆయన సందర్భంగా విజ్ఞప్తి చేశారు.

# రిటైర్డ్ ఐపీఎస్ భార్య హత్య కేసులో సంచలనం

- ఇంట్లో పనిచేసే పనిమనిషిదే కీలక పాత్ర
- నిందితుల కోసం ప్రత్యేక బృందాలు గాలింపు



**హైదరాబాద్ వెలుతురు మే 08:**

హైదరాబాద్‌లోని జూబ్లీహిల్స్ ప్రశాసన్‌నగర్‌లో దారుణ ఘటన చోటుచేసుకుంది.. ఐఏఎస్ ఐపీఎస్ అధికారుల నివాస స్థలాల్లో హత్య జరగడం సంచలనంగా మారింది.. నిత్యం కట్టుదిట్టమైన భద్రత ఉన్న ప్రశాసనగర్ లోనే ఈ హత్య జరగడం సంచలనం సృష్టించింది. విశ్రాంత ఐపీఎస్ అధికారి వినయ్ రంజన్ రే సతీమణి సునంద హత్యకు గురైన సంఘటన నగరాన్ని కలవరపరిచింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం, వినయ్ రంజన్ నివాసంలో పనిచేస్తున్న నేపాల్‌కు చెందిన పనిమనిషి కల్పన ఈ హత్యలో కీలక పాత్ర పోషించినట్లు ప్రాథమికంగా గుర్తించారు. హత్యకు ముందు ఇద్దరు వ్యక్తులు ఇంటికి వచ్చినట్లు కల్పన పోలీసులకు చెప్పినట్లు సమాచారం. పోలీసుల అనుమానం ప్రకారం, కల్పన మరో ఇద్దరితో కలిసి ముందస్తు ప్రణాళికతో ఈ హత్యకు పాల్పడినట్లు తెలుస్తోంది. సునందను హత్య చేసిన అనంతరం ఇంట్లోని బంగారం, నగదును బ్యాగుల్లో తీసుకుని ముగ్గురు పరారైనట్లు పోలీసులు భావిస్తున్నారు. ఘటనా స్థలానికి ఉన్నతాధికారులు చేరుకుని పరిశీలించారు. కేసును అత్యంత ప్రాధాన్యంగా తీసుకున్న పోలీసులు నిందితుల కోసం ప్రత్యేక బృందాలతో గాలింపు చేపట్టారు. ఈ ఘటనపై మరిన్ని వివరాలు వెలుగులోకి రావాల్సి ఉంది.

# కిడ్నీ బాధితులకు 'కూటమి' సర్కార్ భరోసా

- ఏపీలో కొత్తగా 12 డయాలసిస్ కేంద్రాలు
- రోగులకు ఉచితంగా రక్త శుద్ధి సేవలు
- మొత్తం 73 కేంద్రాలకు చేరనున్న సేవలు
- ఐదేళ్ల కాలానికి రూ.30 కోట్ల నిధులు




**విజయవాడ వెలుతురు మే 08:**

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని కిడ్నీ బాధితులకు మెరుగైన వైద్య సేవలు అందించడమే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం మరో కీలక నిర్ణయం తీసుకుంది. రాష్ట్రవ్యాప్తంగా కొత్తగా 12 డయాలసిస్ కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నట్లు వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ ప్రకటించారు. ఇప్పటికే ఉన్న కేంద్రాలకు అదనంగా వీటిని అందుబాటులోకి తీసుకురావడం ద్వారా దూర ప్రాంతాలకు వెళ్లలేక ఇబ్బంది పడుతున్న రోగులకు పెద్ద ఉపశమనం కలగనుంది. ప్రైవేట్ ఆసుపత్రుల్లో వేల రూపాయలు ఖర్చయ్యే ఈ సేవలను ప్రభుత్వం ఉచితంగా అందించనుంది.

**ఉచిత సేవలు - ఆర్థిక భారం నుంచి విముక్తి**

సాధారణంగా కిడ్నీ రోగులకు నెలకు నాలుగు నుండి ఐదు సార్లు రక్త శుద్ధి (డయాలసిస్) అవసరమవుతుంది. ప్రైవేట్ లేదా కార్పొరేట్ ఆసుపత్రుల్లో ఒక్కో సెషన్‌కు కనీసం రూ. 3,000 నుండి రూ. 4,000 వరకు ఖర్చవుతుంది. అంటే నెలకు ఒక రోగి సుమారు రూ. 20 వేల వరకు వెచ్చించాల్సి వస్తోంది. పేద, మధ్యతరగతి కుటుంబాలకు ఇది మోయలేని భారం. ఈ ఇబ్బందులను దృష్టిలో పెట్టుకున్న కూటమి ప్రభుత్వం, ప్రజారోగ్యానికి ప్రాధాన్యత ఇస్తూ ఈ 12 కేంద్రాలను మంజూరు చేసింది. ఈ కేంద్రాల నిర్వహణ బాధ్యతలను టెండర్ ద్వారా ఎంపిక చేసిన సంస్థలకు అప్పగిస్తారని, మూడు నెలల్లోగా ఇవి పూర్తిస్థాయిలో అందుబాటులోకి వస్తాయని మంత్రి సత్యకుమార్ యాదవ్ వివరించారు.

ఎక్కడెక్కడ ఏర్పాటు కానున్నాయి? నూతనంగా ఏర్పాటు చేయబోయే కేంద్రాలు వ్యూహాత్మకంగా వివిధ జిల్లాల్లోని ప్రాంతీయ మరియు సామాజిక ఆసుపత్రుల్లో రానున్నాయి. ఏరియా ఆసుపత్రులు: భీమవరం (పశ్చిమ గోదావరి), పీలేరు (చిత్తూరు), జమ్మలమడుగు (వైఎస్ఆర్ కడప). సామాజిక ఆరోగ్య కేంద్రాలు: వెంకటగిరి (నెల్లూరు), అద్దంకి (ప్రకాశం), సున్నిపెంట (నంద్యాల), రైల్వే కోడూరు (తిరుపతి), కొండేపి (ప్రకాశం), కోవూరు (తూర్పుగోదావరి), మైదుకూరు (కడప), నందిగామ (ఎన్టీఆర్ జిల్లా), వినుకొండ (పల్నాడు). ప్రతి కేంద్రంలో రూ. 85 లక్షల వ్యయంతో 5 డయాలసిస్ యంత్రాలను మరియు అవసరమైన వైద్య పరికరాలను ప్రభుత్వం సమకూర్చుతోంది. దీనివల్ల సుమారు 1,500 మంది అదనపు రోగులకు ప్రయోజనం కలగనుంది.

**ప్రజా సంక్షేమానికి పెద్దపీట**

గత ప్రభుత్వ పాలనతో పోలిస్తే కూటమి ప్రభుత్వం ఆరోగ్య రంగంలో వేగంగా అడుగులు వేస్తోందని మంత్రి పేర్కొన్నారు. గత ఐదేళ్లలో 19 కేంద్రాలు ఏర్పాటు కాగా, ప్రస్తుత ప్రభుత్వం వచ్చిన కొద్ది కాలంలోనే 12 కేంద్రాలను పూర్తి చేసి, ఇప్పుడు మరో 12 కేంద్రాలకు శ్రీకారం చుట్టిందని తెలిపారు. అంటే 23 నెలల కాల పరిమితిలో 24 కేంద్రాలను ఏర్పాటు చేయడం రోగుల పట్ల ప్రభుత్వానికి ఉన్న అంకితభావానికి నిదర్శనమని ఆయన అన్నారు. ఇవి కాకుండా ఎన్టీఆర్ వైద్యసేవ ట్రస్ట్ కింద 186 అనుబంధ ఆసుపత్రుల్లో కూడా ఉచిత డయాలసిస్ సేవలు అందుతున్నాయి. మొత్తం మీద కిడ్నీ బాధితుల కోసం ప్రభుత్వం ఏటా రూ. 165 కోట్లు ఖర్చు చేస్తూ, పేదలకు ప్రాణదానం చేస్తోంది. ఈ నిర్ణయం పట్ల రాష్ట్రవ్యాప్తంగా ఉన్న కిడ్నీ బాధితులు మరియు వారి కుటుంబ సభ్యులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

# శ్రీవారి భక్తులకు టీటీడీ విస్తృత వసతి సదుపాయాలు





**వెలుతురు, మే 8 (వెలుతురు):** శ్రీవారి దర్శనానికి తిరుమలకు వచ్చే లక్షలాది మంది భక్తుల కోసం విస్తృత వసతి, విశ్రాంతి సదుపాయాలు కల్పిస్తున్నట్లు తిరుమల తిరుపతి దేవస్థానం వెల్లడించింది. భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని వసతి గదులతో పాటు యాత్రికుల వసతి సముదాయాలు, ఉచిత లాకర్లు, స్నాన సదుపాయాలు, అన్నప్రసాద కేంద్రాలు, తలనీలాల సమర్పణ కేంద్రాలను అందుబాటులో ఉంచినట్లు తెలిపింది. తిరుమల, తిరుపతిలో భక్తుల ఆచారాలు, సంప్రదాయాలను పరిగణనలోకి తీసుకుని ప్రత్యేక ఏర్పాట్లు చేసినట్లు తితిదే అధికారులు వివరించారు. ముఖ్యంగా కుటుంబ సమేతంగా వచ్చే భక్తులకు ప్రాధాన్యతనిస్తూ వసతి గదులను కేటాయిస్తున్నట్లు పేర్కొన్నారు. స్థలాభావం కారణంగా ప్రస్తుతం తిరుమలలో 7,800 వసతి గదులు మాత్రమే అందుబాటులో ఉన్నాయని తెలిపారు. ఒంటరి వ్యక్తులు, అవివాహిత స్త్రీ, పురుష జంటలకు గదుల కేటాయింపు ఉండదని స్పష్టం చేశారు. వసతి గదులు పొందాలనుకునే భక్తులు సీఆర్వో జనరల్ కౌంటర్‌లో ఆధార్ కార్డు, ఫోన్ నంబరు తదితర వివరాలు నమోదు చేసుకోవాలని సూచించారు. అనంతరం గది నంబరు, సంబంధిత ప్రాంత వివరాలను ఎస్ఎంఎస్ ద్వారా భక్తులకు పంపిస్తారని తెలిపారు. ఆ తర్వాత సంబంధిత ఉప విచారణ కార్యాలయంలో యూపీఐ లేదా కార్డు ద్వారా చెల్లింపులు చేసి గదులను పొందవచ్చని వివరించారు. వసతి గదులు లభించని భక్తుల కోసం తిరుమలలో ఐదు యాత్రికుల వసతి సముదాయాలను అందుబాటులో ఉంచినట్లు తితిదే వెల్లడించింది. ఈ సముదాయాల్లో ఆధార్, ఫోన్ నంబరు నమోదు చేసుకుని భక్తులు ఉచిత లాకర్లు, విశ్రాంతి, స్నాన సదుపాయాలను వినియోగించుకోవచ్చని తెలిపింది. సీఆర్వో సమీపంలోని గోవర్ధన సత్రం ఎదురుగా ఉన్న పీఏసీ1లో నాలుగు హాళ్లు, 1,256 లాకర్లు ఉన్నాయి. ప్రస్తుతం పునరుద్ధరణ పనుల కారణంగా 870 లాకర్లు మాత్రమే అందుబాటులో ఉన్నాయని అధికారులు తెలిపారు. ఇక్కడ అన్నప్రసాద సదుపాయం కల్పిస్తున్నారు. బాలాజీ బస్టాండ్ ఎదురుగా ఉన్న పీఏసీ2 మాధవ నిలయంలో 12 హాళ్లు, 3,300 లాకర్లు ఏర్పాటు చేశారు. భక్తులకు అన్నప్రసాదం, తలనీలాల సమర్పణ, ప్రథమ చికిత్స కేంద్రం, విశ్రాంతి సదుపాయాలు అందుబాటులో ఉన్నాయి. జీఎన్సీ టోల్‌గేట్ నుంచి రాంభగీచా బస్టాండ్‌కు వెళ్లే ఔటర్ రింగ్ రోడ్డులోని పీఏసీ3లో తొమ్మిది హాళ్లు, 1,420 లాకర్లు ఉన్నాయి. ఇక్కడ తలనీలాల సమర్పణతో పాటు విశ్రాంతి సదుపాయాలు కల్పించారు. బాలాజీ బస్టాండ్ ఆవరణలో ఏర్పాటు చేసిన పద్మనాభ నిలయంలో మూడు హాళ్లు, 960 లాకర్లు అందుబాటులో ఉన్నాయి. భక్తులకు లాకర్, స్నానం, విశ్రాంతి సదుపాయాలు కల్పిస్తున్నారు. భక్తుల కోసం ఆధునిక సదుపాయాలతో నిర్మించిన పీఏసీ5 వేంకటాద్రి నిలయాన్ని 2025 సెప్టెంబర్ 25న ఉప రాష్ట్రపతి సి పి రాధాకృష్ణన్ , సీఎం ఎన్.చంద్రబాబు నాయుడు ప్రారంభించారు. సీఆర్వో వెనుక భాగంలో ఉన్న ఈ సముదాయంలో 16 హాళ్లు, 2,400 లాకర్లు ఉన్నాయి. అన్నప్రసాదం, తలనీలాల సమర్పణ, ప్రథమ చికిత్స, విశ్రాంతి సదుపాయాలు కల్పించారు. తిరుమలలోని ఐదు యాత్రికుల సముదాయాల్లో మొత్తం 9,336 ఉచిత లాకర్లు భక్తులకు అందుబాటులో ఉన్నాయని తితిదే వెల్లడించింది. భక్తులు తమ విలువైన వస్తువులను భద్రంగా భద్రపరచుకోవడానికి వీటిని వినియోగించుకోవచ్చని సూచించింది. అదనంగా ఉచిత వేడి నీటి స్నాన గదులు, మరుగుదొడ్లు, చాపలు, రగ్గులు, అన్నప్రసాద కేంద్రాలు, తలనీలాల సమర్పణ కేంద్రాలు, ప్రథమ చికిత్స సేవలను ఏర్పాటు చేసినట్లు తెలిపింది. దర్శనం అనంతరం భక్తులు లాకర్లు ఖాళీ చేసి, తీసుకున్న చాపలు, రగ్గులను తిరిగి అప్పగించాలని కోరింది. శ్రీవారి దర్శనాన్ని భక్తులు సుఖసంతోషాలతో పూర్తి చేసుకోవాలని తితిదే విజ్ఞప్తి చేసింది.

# రాష్ట్రంలో శాంతిభద్రతలు పూర్తిగా క్షీణించాయి

- రాజకీయ వేధింపులు ఆపి, పోలీసింగ్ వ్యవస్థను బలోపేతం చేయాలి
- రిటైర్డ్ ఐపీఎస్ అధికారి భార్య హత్యకు గురికావడం దారుణం
- సామాన్య పౌరుల్లో పెరుగుతున్న అభద్రతా భావానికి అద్దం పడుతోంది
- ప్రభుత్వ తీరుపై మండిపడ్డ కేటీఆర్



**హైదరాబాద్ వెలుతురు మే 08:**

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ పాలనలో తెలంగాణలో శాంతిభద్రతలు ప్రమాదకర స్థాయికి పడిపోయాయని భారత్ రాష్ట్ర సమితి వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్రంగా ఖండించారు.రాష్ట్రవ్యాప్తంగా వరుసగా జరుగుతున్న ఘోరమైన నేరాల పట్ల కేటీఆర్ తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. ఈమేరకు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోలీస్ యంత్రాంగం మొత్తాన్ని రాజకీయ కక్షసాధింపులు, ప్రతిపక్ష నాయకులను వేధించడం కోసమే మళ్లించడం వల్లే.. ప్రజల రక్షణ, భద్రత గాలిలో కలిసిపోయిందని ఆయన విమర్శించారు. ఈ మేరకు రాష్ట్రంలోని పరిస్థితుల పైన సోషల్ మీడియా మాధ్యమం ఎక్స్ లో పోస్ట్ చేశారు. శాంతిభద్రతల క్షీణతపై బీఆర్ఎస్ ప్రతినిధి బృందం డీజీపీని కలిసి ఫిర్యాదు చేస్తున్న సమయంలోనే.. అత్యంత కట్టుదిట్టమైన భద్రత ఉండే హైదరాబాద్‌లోని ప్రశాసన్ నగర్‌లో రిటైర్డ్ డీజీ ర్యాంక్ ఐపీఎస్ అధికారి వినయ్ రంజన్ రాయ్ భార్య అత్యంత దారుణంగా హత్యకు గురైన వార్త రావడం దిగ్భ్రాంతికరమని కేటీఆర్ పేర్కొన్నారు. అంతేకాకుండా, గురువారం రాత్రి సికింద్రాబాద్‌లో నడిరోడ్డుపై ఒక యువకుడిని అతి దారుణంగా కత్తితో పొడిచి చంపిన ఘటన నగరాన్ని ఉలిక్కిపడేలా చేసిందని, ఇది సామాన్య పౌరుల్లో పెరుగుతున్న అభద్రతా భావానికి అద్దం పడుతోందని ఆయన అన్నారు. నేరాల నివారణ, ప్రజా భద్రతపై దృష్టి పెట్టాల్సిన పోలీస్, ఇంటెలిజెన్స్ వ్యవస్థలను.. కాంగ్రెస్ ప్రభుత్వం బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు మరియు ప్రభుత్వ తీరును విమర్శించే సోషల్ మీడియా గొంతులపై అక్రమ కేసులు బనాయించేందుకు వాడుకుంటోందని కేటీఆర్ ఆరోపించారు."పోలీస్ వ్యవస్థను రాజకీయ కక్షసాధింపు చర్యలకు వాడుకోవడం వల్లనే శాంతిభద్రతలు కుప్పకూలాయని " అని కేటీఆర్ స్పష్టం చేశారు. తెలంగాణలో మహిళలపై జరుగుతున్న నేరాలు, సైబర్ నేరాలు భారీగా పెరిగినట్లు తాజా ఎన్‌సీఆర్‌బీ (NCRB) నివేదికలు చెబుతున్నాయని, ఇది ప్రస్తుత ప్రభుత్వ పాలనా వైఫల్యానికి నిదర్శనమని ఆయన గుర్తుచేశారు. హోం శాఖను కూడా తన వద్దే ఉంచుకున్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి.. ప్రజల ఆస్తిపాస్తులను, ప్రాణాలను రక్షించడంలోనూ, శాంతిభద్రతలను కాపాడటంలోనూ ఘోరంగా విఫలమయ్యారని కేటీఆర్ విమర్శించారు. రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే రాజకీయ వేధింపులు ఆపి, పోలీసింగ్ వ్యవస్థను బలోపేతం చేయాలని, ప్రజల్లో భరోసా కల్పించేలా వృత్తిపరంగా వ్యవహరించాలని ఆయన డిమాండ్ చేశారు.

# ఏపీ ఈసెట్ ఫలితాలు విడుదల

- 'ఎక్స్' వేదికగా ఫలితాలు ప్రకటించిన లోకేశ్
- బీటెక్ ద్వితీయ సంవత్సర ప్రవేశాలకు కీలకమైన ఈసెట్
- ఏప్రిల్ 23న రాష్ట్రవ్యాప్తంగా నిర్వహించిన పరీక్ష
- 32,434 మంది విద్యార్థులు పరీక్షకు హాజరు
- 29,750 మంది అభ్యర్థులు అర్హత సాధింపు
- మొత్తం ఉత్తీర్ణత శాతం



**91.27గా నమోదు**

**విజయవాడ , మే 8(వెలుతురు):**

పాలిటెక్నిక్ డిప్లొమా పూర్తిచేసిన విద్యార్థులు బీటెక్ ద్వితీయ సంవత్సరంలో ప్రవేశాల కోసం రాసిన ఏపీ ఈసెట్ 2026 ఫలితాలను విడుదల చేశారు. నారా లోకేశ్ 'ఎక్స్' వేదికగా ఫలితాలను ప్రకటించారు. పరీక్షలో అర్హత సాధించిన విద్యార్థులకు మంత్రి శుభాకాంక్షలు తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా ఏప్రిల్ 23న నిర్వహించిన ఈ పరీక్షకు మొత్తం 32,434 మంది విద్యార్థులు హాజరయ్యారు. వీరిలో 29,750 మంది అర్హత సాధించగా.. మొత్తం ఉత్తీర్ణత శాతం 91.27గా నమోదైంది.

పాలిటెక్నిక్ డిప్లొమా పూర్తి చేసిన విద్యార్థులకు ఇంజినీరింగ్‌లో లేటరల్ ఎంట్రీ ద్వారా బీటెక్ రెండో సంవత్సరంలో ప్రవేశం కల్పించేందుకు ఈసెట్‌ను నిర్వహిస్తారు. ర్యాంకుల ఆధారంగా ప్రభుత్వ, ప్రైవేట్ ఇంజినీరింగ్ కళాశాలల్లో సీట్లు కేటాయించనున్నారు. ఫలితాల అనంతరం త్వరలో కౌన్సెలింగ్ షెడ్యూల్‌ను అధికారులు విడుదల చేసే అవకాశం ఉంది. విద్యార్థులు అధికారిక వెబ్‌సైట్‌లో తమ ర్యాంకులు, మార్కులు పరిశీలించుకోవచ్చని అధికారులు తెలిపారు.

# మైనారిటీల సంక్షేమానికి కట్టుబడి ఉన్నాం




- యువతకు నైపుణ్య శిక్షణపై దృష్టి
- ఆటో డ్రైవర్లకు ఈవీ రెట్రో ఫిట్టింగ్
- హజ్ యాత్రికులపై భారం పడనివ్వం
- మైనారిటీల సంక్షేమం, ఉపాధి, హజ్ సబ్సిడీలపై సీఎం కీలక ప్రకటనలు

**హైదరాబాద్ వెలుతురు మే 08:**

ఉద్యోగాలు, సంక్షేమ పథకాలు, విదేశీ విద్యలో మైనారిటీలకు రావాల్సిన వాటాను అందిస్తున్నామని సీఎం రేవంత్ రెడ్డి వెల్లడించారు. విదేశీ విద్య కోసం స్కాలర్షిప్‌లు కూడా ఇస్తున్నామని తెలిపారు. సంక్షేమం, అభివృద్ధిలో మైనారిటీల భాగస్వామ్యాన్ని పెంచేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. హైదరాబాద్‌లోని హజ్ హౌస్‌లో శుక్రవారం హజ్ యాత్రికుల బస్సులను ముఖ్యమంత్రి జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడిన సీఎం, గత ఏడాది హజ్ యాత్రకు వెళ్లిన సమయంలో జరిగిన బస్సు ప్రమాదంలో 44 మంది మృతి చెందారని గుర్తుచేశారు. ప్రతి మృతుడి కుటుంబానికి రూ.5 లక్షల పరిహారం అందించి ప్రభుత్వం అండగా నిలిచిందన్నారు. ప్రస్తుతం ఇరాన్ ఇరాక్ యుద్ధ పరిస్థితులతో విమాన ఇంధన ధరలు పెరిగి ప్రయాణ ఛార్జీలు అధికమైనప్పటికీ, హజ్ యాత్రికులపై అదనపు భారం పడకుండా తెలంగాణ ప్రభుత్వమే భరిస్తోందని తెలిపారు.

**యువతకు నైపుణ్య శిక్షణపై దృష్టి**

ప్రస్తుతం వైట్ కాలర్ ఉద్యోగాల కంటే బ్లూ కాలర్ ఉద్యోగాలకు ప్రపంచవ్యాప్తంగా డిమాండ్ ఎక్కువగా ఉందని సీఎం పేర్కొన్నారు. అమెరికా కంటే జర్మనీ, జపాన్ వంటి దేశాల్లో ఉద్యోగ అవకాశాలు ఎక్కువగా ఉన్నాయని చెప్పారు. అందుకే ఐటీఐలను అడ్వాన్స్‌డ్ ట్రైనింగ్ సెంటర్లుగా అప్‌గ్రేడ్ చేసి యువతకు నైపుణ్య శిక్షణ అందిస్తున్నామని తెలిపారు.

**ఆటో డ్రైవర్లకు ఈవీ రెట్రో ఫిట్టింగ్**

హైదరాబాద్‌లో చాలామంది మైనారిటీ సోదరులు ఆటోలు నడుపుతూ జీవనం సాగిస్తున్నారని సీఎం అన్నారు. ఔటర్ రింగ్ రోడ్ పరిధిలో ఉన్న అన్ని ఆటోలకు ఉచితంగా రెట్రో ఫిట్టింగ్ చేసి ఈవీ ఆటోలుగా మార్చే నిర్ణయం తీసుకున్నామని వెల్లడించారు. దీంతో ఆటో డ్రైవర్లకు ఇంధన ఖర్చులు తగ్గి ఆదాయం పెరుగుతుందని చెప్పారు. "మా ప్రభుత్వానికి హిందూ ముస్లింలు అనే భేదాభిప్రాయం లేదు.హిందూ ముస్లిం భాయి భాయి.SIR పేరుతో తెలంగాణలో ఓట్లు తొలగించాలని చూస్తున్నారు.ఇతర రాష్ట్రాల్లో జరిగినట్లు మన రాష్ట్రంలో జరగనివ్వద్దు. మనందరం కలిసికట్టుగా దీనిని ఎదుర్కోవాలి. సంక్షేమం అభివృద్ధిలో మైనారిటీల వాటా వారికి అందిచేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉంది. అభివృద్ధిలో తెలంగాణను దేశంలోనే అగ్రస్థానంలో నిలపాలి. " అని సీఎం పేర్కొన్నారు

# యూరియా షాపుల్లో కాదు.. యాపుల్లో కనిపిస్తోంది



- కేటీఆర్‌పై కేసు నమోదు రాజకీయ కక్షసాధింపే
- హామీలు మరిచిపోయిన ప్రభుత్వం-రైతు సమస్యలపై ప్రభుత్వాన్ని ఎండగట్టిన బీఆర్ఎస్
- తెలంగాణ భవన్‌లో ఏనుగుల రాకేష్ రెడ్డి

**హైదరాబాద్, మే 8 (వెలుతురు):** విపత్తులు, ప్రమాదాలు సంభవించిన రాష్ట్రంలో రైతులకు అవసరమైన యూరియా సరఫరాలో ప్రభుత్వం విఫలమైందని బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు ఏనుగుల రాకేష్ రెడ్డి ధ్వజమెత్తారు. “కాంగ్రెస్ పాలనలో షాపుల్లో ఉండాల్సిన యూరియా ఇప్పుడు యాపుల్లోకి వచ్చింది” అంటూ ఎద్దేవాచేశారు. వడ్ల కొనుగోళ్లలో తీవ్ర నిర్లక్ష్యం కొనసాగుతోందని, ఎండలో రైతులు రోడ్లపై వడ్లు పోసుకుని పడిగాపులు కాస్తున్నారని అన్నారు.. హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్లో గురువారం నిర్వహించిన మీడియా సమావేశంలో రాష్ట్ర ప్రభుత్వంపై తీవ్ర స్థాయిలో విమర్శలు గుప్పించారు. కేటీఆర్‌పై వరంగల్‌లో కేసు నమోదు చేయడం, రైతుల సమస్యలు, పంట కొనుగోళ్లలో జాప్యం, అకాల వర్షాలతో రైతులు ఎదుర్కొంటున్న ఇబ్బందులపై కాంగ్రెస్ ప్రభుత్వాన్ని లక్ష్యంగా చేసుకుని వ్యాఖ్యలు చేశారు.

కేటీఆర్‌పై కేసు నమోదు రాజకీయ కక్ష సాధింపే

ఐకేపీ కేంద్రాల్లో ఉన్న ధాన్యాన్ని కొనుగోలు చేయకుండా ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తోందని ప్రశ్నించిన బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ K. T. Rama Raoపై అక్రమ కేసులు నమోదు చేశారని ఆరోపించారు. తెలంగాణ ఉద్యమంలో తుపాకీ తూటాలకు ఎదురొడ్డిన కేసీఆర్ తనయుడు కేటీఆర్ రైతుల కోసం జైలుకు వెళ్లడానికైనా సిద్ధంగా ఉంటారని పేర్కొన్నారు.

హామీలు మరిచిపోయిన ప్రభుత్వం

ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విస్మరించిందని రాకేష్ రెడ్డి విమర్శించారు. సీఎం రేవంత్ రెడ్డి పై తీవ్ర వ్యాఖ్యలు చేస్తూ.. రైతుల సమస్యలను పట్టించుకోకుండా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. మక్క రైతులకు గిట్టుబాటు ధర కల్పించడంలోనూ ప్రభుత్వం విఫలమైందన్నారు.

---

# ప్రజా పక్షపాతిగా మూసీ పునరుజ్జీవనం

- ప్రజల భాగస్వామ్యంతోనే నదికి కొత్త కళ!

**హైదరాబాద్, మే 8 (వెలుతురు):**



తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్ఠాత్మక లక్ష్యంతో చేపట్టిన మూసీ నది పునరుజ్జీవన ప్రాజెక్టు కేవలం ఒక నది ప్రక్షాళన మాత్రమే కాదు, అది ఒక సామాజిక బాధ్యత అని కేబినెట్ సబ్ కమిటీ స్పష్టం చేసింది. అభివృద్ధి అంటే మనుషులను దూరం చేయడం కాదు, వారిని భాగస్వాములను చేయడమేనని చాటి చెబుతూ అధికారులకు కీలక మార్గదర్శకాలను జారీ చేసింది. ఈ ప్రాజెక్టును అత్యంత పారదర్శకంగా, ప్రజాస్వామ్య పద్ధతిలో ముందుకు తీసుకెళ్లాలని ప్రభుత్వం నిర్ణయించింది. ప్రజల్లో ఉన్న ప్రతి అనుమానాన్ని నివృత్తి చేసి, వారిలో పూర్తి స్థాయి విశ్వసనీయత కల్పించేలా అధికారుల కార్యాచరణ ఉండాలని సబ్ కమిటీ ఆదేశించింది. ప్రజల ప్రయోజనాలను కాపాడటమే ప్రభుత్వ ప్రథమ ప్రాధాన్యత అని కమిటీ నొక్కి చెప్పింది. ప్రజల ఆస్తులకు, నివాసాలకు కనీస నష్టం కూడా కలగకూడదన్న ఉద్దేశంతో ప్రభుత్వం మానవీయ కోణంలో ఆలోచిస్తోంది. ప్రాజెక్టు రూపకల్పనలో భాగంగా ఇప్పటికే ఉన్న నిర్మాణాలపై అతి తక్కువ ప్రభావం పడేలా ఆలైన్‌మెంట్‌ను మార్చుకోవాలని కమిటీ సూచించింది. అత్యంత జాగ్రత్తగా ప్రణాళికలు రూపొందించి, ప్రజలకు అసౌకర్యం కలగకుండా ప్రాజెక్టు పనులను ముందుకు తీసుకెళ్లాలని అధికారులను ఆదేశించింది. "మూసీ పునరుజ్జీవనం ద్వారా నగరం రూపురేఖలు మారడమే కాకుండా, పరివాహక ప్రాంత ప్రజల జీవన ప్రమాణాలు మెరుగుపడుతాయని, ప్రజల భాగస్వామ్యంతోనే ఈ అద్భుత ప్రాజెక్టు సాకారం అవుతుందని, "అభివృద్ధి ప్రజా హితం" రెండూ సమాంతరంగా సాగాలని కేబినెట్ సబ్ కమిటి అధికారులకు దిశ నిర్దేశం చేసింది. ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క అధ్యక్షతన జరిగిన మూసీ పునర్జీవం ప్రాజెక్టు క్యాబినెట్ సబ్ కమిటి సమావేశం శుక్రవారం ప్రజాభవన్ లో జరిగింది. మంత్రులు దుద్దిళ్ల శ్రీధర్ బాబు గారు, పొన్నం ప్రభాకర్ గారలతో కలిసి డిప్యూటి సీఎం ఉన్నత స్థాయి అధికారులతో సమీక్షించారు. ఈ సమావేశంలో ప్రాజెక్టు పురోగతి, నిధుల సమీకరణ, నిర్మాణ పనులకు సంబంధించిన క్యాలెండర్ పై కీలక నిర్ణయాలు తీసుకున్నారు.

మూసి పునర్జీవన ప్రాజెక్టు 5దశల్లో 55 కిలోమీటర్ల వరకు అభివృద్ధి పనులు చేపట్టడం జరుగుతుందని, దీనిలో భాగంగా ఫేజ్ 1 సుమారు ₹7,055 కోట్ల వ్యయంతో చేపట్టనున్న ఈ ప్రాజెక్టుకు ఆసియా అభివృద్ధి బ్యాంక్ (ADB) నుంచి నిధులు సమకూర్చుకునేందుకు సాంకేతిక, ఆర్థిక చర్చలు విజయవంతంగా ముగిశాయని అధికారులు మంత్రులకు వెల్లడించారు. ఫేజ్ 1లో భాగంగా హిమాయత్ సాగర్ నుంచి బాపుఘాట్, ఉస్మాన్ సాగార్ నుంచి బాపుఘాట్ 21 కిలోమీటర్ల మేరకు నిర్మాణ పనులను ఏటువంటి ప్రభావం లేని తొలి ఐదు కిలోమీటర్ల పనులను వెంటనే ప్రారంభించాలని మంత్రులు అదేశించారు.

మూసీ పునర్జీవనంలో భాగంగా నదిలో ఉన్న చెత్త చెదరాన్ని తొలగించి, పరిశుభ్ర పర్చడం, హైడ్రాలజీ ప్రకారంగా రివర్ బెడ్ ప్రొఫైలింగ్ చేయడం, వరద నియంత్రణ కోసం రిటైనింగ్ వాల్స్ నిర్మాణం, నదికి రెండు వైపులా రోడ్ల నిర్మాణం, నదికి రెండు వైపులా ప్రధాన మురుగు నీటి కాలువల నిర్మాణాం, నాలాలు ఏర్పాటు, నీటి నిల్వ కోసం బ్యారేజీల నిర్మాణం, రివర్ ఫ్రంట్ అభివృద్ధి చేయడం జరుగుతుందని రూపొందించిన డిపిఆర్ ను మూసి ప్రాజెక్టు మేనేజింగ్ డైరెక్టర్ ఈ.వి నర్సింహ్మారెడ్డి మంత్రులకు వివరించారు. ఈస్ట్‌టువెస్ట్ కారిడార్ లో భాగంగా నార్సింగి - గౌరెల్లి వరకు 55 కిలోమీటర్ల మేర ఎలివేటేడ్ కారిడార్ నిర్మాణం చేయనున్నామని, ఉప్పల్ భగాయత్ నుంచి గౌరెల్లి వరకు విస్తరణపై డిపిఆర్ తయారీ దశలో ఉందని పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. మీర్ ఆలం ట్యాంకు పురోగతి పనులను వివరించారు. గాంధి సరోవర్ ప్రాజెక్టు ఏర్పాటుకు కావాల్సిన భూమిని రక్షణ శాఖ నుంచి బదలాయింపు చేసుకునే అంశంపై చర్చించారు. పర్యావరణానికి సంబంధించిన అన్ని అనుమతులను తీసుకొని ప్రాజెక్టును ముందుకు తీసుకువెళ్లాలని డిప్యూటి సీఎం భట్టి విక్రమార్క అధికారులను అదేశించారు, మూసి ప్రాజెక్టు పునర్జీవనం వల్ల కలిగే ఉపయోగాల గురించి నగరంలో విస్తృతంగా ప్రచారం చేయాలని సూచించారు. బస్టాండ్లు, మెయిన్ రోడ్లు హోర్డింగ్స్ ఏర్పాటు చేయాల్సిందిగా ఆదేశించారు. సినిమా థియేటర్ లో కూడ వీడియోలను ప్రదర్శించే విధంగా తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు. ఆర్థిక, అనుమతులు, విభాగాల మధ్య సమన్వయం కోసం ప్రత్యేక కమిటీలను ఏర్పాటు చేయాలన్నారు. అన్ని ప్రభుత్వ విభాగాల అధికారులు సమన్వయంతో పనిచేస్తూ, ఎక్కడా జాప్యం లేకుండా ప్రాజెక్టును ముందుకు తీసుకెళ్లాలని ఆదేశించారు. రాజధాని అభివృద్ధిలో ఈ ప్రాజెక్టు ఒక మైలురాయిగా నిలుస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ ప్రాజెక్టు అమలుకు సంబంధించి ప్రభుత్వం స్పష్టమైన గడువును నిర్ణయించిందని వెల్లడించారు. అన్ని రకాల అనుమతులు, విధానపరమైన ప్రక్రియలు పూర్తి చేసుకుని 2026 ఆగస్టు నాటికి పనులు ప్రారంభించాడానికి లక్ష్యంగా పెట్టుకొవాలన్నారు. ఈ బృహత్తర ప్రాజెక్టును డిసెంబర్ 2027 నాటికి పూర్తి చేయాలన్నారు.. దీనికి సంబంధించిన పూర్తి క్యాలెండర్ ను సమర్పించాలని ఉప ముఖ్యమంత్రి అధికారులను ఆదేశించారు. టైంలైన్ నిర్దేశించుకొని స్పష్టమైన పురోగతి కనిపించే విధంగా పనుల నిర్మాణం జరుగాలని మంత్రి శ్రీధర్ బాబు అధికారులకు సూచించారు. ప్రజాభిప్రాయాలను పరిగణలోకి తీసుకొని ఎవరికి ఏలాంటి ఇబ్బంది కలుగకుండ నిర్మాణ పనులను సత్వరమే ప్రారంభించి ముందుకు తీసుకెళ్లాలని ఆదేశించారు. నిర్మాణ పనుల్లో సాంకేతికపరమైన అంశాలలో ఐఐటి మరియు జెఎన్ టియూ సంస్థల నుంచి తగిన సహకారం తీసుకోవాలని సూచించారు. మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ రానున్న వర్షకాలాన్ని దృష్టిలో ఉంచుకొని నిర్మాణ పనులకు ఎటువంటి ఆటంకాలు కలుగకుండ తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. నిర్మాణ పనుల్లో నాణ్యత ప్రమాణాలను తప్పని సరిగా పాటించే విధంగా నిరంతర పర్యవేక్షణ ఉండాలన్నారు.

**రబ్బర్ డ్యాం నమూనాల పరిశీలించిన మంత్రులు**

మూసీ పునర్జీవం ప్రాజెక్టులో టూరిజం అభివృద్ధిలో భాగాంగ నదిలో పలు చోట్ల చెక్ డ్యాంల తరహాలో రబ్బర్ డ్యాంలను ఏర్పాటు చేయనున్నారు. వీటి నిర్మాణాల వల్ల నీటి నిల్వను పెంచడం, జలక్రీడలు, మరియు బోటింగ్ సదుపాయాలకు ఉపయోగపడుతుంది. ఒబెర్ మేయర్ స్పిల్ వే గేట్ టెక్నాలజీ (Obermeyer Spill way Gate Technology) రూపొందించిన రబ్బర్ డ్యాం నమూనాను ప్రజా భవన్ లో మంత్రులు ఆసక్తిగా తిలకించారు. నాసిక్, ముంబాయి నగరాల్లో ఈ టెక్నాలజీ సంస్థ నిర్మాణం చేసిన రబ్బర్ డ్యాంలను పరిశీలించి తగిన అధ్యయనం చేసిన తరువాత నివేధిక ఇవ్వాలని అధికారులను మంత్రులు అదేశించారు. ఈ సమావేశంలో మెట్రోపాలిటన్ ఏరియా అభివృద్ధి శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జయేశ్ రంజన్, డిప్యూటి సీఎం సెక్రటరీ కృష్ణా భాస్కర్, వాటర్ బోర్డు ఎం.డి అశోక్ రెడ్డి, జాయింట్ మేనేజింగ్ డైరెక్టర్ గౌతమి, అడిషనల్ కలెక్టర్ చంద్రారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

---

# ఉమ్మడి జిల్లా కేంద్రాల్లో నైపుణ్య శిక్షణాభివృద్ధి కోర్సులతో డిగ్రీ కళాశాలలు...

- మంచి ఫలితాలు సాధించిన విద్యార్థులకు ప్రోత్సాహకాలు..
- మూసీ అభివృద్ధిలో గుడితో పాటు మసీద్, చర్చి, గురుద్వారాల నిర్మాణం
- మైనారిటీ సంక్షేమ శాఖ సమీక్షలో ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి

హైదరాబాద్ వెలుతురు మే 08:



మైనారిటీ విద్యార్థుల కోసం ఉమ్మడి జిల్లా కేంద్రాల్లో ప్రత్యేక డిగ్రీ కళాశాలలు ఏర్పాటు చేయాలని.. వాటిలో నైపుణాభివృద్ధి, ఏఐ శిక్షణకు ప్రాధాన్యమివ్వాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశించారు. సంప్రదాయ కోర్సులు కాకుండా వారి జీవనోపాధికి ఉపయోగపడే శిక్షణ ఇప్పించాలన్నారు. మైనారిటీ సంక్షేమ శాఖపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సచివాలయంలో శుక్రవారం సాయంత్రం సమీక్ష నిర్వహించారు. ప్రతిభావంతులైన బీసీ, ఎస్సీ, ఎస్టీ విద్యార్థులకు ఇస్తున్నట్లే మైనారిటీ విద్యార్థులకు ప్రోత్సాహకాలు అందించాలని,ఇందుకోసం ప్రత్యేకంగా ఒక కార్యక్రమం ఏర్పాటు చేయాలని సీఎం సూచించారు. గ్రూప్1, గ్రూప్2, గ్రూప్3కి ఎంపికైన మైనారిటీ అభ్యర్థుల్లో ఆసక్తి ఉన్న వారిని ఎంపిక చేసి మైనారిటీ సంక్షేమ శాఖలో బాధ్యతలు అప్పగించి... ఆ శాఖ పరిధిలో చేపట్టే అన్ని కార్యక్రమాలపై పూర్తి అవగాహన కలిగించేలా వారిని తీర్చిదిద్దాలని సీఎం ఆదేశించారు. విద్యార్థులకు ప్రోత్సాహకాలు అందించే కార్యక్రమానికి గ్రూప్స్‌కు ఎంపికైన వారిని, క్రీడాకారులను ఆహ్వానించి విద్యా, క్రీడల ప్రాధాన్యతను వారికి తెలియజేయాలని సూచించారు. ఇమామ్, మౌజమ్‌లకు ఇచ్చే గౌరవ పారితోషికాలను క్రమం తప్పకుండా విడుదల చేయాలని అధికారులను సీఎం ఆదేశించారు. మైనారిటీ పాఠశాలల్లో బోధనలో ఏఐకు ప్రాధాన్యమివ్వాలని సీఎం సూచించారు. భూ లభ్యత ఉన్న చోట ఖబరస్తాన్‌లకు స్థలాలను కేటాయిస్తామని సీఎం తెలిపారు. డీజిల్, పెట్రోల్ ఆటోలను ఎలక్ట్రిక్ ఇంజిన్లతో రీట్రోఫిట్టింగ్ చేయడం ద్వారా ఆటోడ్రైవర్లకు ఇంధన ఖర్చులు లేకుండా చేసి వారి జీవన ప్రమాణాలను మెరుగుపరిచే లక్ష్యంతో ఒక ప్రణాళిక రూపొందిస్తున్నామని సీఎం రేవంత్ రెడ్డి తెలిపారు. మూసీ రివర్ ఫ్రంట్‌లో భాగంగా గుడితో పాటు మసీద్, చర్చి, గురుద్వారా నిర్మాణాలు చేపట్టాలని అధికారులను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశించారు. ఆయా మతాలకు సంబంధించిన సంస్కృతుల అధ్యయనం, భారత దేశ విశిష్టతను, తెలంగాణలోని గంగా జమునా తెహ్‌జీబ్ ను తెలియజేసేలా ఆ కట్టడాలు ఉండాలని ముఖ్యమంత్రి అన్నారు. మన సంస్కృతులను అధ్యయనం చేసే గొప్ప అధ్యయన కేంద్రాలుగా అవి పరిఢవిల్లాలని సీఎం ఆకాంక్షించారు. సమీక్షలో రాష్ట్ర మైనారిటీ సంక్షేమ శాఖ మంత్రి మహ్మద్ అజారుద్దీన్, రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు (ఎస్సీ, ఎస్టీ, ఓబీసీ, మైనారిటీలు) మహ్మద్ షబ్బీర్ అలీ, టీజీఎంఆర్ఈఐఎస్ ప్రెసిడెంట్ మహ్మద్ ఫహీముద్దీన్ ఖురేషీ, ముఖ్యమంత్రి ఓఎస్డీ వేముల శ్రీనివాసులు, హజ్ కమిటీ ఛైర్మన్ సయ్యద్ గులామ్ అఫ్జల్ బియాబాని, వక్ఫ్ బోర్డు ఛైర్మన్ సయ్యద్ అజ్మతుల్లా హుస్సేనీ, రాష్ట్ర మైనారిటీ ఫైనాన్స్ కార్పొరేషన్ ఛైర్మన్ మహ్మద్ ఓబేదుల్లా కొత్వాల్, ఉర్దూ అకాడమీ ప్రెసిడెంట్ తాహెర్ బిన్ హందాన్, రాష్ట్ర క్రిస్టియన్ మైనారిటీ కార్పొరేషన్ ఛైర్మన్ దీపక్ జాన్ కొకడాన్, రాష్ట్ర మైనారిటీ సంక్షేమ శాఖ కార్యదర్శి షఫీఉల్లా తదితరులు పాల్గొన్నారు.

---

# నేపాలీ పనిమనుషులతో జర జాగ్రత్త : సీపీ సజ్జనార్ హెచ్చరిక

**హైదరాబాద్, మే 8 (వెలుతురు):**




నగర పోలీస్ కమిషనర్ సజ్జనార్ ప్రజలకు కీలక సూచనలు చేశారు. ముఖ్యంగా నేపాలీ పనిమనుషులను ఇంట్లో పెట్టుకునే వారు అత్యంత అప్రమత్తంగా ఉండాలని ఆయన హెచ్చరించారు. నేపాలీ గ్యాంగ్‌లు తరచుగా ఇలాంటి నేరాలకు పాల్పడుతుంటాయని, వారు ఇంట్లో నమ్మకంగా ఉంటూనే యజమానుల కదలికలపై నిఘా పెడతారని సీపీ తెలిపారు. సరైన అవకాశం దొరికినప్పుడు దొంగతనం లేదా హత్యలకు వెనుకాడరని హెచ్చరించారు. ఇంట్లో పనిమనుషులు ఏం చేస్తున్నారు? ఎవరితో మాట్లాడుతున్నారు? అనే విషయాలపై యజమానులు నిరంతరం నిఘా ఉంచాలని సూచించారు. నేపాలీ లేదా ఇతర ప్రాంతాల నుంచి వచ్చే పనిమనుషులను విధుల్లోకి తీసుకునే ముందు వారి ఆధార్ కార్డ్, ఫోటోలు, పూర్తి వివరాలను స్థానిక పోలీస్ స్టేషన్‌లో అందజేసి 'పోలీస్ వెరిఫికేషన్' చేయించుకోవాలని ఆయన కోరారు. కాగా.. రిటైర్డ్ ఉన్నతాధికారి ఇంట్లోనే ఇలాంటి ఘటన జరగడం సర్వత్రా చర్చనీయాంశమైంది.

---

# తెలంగాణ ఎకోసిస్టమ్‌కు నిదర్శనం స్కైరూట్

**హైదరాబాద్, మే 08 (వెలుతురు):**



టెస్కైరూట్ ఏరోస్పేస్ 1 బిలియన్ డాలర్ల విలువను చేరుకుందనే చారిత్రాత్మక ప్రకటన వెలువడిన నేపథ్యంలో, తెలంగాణ పారిశ్రామిక మరియు ఆవిష్కరణల విధానాలకు ఇది ఒక అద్భుతమైన నిదర్శనమని కే తారక రామారావు కొనియాడారు. భారతీయ స్పేస్‌టెక్ రంగంలో ఒక స్టార్టప్ "యూనికార్న్ క్లబ్"లో చేరడం ఇదే మొదటిసారి. గత దశాబ్ద కాలంగా హైదరాబాద్‌లో పకడ్బందీగా నిర్మించిన ప్రపంచ స్థాయి ఎకోసిస్టమ్ వల్లే ఈ ఘనత సాధ్యమైందని కేటీఆర్ పేర్కొన్నారు. "ఇది మన స్టార్టప్ ఎకోసిస్టమ్‌కు గర్వకారణమైన క్షణం. భారతీయ ప్రతిభకు, యువత అకాంక్షలకున్న అపరిమితమైన సామర్థ్యానికి ఇది ఒక గొప్ప నిదర్శనం,"అని కేటీఆర్ వ్యాఖ్యానించారు. టీహబ్ వంటి వేదికల ద్వారా డీప్‌టెక్ ఆవిష్కరణలను ప్రోత్సహించాలనే రాష్ట్ర ప్రభుత్వ దూరదృష్టి వల్లే, ఒక చిన్న ఆలోచనగా మొదలైన స్కైరూట్ ప్రయాణం నేడు అంతర్జాతీయ స్థాయికి చేరుకుందని ఆయన తెలిపారు. ప్రపంచంలోనే అతిపెద్ద ఆవిష్కరణల కేంద్రమైన టీహబ్‌లో ప్రారంభమైన తొలి స్టార్టప్‌లలో స్కైరూట్ ఏరోస్పేస్ ఒకటి. ఇంత తక్కువ సమయంలో ఈ అద్భుతమైన మైలురాయిని చేరుకోవడం, ప్రభుత్వ ప్రోత్సాహం ప్రైవేట్ సంస్థల వృద్ధిని ఎలా వేగవంతం చేస్తుందో చెప్పడానికి ఒక నమూనాగా నిలుస్తుందని కేటీఆర్ పేర్కొన్నారు. "హైదరాబాద్ కేంద్రంగా పనిచేస్తూ, టీహబ్‌లో ఎదిగిన స్కైరూట్ ఈ స్థాయికి చేరుకోవడం నిజంగా స్ఫూర్తిదాయకం. ఈ విజయం తెలంగాణలో అభివృద్ధి చేసిన మొత్తం ఎకోసిస్టమ్‌కు దక్కుతుంది," అని ఆయన అన్నారు. ఈ ప్రయాణంలో అప్పటి ప్రభుత్వం పోషించిన పాత్రను మరియు స్టార్టప్ ఈకోసిస్ట్ ముఖ్యంగా టిహబ్ పాత్రను గుర్తుచేసుకుంటూ, స్కైరూట్ ఏరోస్పేస్ కోఫౌండర్ మరియు సీఈఓ పవన్ కుమార్ చందన కేటీఆర్‌కు ధన్యవాదాలు తెలిపారు. "హైదరాబాద్‌లో ప్రపంచం మెచ్చే అద్భుతమైన స్టార్టప్ ఎకోసిస్టమ్‌ను నిర్మించడంలో టీహబ్ ఒక గొప్ప సాధనంగా పనిచేసింది," అని చందన పేర్కొన్నారు. తెలంగాణలోని ఇన్నోవేషన్ హబ్‌స్‌లో ఉన్న 'ప్లగ్ అండ్‌ప్లే' సౌకర్యాలు మరియు సహకార వాతావరణం వల్ల తాము సంక్లిష్టమైన ఇంజనీరింగ్ పనులపై దృష్టి సారించి, సంస్థను వేగంగా విస్తరించగలిగామని ఆయన చెప్పారు. స్కైరూట్ ఏరోస్పేస్ యూనికార్న్‌గా ఎదగడం వల్ల రాష్ట్రంలోని ఏరోస్పేస్ మరియు డిఫెన్స్ రంగాలలో కొత్త పెట్టుబడులు వచ్చే అవకాశం ఉంది. ఇప్పటికే అంతర్జాతీయ టెక్ దిగ్గజాలకు మరియు రక్షణ రంగ తయారీ సంస్థలకు నిలయంగా ఉన్న హైదరాబాద్, హార్డ్‌వేర్ మరియు ఫ్రాంటియర్ టెక్నాలజీలకు "స్టార్టప్ క్యాపిటల్ ఆఫ్ ఇండియా"గా తన స్థానాన్ని మరింత సుస్థిరం చేసుకుంది. స్కైరూట్ తన 'విక్రమ్' సిరీస్ రాకెట్ల అభివృద్ధిని కొనసాగిస్తుండగా, రాష్ట్రానికి, దేశానికి గర్వకారణంగా నిలుస్తున్న స్థానిక ప్రతిభను ప్రోత్సహించాల్సిన అవసరాన్ని ఈ విజయం మరోసారి చాటిచెప్పింది. టీహబ్ అనేది హైదరాబాద్ కేంద్రంగా పనిచేసే ఒక ఇన్నోవేషన్ హబ్ మరియు ఎకోసిస్టమ్, దీన్ని అప్పటి ఐటీ శాఖ మంత్రి కేటీఆర్ హయాంలో ప్రారంభిచబడింది. ప్రభుత్వం, విద్యాసంస్థలు మరియు ప్రైవేట్ రంగాల మధ్య సమన్వయాన్ని సాధించడం ద్వారా స్టార్టప్‌ల వృద్ధికి తోడ్పడుతూ, భారతదేశపు అగ్రగామి ఆవిష్కరణల వ్యవస్థకు ఇది నాయకత్వం వహిస్తోంది.

---

# వైభవంగా కొనసాగుతున్న రైతు వారోత్సవాలు




హైదరాబాద్, మే 8 (వెలుతురు): తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా అమలు చేస్తున్న “ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక” 99 రోజుల కార్యక్రమంలో భాగంగా, మే 4 నుండి 9 వరకు రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహిస్తున్న “రైతు వారం” కార్యక్రమాలు ఘన విజయవంతంగా కొనసాగుతున్నాయి. వ్యవసాయ శాఖతో పాటు అనుబంధ శాఖల సమన్వయంతో రైతులకు ఆధునిక సాగు పద్ధతులు, శాస్త్రీయ వ్యవసాయం, మార్కెటింగ్, యాంత్రీకరణ, పశుసంవర్ధక మరియు నీటిపారుదల అంశాలపై విస్తృత స్థాయిలో అవగాహన కల్పిస్తున్నారు.

నేల ఆరోగ్యం - శాస్త్రీయ సాగుకు తొలి అడుగు మే 4న వికారాబాద్ జిల్లా తాండూరులో వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు రైతు వారం కార్యక్రమాలను ప్రారంభించారు, సేంద్రియ రైతులు పండించిన పంటల ఉత్పత్తులను క్రయవిక్రయాల కోసం తెలంగాణ రాష్ట్ర విత్తన మరియు సేంద్రీయ ధ్రువీకరణ అథారిటీ డెవలప్ చేసిన టీజీ ఆర్గానిక్స్ మొబైల్ యాప్ మంత్రి చేతుల మీదుగా ప్రారంభించబడింది. రాష్ట్రవ్యాప్తంగా 14,565 మట్టి నమూనాలను సేకరించి, 20,734 మట్టి విశ్లేషణ పత్రాలను రైతులకు అందజేశారు. నానో ఎరువుల వినియోగం, ప్రకృతి వ్యవసాయం, సన్న వరి సాగు వంటి అంశాలపై రైతులకు శాస్త్రీయ అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమాల్లో 1,32,423 మంది రైతులు ప్రత్యక్షంగా పాల్గొన్నారు. ఆధునిక సాంకేతికతతో ఉద్యానవన రంగానికి ఊతం 5న హనుమకొండలో మంత్రులు పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, కొండ సురేఖ ఆధ్వర్యంలో మెగా రైతు మేళా నిర్వహించారు. ప్రత్యామ్నాయ పంటల సాగు, ముఖ్యంగా ఆయిల్ పామ్, నూనె గింజలు, పప్పు ధాన్యాల సాగుపై రైతులకు శిక్షణ ఇచ్చారు. బిందు సేద్యం, నీటి పొదుపు సాంకేతికతల వినియోగంపై ప్రత్యేక అవగాహన కల్పించారు.

**రైతుకు ఆర్థిక భరోసా – మార్కెటింగ్ సదుపాయాలపై దృష్టి**

మే 6న రైతులకు పంట రుణాలు, కిసాన్ క్రెడిట్ కార్డులు, సహకార సంఘాల సేవలపై ప్రత్యేక శిక్షణ కార్యక్రమాలు నిర్వహించారు. రాష్ట్రవ్యాప్తంగా 12,779 మంది రైతులు ఈ కార్యక్రమాల్లో పాల్గొన్నారు. గోదాముల నిల్వ సదుపాయాలు, కనీస మద్దతు ధర (MSP), మార్కెటింగ్ అవకాశాలపై మార్కెటింగ్ శాఖ అధికారులు రైతులకు వివరించారు.

**యాంత్రీకరణ – సౌర విద్యుత్ వినియోగంపై అవగాహన**

మే 7న ఆధునిక వ్యవసాయ యంత్రాలు, డ్రోన్ సాంకేతికత ప్రదర్శనలు నిర్వహించారు. 45,901 మంది రైతులు పాల్గొన్న ఈ కార్యక్రమాల్లో 1,344 వ్యవసాయ యంత్రాలను ప్రదర్శించారు. 370 మంది రైతుల నుండి యంత్రాల కోసం దరఖాస్తులు స్వీకరించారు. అలాగే పీఎం కుసుమ్ పథకం కింద సౌర విద్యుత్ ప్లాంట్ల ఏర్పాటు, సబ్సిడీలపై అవగాహన కల్పించారు.

**పశుసంవర్ధక, మత్స్య, నీటిపారుదల రంగాలకు ప్రాధాన్యం**

మే 8న నిర్వహించిన మండల స్థాయి సమావేశాల్లో పశుసంవర్ధక, మత్స్య మరియు నీటిపారుదల శాఖల అధికారులు రైతులకు ప్రత్యేక శిక్షణ ఇచ్చారు. వేసవిలో పశువుల సంరక్షణ, పచ్చిగడ్డి సాగు, చెరువుల నిర్వహణ, చేపల ఉత్పత్తి పెంపు, కాలువల మరమ్మతులు, గేట్ల నిర్వహణ వంటి అంశాలపై కార్యాచరణ వివరించారు. రైతు వారం కార్యక్రమాల ద్వారా రైతుల్లో శాస్త్రీయ దృక్పథం పెంపొందించి, వ్యవసాయ ఖర్చులు తగ్గించి, దిగుబడులు మరియు ఆదాయాలు పెంచడం ద్వారా తెలంగాణ వ్యవసాయ రంగాన్ని మరింత బలోపేతం చేయాలని రాష్ట్ర ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. మెగా రైతు మేళలో పాల్గొని మంత్రి తుమ్మల మాట్లాడుతూ రైతులు పండించిన వరి మొక్కజొన్న జొన్న పంటలను ప్రభుత్వమే కొనుగోలు చేసి రైతులను ఆదుకుంటుం దని రైతులు ప్రత్యామ్నాయ పంటల వైపు మొగ్గు చూపుతూ అధిక ఆదాయం ఇచ్చే ఆయిల్ ఫామ్ పంటను సాగు చేయాలని దీనికి ప్రభుత్వం సబ్సిడీ అందజేస్తుందన్నారు. ప్రభుత్వ నిర్ణయించిన ధరకే కొనుగోలు చేస్తుందని రైతులు ఈ పంట పండించడం ద్వారా అధిక ఆదాయం పొందే అవకాశం ఉందని వారికి బదులుగా పప్పు దినుసులు కూరగాయ పంటలను పూల మొక్కలను పండించడం ద్వారా అధిక ఆదాయం పొందాలని సూచించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన వ్యవసాయ, అనుబంధ రంగాలకు సంబంధించిన ప్రదర్శన స్టాళ్లను తిలకించడం జరిగింది. ఈ కార్యక్రమంలో వ్యవసాయ శాఖ మంత్రితో పాటుగా మంత్రులు కొండా సురేఖ, ఎంపీ కావ్య శాసనసభ్యులు శ్రీహరి, వ్యవసాయ శాఖ కార్యదర్శి కె. సురేంద్ర మోహన్,ఇతర ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

వ్యవసాయ సంచాలకులు డా.బి. గోపి ఐ.ఏ.ఎస్ మాట్లాడుతూ 'చివరి రోజు మే 9న నీటిపారుదల శాఖ ఆధ్వర్యంలో చెరువుల కంపచెట్లు, గుర్రపు డెక్క తొలగింపు సమతుల్య నీటి వినియోగంపై రైతులకు అవగాహనతో ఈ రైతు వారోత్సవ అవగాహన కార్యక్రమాలు ముగుస్తాయి. ఈ రైతు వారోత్సవ కార్యక్రమాలు రైతులకు శాస్త్రీయ అవగాహన ఆధునిక సాంకేతిక ఆర్థిక భరోసా అందిస్తూ వ్యవసాయ అభివృద్ధికి దోహదపడుతున్నాయి. రైతు సంక్షేమం ద్వారా తెలంగాణ వ్యవసాయ రంగం మరింత బలపడుతుందని ప్రభుత్వం విశ్వసిస్తుంది.' అని అన్నారు.



# మ్యాప్స్ ఇంద్రజాలం

గూగుల్ మ్యాప్స్ గురించి కొత్తగా చెప్పాల్సిన పనిలేదు. ఇదిప్పుడు అందరి ఫోన్లలోనూ నిక్షిప్తమయ్యింది. కొత్త చోట్లకు ఎక్కడికి వెళ్లాలన్నా ఇదే దారి చూపుతోంది. లొకేషన్‌ను గుర్తించటానికీ ఉపయోగిస్తుంటాం. కొందరైతే పెట్రోలు పంపులు ఎక్కడున్నాయో తెలుసుకోవటానికీ వాడుతుంటారు. అయితే ఇందులో చాలామందికి తెలియని ఫీచర్లూ ఎన్నో ఉన్నాయి. ఇవి అలాంటివే. అయితే ముందుగా గూగుల్ మ్యాప్స్‌ను అప్‌డేట్ చేసుకోవాలని మరవొద్దు.

### ఆస్క్ మ్యాప్స్

ఎక్కడికైనా వెళ్లాలని అనుకుంటున్నారా? ఎలా ప్లాన్ చేసుకోవాలో తెలియటం లేదా? అయితే ఆస్క్ మ్యాప్స్ సాయం తీసుకోవచ్చు. ఉదాహరణకు నేను ఆదివారం హైదరాబాద్ నుంచి విజయవాడకు వెళ్లాలని అనుకుంటున్నా. లంచ్ కోసం ఎక్కడ ఆగాలి? దారిలో చూడదగ్గ ప్రదేశాలు ఏమేం ఉన్నాయి?' అని ప్రశ్నించారనుకోండి. అప్పుడు దానిలోని జెమినై ఏఐ ఆ దారి వెంట ఉండే హోటళ్లు, రెస్టరెంట్లు, పర్యటక ప్రాంతాలకు సంబంధించిన రివ్యూలను పరిశీలించి సమాధానమిస్తుంది. ఇది 30 కోట్ల ప్రాంతాలు, 50 కోట్ల కమ్యూనిటీ రివ్యూలను పరిశీలించగలదు. మన దేశంలో ఆండ్రాయిడ్, ఐఓఎస్ యూజర్లందరికీ ఈ ఫీచర్ అందుబాటులో ఉంది.

ఇలా వాడుకోవాలి: సెర్చ్ బార్ కింద ఉండే ఆస్క్ మ్యాప్స్ బటన్ మీద తాకాలి. మామూలు భాషలో ప్రశ్నను టైప్ చేయాలి.

### 3డీ వ్యూలో దృశ్యాలు

మ్యాప్స్ రూపొందించినప్పటి నుంచీ గూగుల్ తీసుకొచ్చిన అతిపెద్ద అప్‌డేట్ ఇదే అనుకోవచ్చు. నీలం బాణం గుర్తుకు బదులు 3డీలో దృశ్యాలను చూపిస్తుంది. ముందుకు సాగుతున్నకొద్దీ దారితో పాటు భవనాలు, వంతెనలు, ట్రాఫిక్ లైట్లు, క్రాస్‌వాక్స్, లేన్ మార్కింగ్స్ వంటివన్నీ ఫొటోరియలిస్టిక్‌గా కనిపిస్తాయి. భవనాలను పారదర్శకంగా చూపించటం ద్వారా వాటి వెనకాల ఉన్నవేంటో కూడా చూడొచ్చు. సంక్లిష్ట ఫ్లైఓవర్లు, కూడళ్లు ఉన్న మనదేశంలో ఇదెంతో ఉపయుక్తం.

**ఇలా వాడుకోవాలి:**

ప్రయాణాన్ని ఆరంభించాక నావిగేషన్ స్క్రీన్‌లో పైన కుడి మూలన ఉండే 3డీ గుర్తును తాకాలి.

### ఆటో అప్‌డేటెడ్ ఆఫ్‌లైన్ మ్యాప్స్

మ్యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకొని, ఆఫ్‌లైన్‌లో వాడుకోవచ్చన్నది తెలిసిందే. అయితే డౌన్‌లోడ్ చేసుకున్న మ్యాప్‌లు వైఫై అందుబాటులో ఉన్నప్పుడు వాటికవే రిఫ్రెష్ అవుతాయని చాలామందికి తెలియదు. అంటే ఆఫ్‌లైన్ మ్యాప్‌లు సైతం ప్రస్తుతమున్న రోడ్డు, నిర్మాణ డేటానే కలిగుంటాయన్నమాట.

**ఇలా వాడుకోవాలి:**

పట్టణం లేదా ప్రాంతాన్ని సెర్చ్ చేసి, డౌన్‌లోడ్ మీద తాకాలి. ఆ మ్యాప్ దానికదే అప్‌డేట్ అవుతుంది.

### నో బిఫోర్ యు గో సారాంశాలు

ఏదో కొత్త ప్రదేశానికి వెళ్తున్నారు. అక్కడ ఏయే సౌకర్యాలున్నాయో తెలుసుకోవాలంటే యూజర్ల రివ్యూలను చూస్తుంటాం కదా. ఇలా బోలెడన్ని రివ్యూలను చదివే పనిలేకుండా వాటి సారాంశాన్ని తెలియజేసేదే నో బిఫోర్ యు గో సదుపాయం. ఇది యూజర్ రివ్యూల ఆధారంగా అత్యంత సమంజసమైన వివరాలతో కూడిన ఏఐ జనరేటెడ్ సారాంశాన్ని అందిస్తుంది. అక్కడ ఎక్కువ మందికి నచ్చినవేంటి? వేటిని వదిలేయాలి? ఎంత సేపు వేచి ఉండాల్సి వస్తుంది? పార్కింగ్ అందుబాటులో ఉందా? వంటివన్నీ తెలుస్తాయి.

**ఇలా వాడుకోవాలి:**

ఏదైనా రెస్టరెంట్, షాప్ లేదా ఆకర్షణీయ ప్రాంతాన్ని సెర్చ్ చేయాలి. వాటి జాబితా మీద పైకి స్క్రోల్ చేస్తే నో బిఫోర్ యు గో విభాగం కనిపిస్తుంది.

### లైవ్ వ్యూతో నడక

తెలియని ప్రదేశంలో నడుస్తున్నారు. అక్కడి భవనాలు, ప్రాంతం వివరాలను తెలుసుకోవాలని అనుకుంటున్నారు. కానీ ఎలా? ఇక్కడే లైవ్ వ్యూ సాయం చేస్తుంది. మ్యాప్స్‌లో వాకింగ్ మోడ్‌ను ఎంచుకొని, ఎదురుగా ఉన్న వాటిపై ఫోన్ కెమెరాను ఫోకస్ చేస్తే చాలు. అప్పుడది ఆగ్మెంటెడ్ రియాల్టీ పరిజ్ఞానంతో వాకింగ్ బాణం గుర్తులను, వీధులు, దుకాణాల పేర్ల వంటి వాటిని ప్రత్యక్షంగా కెమెరా ఫీడ్‌లో కనిపించేలా చేస్తుంది. రద్దీ భారతీయ మార్కెట్లలో 2డీ మ్యాప్ కన్నా ఇది అనువుగా ఉంటుంది. ముంబై, దిల్లీ, బెంగళూరు, హైదరాబాద్, చెన్నై, పుణె నగరాల్లో ఈ ఫీచర్ అందుబాటులో ఉంది. మున్ముందు మరిన్ని నగరాలకు విస్తరించనున్నారు.

**ఇలా వాడుకోవాలి:**

లక్ష్యాన్ని సెర్చ్ చేసి 'డైరెక్షన్స్' ఎంచుకోవాలి. వాకింగ్ గుర్తును తట్టి, లైవ్ వ్యూ బటన్ మీద తాకాలి.

### యాక్సెసబుల్ ప్రాంతాల గుర్తింపు

దివ్యాంగుల వంటి వారు వీల్ చైర్లను వాడుతుంటారు. అయితే అన్నిచోట్లా వీటితో వెళ్లటం కుదరకపోవచ్చు. ఇలాంటప్పుడు యాక్సెసబుల్ ప్లేసెస్ ఫీచర్ బాగా ఉపయోగపడుతుంది. వీల్‌చైర్లు వెళ్లటానికి అనువైన ప్రవేశ ద్వారాలు, బాత్రూమ్‌లు, మెట్లు లేని దారులు గల చోట్లను చూపిస్తుంది. వీల్‌చైర్ వాడేవారికే కాదు, వృద్ధులకు, లగేజ్ మోసేవారికి కూడా ఇది ఉపయోగపడుతుంది.

**ఇలా వాడుకోవాలి:**

సెటింగ్స్ ద్వారా యాక్సెసబిలిటీలోకి వెళ్లి యాక్సెసబుల్ ప్లేసెస్ ఫీచర్‌ను ఆన్ చేసుకోవాలి.


### బృంద ప్రయాణాలకు షేర్

గూగుల్ డాక్‌ను షేర్ చేయటం తెలిసిందే. బృంద ప్రయాణాలకు సన్నద్ధమయ్యేటప్పుడు ఆయా ప్రాంతాలను షేర్ చేస్తే? చాలా బాగుంటుంది కదా. షేర్ ఫీచర్ అదే చేస్తుంది. రెస్టరెంట్లు, హోటళ్లు, ఆకర్షణీయ ప్రాంతాల జాబితా సిద్ధం చేసి స్నేహితులు లేదా కుటుంబ సభ్యులకు షేర్ చేయొచ్చు. అప్పుడు వాళ్లు తమ సూచనలను, సలహాలను పంచుకోవచ్చు. రేటింగ్ ఇవ్వచ్చు.

**ఇలా వాడుకోవాలి:**

సేవ్డ్ ద్వారా లిస్ట్‌స్‌లోకి వెళ్లి న్యూ లిస్ట్ మీద తాకాలి. తర్వాత అవసరమైనవారికి షేర్ చేయాలి.

# సామాజిక మాధ్యమాలతో సంతోషం ఆవిరి!



ఉదయం లేచింది మొదలు రాత్రి పడుకునే వరకూ వాట్సప్, ఫేస్‌బుక్, ఎక్స్, ఇన్‌స్టాగ్రామ్ వంటి సామాజిక మాధ్యమాలతోనే. ఇవి చాలవన్నట్టు వేళాపాళా లేకుండా వచ్చిపడే ఈమెయిళ్లు, వెబ్‌సైట్లలో సమాచార శోధనతో తీరికన్నదే లేకుండా పోతోంది. ఇలాంటి డిజిటల్ వాతావరణం నేటి తరంలో ఆనందాన్ని తగ్గిస్తోందా? తాజా వరల్డ్ హ్యాపినెస్ రిపోర్టు ఇది నిజమనే చెబుతోంది.

సామాజిక మాధ్యమాలను అతిగా వాడటం వల్ల ఇంగ్లిష్ మాట్లాడే దేశాల యువతలో.. ముఖ్యంగా అమ్మాయిల్లో సుఖ సంతోషాలు తగ్గుముఖం పడుతున్నట్టు తేలింది. ఇది అక్కడి పరిస్థితులను చూపించినప్పటికీ ప్రపంచవ్యాప్తంగా సామాజిక మాధ్యమాలు, సంతోషానికి మధ్య సంబంధం మీద ఓ సమగ్ర రూపాన్ని అందించింది.

సామాజిక మాధ్యమాలను తక్కువగా వాడేవారిలో జీవితంలో సంతృప్తి చెందటం చాలా ఎక్కువగా ఉంటున్నట్టు ప్రోగ్రామ్ ఫర్ ఇంటర్నేషనల్ స్టూడెంట్ అసెస్‌మెంట్ (పీఐఎస్ఏ) డేటా చెబుతోంది. అంతర్జాలాన్ని వాడుకునే తీరుతోనూ ఇది మారిపోతోంది. కమ్యూనికేషన్లు, వార్తలు, నేర్చుకోవటం, కంటెంట్ సృష్టించటం మూలంగా జీవితంలో సంతృప్తి అతి ఎక్కువగా ఉంటుండగా.. సామాజిక మాధ్యమాలు, ఆన్‌లైన్ గేమ్స్, సరదా కోసం బ్రౌజ్ చేయటంతో తక్కువగా ఉంటున్నట్టు తేలింది.

సామాజిక మాధ్యమాలతో విచారం, ఆందోళన వంటి భావాలకు లోనవుతున్నట్టు యువతకు తెలుస్తూనే ఉందనీ పరిశోధకులు గుర్తించారు. అయినా ఎందుకని వీటి వాడకాన్ని ఆపలేకపోతున్నారు? దీనికి కారణం తోటివారి ప్రోద్బలమేనని బయటపడింది. తమ తోటివారు సామాజిక మాధ్యమాలతో గడపటం మూలంగా తామెక్కడ వెనకబడి పోతామోననే భయంతోనే చాలామంది యువతీ యువకులు వీటికి సమయం వెచ్చిస్తుండటం గమనార్హం. మామూలుగానైతే సామాజిక మాధ్యమాలు పెద్ద హానికరం కాదు. కానీ అతి వాడకమే సమస్యాత్మకంగా పరిణమిస్తోంది.

రోజుకు ఐదు గంటల కన్నా ఎక్కువసేపు వీటితో గడిపే వారిలో ఆనందం పాళ్లు తక్కువగా ఉంటున్నాయి. అదే సమయంలో ఒత్తిడి, కుంగుబాటు లక్షణాలు, ఇతరులతో తమను ప్రతికూలంగా పోల్చుకోవటం మరింత ఎక్కువగా కనిపిస్తున్నాయి. సామాజిక మాధ్యమాల మీద బాగా ఆధారపడేవారిలో, ఆన్‌లైన్ ఇన్‌ఫ్లుయెన్సర్లను అనుసరించే వారిలో, పలురకాల వేదికలను వాడేవారిలో ఇవి ఇంకాస్త ప్రస్ఫుటంగానూ ఉంటున్నాయి.

**ఏం చేయాలి?**

- ప్రస్తుతం అన్నిచోట్లా సామాజిక మాధ్యమాలు విస్తరించిన నేపథ్యంలో ఆనందంగా ఉండటానికి మరేం చేయాలి?
- వీలైనంత వరకూ సామాజిక మాధ్యమ వేదికలతో గడిపే సమయం తగ్గించుకోవాలి. మొత్తంగా మానెయ్యటం సాధ్యం కాకపోవచ్చు గానీ రోజుకు గంట కన్నా మించకుండా చూసుకోవటం కష్టమేమీ కాదు. దీంతో సంతోషం గణనీయంగా ఇనుమడిస్తుందనీ పరిశోధకులు గుర్తించారు. సామాజిక మాధ్యమాల కన్నా ఆన్‌లైన్‌లో ఇతర ఆరోగ్యకర మార్గాలను అనుసరించాలి.
- 'ఇలా ఉంటేనే పర్‌ఫెక్ట్' అని చెప్పే ఇన్‌ఫ్లుయెన్సర్లను అన్‌ఫాలో లేదా మ్యూట్ చేయటం ద్వారా మీడియా ఫీడ్‌ను తగ్గించుకోవాలి.
- భోజనం చేసేటప్పుడు ఫోన్ వాడకపోవటం, సెలవు రోజున యాప్స్ జోలికి వెళ్లకపోవటం, రాత్రి 9 తర్వాత స్క్రోలింగ్ చేయకపోవటం వంటి నిబంధనలు పెట్టుకొని, కచ్చితంగా పాటించాలి.
- ఒకవేళ సామాజిక మాధ్యమాల వాడకాన్ని తగ్గిస్తే ఆ సమయాన్ని ఆటలు, క్లబ్‌లకు వెళ్లటం, స్వచ్ఛంద కార్యక్రమాలు చేయటం, పుస్తకాలు చదువుకోవటం వంటి వాటికి వెచ్చించాలి. దీంతో ఏదో కోల్పోయామన్న వెలితిని చాలావరకూ తగ్గించుకోవచ్చు.
- సామాజిక మాధ్యమాలు తమ సంతోషాన్ని ఎలా దెబ్బకొడుతున్నాయో గుర్తించి, దానికి అనుగుణంగా ఆన్‌లైన్ ప్రవర్తనను మార్చుకోవాలి.
- తల్లిదండ్రులు మార్గదర్శకంగా నిలవాలి. పిల్లల వయసుతో నిమిత్తం లేకుండా ఎంతసేపు సామాజిక మాధ్యమాలను వాడుకోవాలో కచ్చితంగా నిర్దేశించాలి. వీటి వాడకంతో ఒనగూరే లాభనష్టాల గురించి వారితో చర్చించాలి.

# ఎండల్లో యాపిల్ పానీయం


చల్లటి పానీయం ఎంతగానో సేదతీరుస్తుంది. ముఖ్యంగా మండుటెండల్లో మరింత హాయి. అలసట తగ్గి.. ఎక్కడ లేని హుషారూ వచ్చేస్తుంది. మరి ఈ కాలంలో ఆస్వాదించేందుకు యాపిల్ కాన్సన్ట్రేట్ చేసుకుందామా..

**కావలసినవి:**

యాపిల్ పండ్లు కిలో,
పంచదార అరకిలో,
దాల్చినచెక్క రెండంగుళాల ముక్క,
నిమ్మరసం రెండు టేబుల్ స్పూన్లు,
నీళ్లు కప్పు

**తయారీ:**

యాపిల్ పండ్లను కడిగి చెక్కు, గింజలు తీసి చిన్న ముక్కలుగా కట్ చేయాలి. వాటిని అడుగుభాగం మందంగా ఉన్న పాత్రలో వేసి.. కప్పు నీళ్లు పోసి మధ్యస్థమైన సెగ మీద ఉడికించాలి. యాపిల్ మెత్తగా అవడానికి సుమారు పావుగంట సమయం పడుతుంది. అప్పుడు సెగ తీసేయాలి. చల్లారిన తర్వాత గ్రైండ్ చేయాలి. ఈ గుజ్జును మళ్లీ పాత్రలోకి తీసి.. పంచదార, దాల్చినచెక్క పొడి జతచేసి ఇంకో 20 నిమిషాలు ఉడికించాలి. మిశ్రమం చిక్కగా, తేనెను తలపించే సాంద్రతతో ఉన్నప్పుడు నిమ్మరసం జతచేయాలి. కలియతిప్పుతూ కొన్నిక్షణాలుంచి దించేయాలి. చల్లారిన తర్వాత మరింత చిక్కబడుతుంది. నిమ్మరసం సహజ ప్రిజర్వేటివ్‌లా పనిచేస్తుంది. గాజు సీసాను స్టెరిలైజ్ చేసి.. పూర్తిగా ఆరబెట్టాలి. యాపిల్ కాన్సన్ట్రేట్‌ను అందులోకి తీసి.. రిఫ్రిజిరేటర్‌లో భద్రం చేసుకోవాలి. ఇది మూడు నెలలు నిల్వ ఉంటుంది. ఫ్రీజర్‌లో అయితే ఆరు నెలల వరకు నిల్వ ఉంటుంది. తాగదలచినప్పుడు గ్లాసు నీళ్లలో టేబుల్ స్పూన్ కాన్సన్ట్రేట్ కలిపితే సరిపోతుంది. త్వరగా పాడవకూడదంటే.. ఉడికించేటప్పుడు నీళ్లు తగిన పరిమాణంలోనే ఉండాలి. తడి లేని స్పూన్నే ఉపయోగించాలి.



# జిల్లా అధ్యక్ష పదవి రేసులో కర్రె వెంకటయ్య ముందు వరుసలో..??





- **కర్రె వెంకటయ్య కు త్వరలో బిఆర్ఎస్ జిల్లా అధ్యక్ష పదవి.?**
- **బీసీ కోటాలో ఆయన పేరును పరిశీలిస్తున్న పార్టీ అధిష్టానం**
- **కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు గా కొనసాగుతున్న కురుమ సామాజిక వర్గానికి చెందిన ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య ...**
- **అదే సామాజిక వర్గానికి చెందిన కర్రె వెంకటయ్య అయితేనే బాగుంటుంది... అనే యోచనలో బిఆర్ఎస్ పార్టీ పెద్దలు..??**

**యాదగిరిగుట్ట వెలుతురు మే 08:**

బి ఆర్ ఎస్ పార్టీ యాదాద్రి భువనగి రి జిల్లా అధ్యక్ష పదవి రేసులో ఆ పార్టీ సీనియర్ నాయకుడు , తెలంగాణ ఉద్యమ నేత, యాదగిరిగుట్ట మండల బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు కర్రె వెంకటయ్య ముందు వరుసలో ఉన్నట్లు తెలుస్తోంది. యాదాద్రి భువనగిరి జిల్లా బీఆర్ఎస్ అధ్యక్ష పదవి కోసం పలువురు నేతలు తీవ్రంగా పోటీ పడుతున్నట్లు సమాచారం... నువ్వా ? నేనా ? అన్నట్లుగా ఆ నేతలు పెద్ద ఎత్తున తమ తమ ప్రయత్నాలను ముమ్మరం చేసినట్లు తెలుస్తోంది. ఈసారి ఎలాగైనా బిఆర్ఎస్ జిల్లా అధ్యక్ష పదవిని దక్కించుకోవాలని సుమారు అరడజను మంది నేతలు బిఆర్ఎస్ రాష్ట్ర నేతలను తరచుగా కలుస్తూ తమ ప్రయత్నాలను ముమ్మరం చేశారు . ఈ మేరకు పెద్ద ఎత్తున ఆయా నేతలు రాష్ట్ర నేతల చుట్టూ ప్రదక్షిణాలు చేస్తూ వారి ఆశీస్సుల కోసం తమ వంతు ప్రయత్నాలను చేస్తున్నట్లు విశ్వసనీయ సమాచారం . కాగా తెలంగాణ ఉద్యమ సమయం నుండి అప్పటి టిఆర్ఎస్ ప్రస్తుత బిఆర్ఎస్ పార్టీ అభివృద్ధి కోసం ఎంతగానో కృషి చేస్తున్న కర్రె వెంకటయ్య కు ఈసారి ఎలాగైనా బిఆర్ఎస్ జిల్లా అధ్యక్ష బాధ్యతలు అప్పగించాలని జిల్లాలోని పలువురు బిఆర్ఎస్ నాయకులు కార్యకర్తలు గట్టిగా కోరుతున్నట్లు తెలుస్తోంది. ఆయా సమస్యలపై పోరాటాలు ఆందోళనల నేపథ్యంలో పదుల సంఖ్యలో కేసులు నమోదైనా ప్రజా ఉద్యమాలలో పోరాటాలలో చురుకుగా పాల్గొంటూ బిఆర్ఎస్ పార్టీని క్షేత్రస్థాయిలో బలోపేతం చేస్తున్న బలమైన చురుకైన నేతగా కర్రె వెంకటయ్య కు మంచి పేరు ఉంది. గతంలోనే కర్రె వెంకటయ్య కు బిఆర్ఎస్ జిల్లా అధ్యక్ష పదవి దక్కాల్సి ఉన్నప్పటికీ ... అప్పట్లో జిల్లా అధ్యక్ష పదవి రేసులో ఆయన చివరి వరకు కొనసాగినప్పటికీ... కొన్ని రాజకీయ అనివార్య కారణాల వల్ల కర్రె వెంకటయ్య కు జిల్లా అధ్యక్ష పదవి అప్పట్లో దక్కలేదు. ఈసారైనా ఎట్టి పరిస్థితుల్లో కర్రె వెంకటయ్య కు జిల్లా అధ్యక్ష పదవి ఇవ్వాల్సిందేనని ఆ పార్టీలో పలువురు కార్యకర్తలు నాయకులు గట్టిగా కోరుతున్నట్లు తెలుస్తోంది ....అధికార కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడిగా ప్రభుత్వ విప్ , ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య ఉన్నారు. ఆయన కురుమ సామాజిక వర్గానికి చెందిన బలమైన నేత... అదే సామాజిక వర్గానికి చెందిన కర్రె వెంకటయ్య కు బిఆర్ఎస్ జిల్లా అధ్యక్ష పదవి బాధ్యతలు అప్పగిస్తే అధికార పార్టీని మరింత గట్టిగా ఎదుర్కోవచ్చనే అభిప్రాయం బిఆర్ఎస్ లో బలంగా వినిపిస్తోంది ...దీంతో పాటుగా ప్రధాన పార్టీలైన కాంగ్రెస్ బిజెపి పార్టీలు తమ పార్టీ జిల్లా అధ్యక్ష పదవులను బీసీ నేతలకే అప్పగించాయి. కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడిగా ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య, బిజెపి జిల్లా అధ్యక్షుడిగా ఉట్కూరి అశోక్ గౌడ్ లు ఉన్నారు. వీరిద్దరూ బీసీ సామాజిక వర్గానికి చెందిన నేతలే కావడం విశేషం... కాగా ప్రస్తుతం బిఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడిగా ఓసి సామాజిక వర్గానికి చెందిన నేత ఉన్నారు. ఈ నేపథ్యంలో యాదాద్రి భువనగిరి జిల్లాలో బీసీలు బలంగా ఉన్నందున బీసీ సామాజిక వర్గానికి చెందిన నేతకే బీఆర్ఎస్ అధ్యక్ష పదవిని అప్పగించాలని బిఆర్ఎస్ పార్టీలో పలువురు కీలక నేతలు కార్యకర్తలు అభిప్రాయపడుతున్నట్లు తెలుస్తోంది . ప్రధాన పార్టీలైన కాంగ్రెస్ బిజెపిలు బీసీ నేతలకు జిల్లా అధ్యక్ష పదవిని ఇస్తే బిఆర్ఎస్ పార్టీ మాత్రం ఓసి నేతకు ఇచ్చిందనే విమర్శను ఇప్పటికైనా తొలగించుకోవాలని పార్టీలో అంతర్గతంగా పలువురు నేతలు కార్యకర్తలు అభిప్రాయపడుతున్నట్లు తెలుస్తోంది. బిఆర్ఎస్ పార్టీ ఉమ్మడి నల్గొండ జిల్లాలో యాదాద్రి భువనగిరి జిల్లా అధ్యక్ష పదవిని ఈసారైనా బీసీ నేతకు కేటాయించాలని అప్పుడే పార్టీకి మరింత బలం చేకూరుతుందని పలువురు అభిప్రాయపడుతున్నట్లు తెలుస్తోంది . ప్రధానంగా కర్రె వెంకటయ్య ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలపై గట్టిగా పోరాడుతూ ఎప్పటికప్పుడు స్పందిస్తూ నిత్యం ప్రజల్లో ఉంటుండడం ఆయనకు కలిసి వచ్చే అంశం . ఆయనకు మాజీ ప్రభుత్వ విప్, మాజీ ఆలేరు ఎమ్మెల్యే గొంగిడి సునీత రెడ్డి , ఉమ్మడి నల్గొండ జిల్లా మాజీ డిసిసిబి చైర్మన్ గొంగిడి మహేందర్ రెడ్డిల ఆశీస్సులు , అండదండలు దండిగా ఉన్నాయని తెలుస్తోంది. దీంతో పాటుగా బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, మాజీ మంత్రి , బిఆర్ఎస్ మరో అగ్ర నేత హరీష్ రావుల ఆశీస్సులు కర్రె వెంకటయ్య కు ఉన్నట్లు సమాచారం. దీంతోపాటుగా బిఆర్ఎస్ సారథి పెద్దాయన కేసీఆర్ మనసులోనూ కర్రె వెంకటయ్య పేరు ఉందని పలువురు చెబుతున్నారు. ప్రస్తుతం మారుతున్న రాజకీయ సమీకరణాల నేపథ్యంలో దాదాపుగా కర్రె వెంకటయ్యకే బిఆర్ఎస్ పార్టీ యాదాద్రి భువనగిరి జిల్లా అధ్యక్ష బాధ్యతలు దక్కనున్నాయని ఆ పార్టీలో విస్తృతంగా చర్చ జరుగుతోంది. కాగా జిల్లాలోని పలువురు కీలక నేతలు ఈ పదవిపై కన్నేసినట్లు సమాచారం. ఎలాగైనా ఈసారి యాదాద్రి భువనగిరి జిల్లా బిఆర్ఎస్ అధ్యక్ష పదవిని దక్కించుకొని తీరాలని ఆ నేతలు రాష్ట్ర స్థాయిలో లాబీయింగ్ ను ముమ్మరం చేసినట్లు తెలుస్తోంది. తమకు తెలిసిన రాష్ట్రస్థాయి నేతల ఆశీస్సులతో బిఆర్ఎస్ జిల్లా అధ్యక్ష పదవిని



దక్కించుకునేందుకు ప్రయత్నాలు ముమ్మరం చేసినట్టు సమాచారం. ఇటీవల బిఆర్ఎస్ పార్టీలో అన్ని కమిటీలను రద్దు చేసిన పార్టీ అధిష్టానం త్వరలో పార్టీని పూర్తిస్థాయిలో క్షేత్రస్థాయి నుండి పునర్వ్యవస్థీకరించనుంది. ఈ మేరకు గ్రామస్థాయి నుండి అన్ని కమిటీలకు నూతన కార్యవర్గాలను త్వరలో ఎన్నుకోనున్నారు. దీంతో ఇప్పటినుండే ఉమ్మడి నల్గొండ జిల్లాలో అత్యంత కీలకమైన యాదాద్రి భువనగిరి జిల్లా బి ఆర్ ఎస్ అధ్యక్ష పదవి ఎవరికి దక్కనుంది ? అనే అంశంపై ఆసక్తికరమైన చర్చ జరుగుతుంది... ఇప్పటికే ప్రధాన పార్టీలైన కాంగ్రెస్ బిజెపి జిల్లా అధ్యక్షులుగా ఆలేరు నియోజకవర్గానికి చెందిన నేతలే ఉన్నారు. కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షులుగా ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య యాదగిరిగుట్ట మండలానికి చెందిన నేత కాగా.... బిజెపి జిల్లా అధ్యక్షుడు ఉట్కూరి అశోక్ గౌడ్ రాజపేట మండలానికి చెందిన నేత... బిఆర్ఎస్ అధ్యక్ష పదవి కూడా కర్రె వెంకటయ్య కు దక్కితే మూడు పార్టీల జిల్లా అధ్యక్షులు ఆలేరు నియోజకవర్గానికి చెందినవారే కావడం అనేది ఒకింత విశేషంగా చెప్పుకోవచ్చు. ఈసారి ఎలాగైనా ఉమ్మడి నల్గొండ జిల్లాలోని నల్గొండ సూర్యాపేట యాదాద్రి భువనగిరి జిల్లాలలో యాదాద్రి భువనగిరి జిల్లాకు ఖచ్చితంగా బీసీ నేత నే బిఆర్ఎస్ అధ్యక్షుడిగా నియమించాలని బిఆర్ఎస్ పార్టీలో నాయకులు కార్యకర్తలు కోరుతుండగా, అధిష్టానం మనసులో కూడా అదే ఉందనే చర్చ ఆ పార్టీలో వినిపిస్తోంది. ఇదే జరిగితే బీసీనేతగా కర్రె వెంకటయ్య కు జిల్లా అధ్యక్ష పదవి దక్కే అవకాశాలు అత్యధికంగా ఉన్నాయని తెలుస్తోంది... పదుల సంఖ్యలో కేసులు నమోదైనా ఏమాత్రం వెనుకాడకుండా పార్టీ కోసం పనిచేస్తున్న కర్రె వెంకటయ్య కు ఈసారి ఎలాగైనా బిఆర్ఎస్ జిల్లా అధ్యక్ష పదవి ఇవ్వాలని పలువురు నాయకులు కార్యకర్తలు కోరుతున్నట్లు సమాచారం. ఈ మేరకు వారు ఇప్పటికే జిల్లా రాష్ట్రస్థాయి నేతలకు తమ తమ అభిప్రాయాలను స్పష్టంగా తెలియజేసినట్లు సమాచారం. బీసీ కోటాలో కర్రె వెంకటయ్య పేరును పార్టీ అధిష్టానం కూడా ఒకింత సీరియస్ గానే పరిశీలిస్తున్నట్లు పార్టీలో చర్చ జరుగుతుంది. కర్రె వెంకటయ్య కు బిఆర్ఎస్ జిల్లా అధ్యక్ష పదవి ఇస్తేనే ప్రస్తుతం అధికార కాంగ్రెస్ పార్టీనీ , అటు బిజెపిని గట్టిగా ఎదుర్కోవచ్చు అనేది పార్టీ నాయకులు కార్యకర్తల ఆలోచనగా తెలుస్తోంది . ఇప్పటికే బిఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షుడుగా ఉన్న కర్రె వెంకటయ్య తరచుగా కాంగ్రెస్ ప్రభుత్వ విధానాలపై విమర్శనాస్త్రాలు సంధించి ఆందోళనలు , పోరాటాలు చేయడంలో ముందుంటున్నారు. అధికార పార్టీకి చెందిన ప్రతి అంశంపై , ఆయా సమస్యలపై బిఆర్ఎస్ పార్టీ పక్షాన ముందుగా కర్రె వెంకటయ్య నే స్పందిస్తుంటారని ఆ పార్టీ నాయకులు కార్యకర్తలు అభిప్రాయపడుతున్నారు. వీటన్నింటినీ దృష్టిలో ఉంచుకొని ప్రతి నిత్యం అధికార పార్టీ ని గట్టిగా ఎదుర్కొంటూ ప్రజా ఉద్యమాలలో పాల్గొంటూ పోరాటం చేస్తున్న కర్రె వెంకటయ్య కు జిల్లా అధ్యక్ష పదవి ఇవ్వాలని ఆ పార్టీలోనీ నాయకులు కార్యకర్తలు పార్టీ అధిష్టానాన్ని పలుమార్లు కోరినట్లుగా సమాచారం. కాగా జిల్లా అధ్యక్ష పదవికి పోటీ తీవ్రంగా ఉన్న నేపథ్యంలో ఈ పదవి కర్రె వెంకటయ్యను ఈ సరైన వరిస్తుందా ? .. లేదా ?... అనే అంశంపై రాజకీయ వర్గాల్లో ఒకింత ఉత్కంఠతను, కొంత ఆసక్తికరమైన చర్చను రేకెత్తిస్తోంది.. ఈ అంశంలో ఏం జరగబోతుంది ? అనేది ముమ్ముందు తేలనుంది... అప్పటివరకు వేచి చూడాల్సిందే..!!



**పుట్ట హనుమంత్**
**( సీనియర్ జర్నలిస్ట్ )**

Edited, Printed, Published and Owner by BAKKA YADAIAH, Published & Printed at SRI SHANTHI PUBLICATIONS H.No. 7231/221/2, S.V. Colony, Bairamalaguda, Saroornagar, Mdl.R.R. DIST, Telangana79. EDITORG BAKKA YADAIAH, R.N.I. TEL TEL /2019 / 78609. Cell:91773 87328, Email: velthurunewspaper@gmail.com